# క్రాంతి

లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| ఫిలిప్పీన్స్ అధికార ప్రతినిధితో ఇంటర్వ్యూ ........ | 5 |
| పీ.జీ.ఎస్.పీ 50వ వార్షికోత్సవం ........ | 8 |
| మేడే ప్రకటనలు, వ్యాసాలు . ........ | 11 |
| అంగన్‌వాడీ పోరాట విజయం ........ | 25 |
| కర్ణాటక ఎన్నికల ఫలితాలు ........ | 29 |
| మణిపుర్‌లో హిందుత్వ రాజకీయాలు ........ | 31 |
| చండీదా అమరత్వం ........ | 34 |
| హిందుత్వ ........ | 39 |



**సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ, ఎ.ఓ.బి. కమిటీల అధికార పత్రిక**

**సంపుటి: 47 సంచిక: 3 ఫిలిప్పీన్స్ విప్లవోద్యమ సంఘీభావ ప్రత్యేక సంచిక జూన్-2023 వెల: పది రూపాయలు**


# కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావోలకు విప్లవ జోహార్లు

## ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కామ్రేడ్ లాన్, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బగోంగ్-టావో, మరో ఎనిమిది మంది పార్టీ, ఎన్‌పీఏ వీర యోధులకు విప్లవ జోహార్లు!

నిరాయుధంగా ఉన్న వీరిని పట్టుకుని, అత్యంత క్రూరంగా హత్య గావించిన ఫిలిప్పీన్స్ ఫాసిస్టు ప్రభుత్వాన్ని, దానికి మద్దతిచ్చిన అమెరికా సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా గర్హిస్తూ, వారి అత్యున్నత త్యాగాలను సమున్నతంగా ఎత్తిపడుతూ ప్రపంచవ్యాప్తంగా **జూన్ 15-16** రెండు రోజులు ప్రత్యేక సంస్మరణ కాంపెయిన్ చేపడదాం!

2022 ఆగస్టు 21వ తేదీన ఫిలిప్పీన్స్ ఫాసిస్టు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ప్రభుత్వ సైన్య చేతికి చిక్కి, తీవ్ర చిత్రహింసలు అనుభవించి, 22వ తేదీ తెల్లవారు జామున కిరాతకంగా హత్యకు గురి అయిన ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ (సీసీ) ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) చైర్మన్, 71 సంవత్సరాల కామ్రేడ్ బెనిటో టీయామ్ జోన్ (కామ్రేడ్ లాన్), కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, 70 సంవత్సరాల కామ్రేడ్ విల్మా ఆస్టియా టియామ్ జోన్ (కామ్రేడ్ బగోంగ్-టావో), ఎనిమిది మంది పార్టీ, ఎన్.పి.ఏ యోధులకు **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నది.** అమెరికా సామ్రాజ్యవాద మద్దతుతో ఫిలిప్పీన్స్ ఫాసిస్టు ప్రభుత్వ సైన్యం చేసిన ఈ కిరాతక చర్యను తీవ్రంగా గర్హిస్తూ, వారి అత్యున్నత త్యాగాలను సమున్నతంగా ఎత్తిపడుతూ ప్రపంచవ్యాప్తంగా దేశ దేశాలలో ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టవలసిందిగా భారత ప్రజాయుద్ధానికి మద్దతుగా నిలిచిన అంతర్జాతీయ కమిటీ (ఐసీఎస్‌పీడబ్ల్యుఐ)ని, నూతనంగా ఏర్పడిన అంతర్జాతీయ కమ్యూనిస్టు సమితి (ఐసీఎల్)ని, యావత్తు మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీలను, సంస్థలను, శక్తులను భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ కోరుతున్నది.




కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావోలతో కలిసి పని చేసిన సీపీపీ కేంద్ర కమిటీ సభ్యులకు, వారి పిల్లలకు, మనుమలు, మనుమరాళ్లకు, పార్టీ, నూతన ప్రజా సైన్యం (ఎన్‌పీఏ) శ్రేణులకు, కమాండర్లకు, యోధులకు, ఫిలిపినో జాతీయ ప్రజాస్వామిక ఫ్రంట్ (ఎన్‌డీఎఫ్) శ్రేణులకు, యావత్తు ఫిలిపినో విప్లవ ప్రజానీకానికీ, వారి దేశ, విదేశీ మిత్రులకు, అభిమానులకు భా.క.పా (మావోయిస్టు) కేంద్ర కమిటీ ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలియజేస్తున్నది. అలాగే వారిద్దరితో పాటుగా

అమరులయిన ఈస్టర్న్ విసయాస్ సబ్ రీజనల్ కార్యదర్శి కామ్రేడ్ జోల్ అర్సియో (కామ్రేడ్ డివినో), సెంట్రల్ హెడ్ క్వార్టర్స్ రక్షక యోధులు కామ్రేడ్ యెన్, కామ్రేడ్ జాజా, కామ్రేడ్ మర్, కామ్రేడ్ అష్, కామ్రేడ్ డెల్ఫిన్, కామ్రేడ్ లూప్, కామ్రేడ్ బుటిగ్‌ల మరణాలకు మా కేంద్ర కమిటీ తీవ్ర సంతాపం తెలియజేస్తున్నది.

సమర్ రాష్ట్రం కటబలోగన్ నగరంలో రెండు వాహనాల్లో నిరాయుధంగా తీరం వైపు వెళుతున్న ఈ పది మంది కామ్రేడ్స్‌ను ఫిలిప్పీన్స్ సైన్యం (ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆఫ్ ది ఫిలిప్పీన్స్, ఎఎఫ్‌పీ) 2022 ఆగస్టు 21వ తేదీ మధ్యాహ్నం 12-1 గంటల మధ్య అరెస్టు చేసింది. వారిని రకరకాల చిత్రహింసలకు గురి చేసింది. మర్నాడు తెల్లవారుజామున క్రూరంగా హత్య చేసింది. కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావోల శవాలను పేలుడు పదార్థాలు నింపిన మరపడవలో సముద్రంలోకి తీసుకువెళ్లి కటబలోగన్, తరాంగనన్ దీవుల మధ్య పేల్చివేసింది. ఏఎఫ్‌పీ అమెరికా సైన్యంతో కలిసి అత్యంత రహస్యంగా అరెస్టు చేసి, క్రూరాతిక్రూరంగా ఈ హత్యాకాండ జరిపి, సముద్రం మధ్యలో ఎదురుకాల్పులు జరిగాయని, అందులో వీరంతా మరణించారని తప్పుడు కథనం ప్రకటించింది. ఎనిమిది శవాలు మాత్రమే దొరికాయని పేర్కొంది. ఈ ఘాతుకం జరిగిన కొద్ది రోజులకు సమాచారం అందుకున్న ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిటికల్ బ్యూరో, ఎగ్జిక్యుటివ్ కమిటీలు క్షుణ్ణంగా పరిశోధన జరిపి వాస్తవాలను నిర్ధారించడానికి దాదాపు ఎనిమిది నెలలు పట్టింది.

జీవిత సహచరులయిన కామ్రేడ్ బగోంగ్-టావో, కామ్రేడ్ లాన్ విద్యార్థులుగా ఫిలిప్పీన్ జాతీయ ప్రజాస్వామిక పోరాటంలో తమ రాజకీయ జీవితాలను ప్రారంభించారు. 1951 మార్చ్ 21 తేదీన జన్మించిన కామ్రేడ్ లాన్ మెట్రో మనీలాలో మరికినాలో పెరిగారు. 1952 డిసెంబర్ 21 తేదీన జన్మించిన కామ్రేడ్ బగోంగ్-టావో పాసిగ్ నగరానికి చెందిన వారు. వారిద్దరూ జోస్ రిజాల్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. 1960వ దశాబ్దం చివరిలో ఫిలిప్పీన్స్ విశ్వవిద్యాలయంలో అడుగు పెట్టారు. ఫిలిప్పీన్ కాలేజియన్‌లో రచయితలయ్యారు. ఫిలిప్పీన్స్ దేశాన్ని నయా వలసగా, సైనిక కేంద్రంగా రూపొందించుకున్న అమెరికా సామ్రాజ్యవాద దోపిడి అణచివేతలతో ఫిలిప్పీన్స్ ప్రజలు తీవ్ర పీడనకు గురవుతున్న కాలం అది. సామ్రాజ్యవాదం నుంచి విముక్తి కోరుకుంటున్నారు. దేశ ప్రజలు. జాతీయ స్వాతంత్ర్యం కోసం, ప్రజాస్వామ్యం కావాలని, అమెరికా తొత్తు నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం పోరాటాలు చేయసాగారు. ఈ పోరాటాలు క్రమంగా జాతీయ ప్రజాస్వామిక విప్లవంగా రూపం తీసుకుంటున్నాయి. ఈ వెల్లువ కాలంలో కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో జాతీయ ప్రజాస్వామిక యువజన సంఘంలో సభ్యులయ్యారు. దేశ ప్రజల దారిద్ర్య పరిస్థితులు, రాజకీయ పరిస్థితులు వారిని విప్లవోన్ముఖం చేశాయి.

1968 డిసెంబరు 26వ తేదీన పార్టీని స్థాపించిన ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ సంస్థాపక చైర్మన్, ఫిలిప్పీన్స్ ప్రజల గొప్ప నాయకుడు కామ్రేడ్ జోస్ మారియో సిసాన్ తో కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో సన్నిహితంగా పని చేశారు. కామ్రేడ్ జోమా నాయకత్వంలో కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో మొదలయిన కామ్రేడ్స్‌తో కూడుకుని ఉన్న నాయకత్వ టీం ఫిలిప్పీన్స్ దేశంలో సైద్ధాంతిక, రాజకీయ కృషి చేయనారంభించింది. 1969 మార్చ్ 29వ తేదీన నూతన ప్రజా సైన్యం (ఎన్‌పీఏ), 1973లో జాతీయ ప్రజాతంత్ర ఫ్రంట్ (ఎన్‌డీఎఫ్) ఏర్పడ్డాయి.

కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో 1974లో మనీలా నుంచి కెబుకు బదిలీ అయ్యారు. అక్కడ కార్మికులలో పని చేశారు. ఆ తరువాత సంవత్సరం పార్టీ వారిద్దరినీ సమర్‌కు బదిలీ చేసింది. సమర్‌లో పని చేస్తున్న కాలంలో కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను, ఫిలిప్పీన్స్ నూతన ప్రజాస్వామిక విప్లవ ఇతర కర్తవ్యాలను లోతుగా అర్థం చేసుకోగలిగారు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని ఫిలిప్పీన్స్ దేశానికి అన్వ యించడంలో అనుభవం సంపాదించారు. ఫిలిప్పీన్స్ సమాజ స్వభావాన్ని అర్థం చేసుకోవడం కోసం సామాజిక పరిశోధన నిర్వహించారు. ఫిలిప్పీన్స్ అర్థవలస, అర్థభూస్వామ్య దేశమన్న కామ్రేడ్ జోస్ మారియో సిసాన్ అవగాహనను సుసంపన్నం చేశారు.

1976లో కామ్రేడ్ లాన్ ఈస్టర్న్ విసయాస్ ప్రాంత పార్టీ కార్యదర్శిగా, కామ్రేడ్ బగోంగ్-టావో పార్టీ డిప్యూటీ కార్యదర్శిగా పని చేశారు. 1980ల ప్రారంభంలో కామ్రేడ్ బగోంగ్-టావో సెంట్రల్ లుజాన్‌లో సాయుధ పోరాటం, అమెరికా-మార్కోస్ సైనిక నియంతృత్వానికి వ్యతిరేకంగా కార్మిక-కర్షకుల విశాల ప్రజా పోరాటాలను నడిపించారు. కామ్రేడ్ లాన్ బలమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను, సాయుధ ప్రతిఘటనను నడిపించారు. ఈ దశాబ్దమంతా ఫిలిప్పీన్స్ విప్లవోద్యమం అన్ని రంగాలలో పురోగమించింది. ఎన్‌పీఏ అనేక విజయాలు సాధించింది. ఎన్‌డీఎఫ్ దేశంలో వివిధ ప్రాంతాల ప్రజలను సంఘటితం చేసింది. పార్టీ విస్తరించింది. ప్రజలలో గొప్ప గుర్తింపు పొందింది. ఈ క్రమంలో పార్టీ సైద్ధాంతికంగా, సైనికంగా, నిర్మాణ పరంగా బలోపేతం అవుతూ వచ్చింది. అయితే ఈ సాఫల్యాలను వెన్నంటి పార్టీలో సైద్ధాంతిక పెడధోరణులు ముందుకు వచ్చాయి. అతివాద, మితవాద ధోరణులు పార్టీ వ్యాప్తంగా గందర గోళం సృష్టించాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి పార్టీ కేంద్ర కమిటీ రెండవ దిద్దుబాటు కార్యక్రమం చేపట్టింది.

ఈ రెండవ మహత్తర దిద్దుబాటు ఉద్యమం (ఎస్‌జీఆర్‌ఎం)లో కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో కీలకమైన పాత్ర నిర్వహించారు. 1992-1998 మధ్య జరిగిన ఈ దిద్దుబాటు ఉద్యమం పార్టీ మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు అవగాహనను, మౌలిక సూత్రాలను, దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని, ప్రజల ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్లే వ్యూహం-ఎత్తుగడలను పునరుద్ధాటించింది. కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో పార్టీ కేంద్ర కమిటీని అద్భుతంగా నడిపించి పార్టీని విచ్ఛిన్నం చేసే, విభజించే రివిజనిస్టు ద్రోహుల ప్రయత్నాలను

అడ్డుకున్నారు. పార్టీలో, ఉద్యమంలో ఈ పెడ ధోరణులతో కొందరు పార్టీ పంథానే విడనాడినప్పుడు వారిని దృఢంగా ఎదుర్కొన్నారు. పార్టీ నిర్వీర్యం కాకుండా కామ్రేడ్ జోమా మార్గదర్శకత్వంలో కేంద్ర కమిటీ సభ్యులతో కలిసి పరిరక్షించారు. ఫిలిప్పీన్స్ విప్లవాన్ని తిరిగి పురోగమన, అభివృద్ధి మార్గంలో నిలబెట్టారు.

కార్మికులు, కర్షకులలో ఆర్గనైజర్‌లుగా రాజకీయ కృషి ప్రారంభించిన కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో చేస్తున్న ప్రతి పని నుంచి మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని, విప్లవాన్ని మరింతగా అర్థం చేసుకుంటూ అంచెలంచెలుగా ప్రజా నాయకులుగా ఎదిగారు. పుట్టి పెరిగిన వర్గ స్వభావాన్ని వదిలించుకుని కార్మికవర్గంగా పరిణతి చెందారు. పార్టీ కేంద్ర కమిటీలో, కేంద్ర విభాగాలలో బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వ మిలిటరీ, పారా మిలిటరీ, పోలీసు బలగాలు కొనసాగించిన వివిధ అణచివేత క్యాంపెయిన్‌లను తిప్పికొట్టడంలో పార్టీకి, ఎన్‌పీఏకు, ఎన్‌డీఎఫ్‌కూ సమర్థవంతంగా నాయకత్వం వహించారు. అన్ని రంగాల్లోని క్యాడర్‌లకు ఆదర్శంగా నిలిచారు.

కామ్రేడ్ జోమా మార్గదర్శకత్వంలో కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో కేంద్ర కమిటీని, న్యూ పీపుల్స్ ఆర్మీని దాదాపు మూడు దశాబ్దాల పాటు దీర్ఘకాలిక ప్రజా యుద్ధంలో అద్వితీయంగా నడిపించారు. కామ్రేడ్ లాన్ కేంద్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా ఫిలిప్పీన్స్ విప్లవానికి రోజువారీ నాయకత్వం అందించారు. కామ్రేడ్ బగోంగ్-టావో కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా సేవ చేశారు. 2016లో జరిగిన పార్టీ రెండవ కాంగ్రెస్‌లో కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో తిరిగి కేంద్ర కమిటీలోకి, కేంద్ర విభాగాలలోకీ ఎన్నికయ్యారు.

జీవిత సహచరులే కాకుండా, పార్టీ కష్టతరమైన కర్తవ్యాలను సమర్థవంతంగా నెరవేర్చిన విప్లవ సహచరులు వాళ్లు. కేంద్ర కమిటీ, పొలిటికల్ బ్యూరో, ఎగ్జిక్యూటివ్ కమిటీలలో ఇతర నాయకత్వ కామ్రేడ్స్‌తో కలిసి పని చేశారు. ఫిలిప్పీన్స్ ప్రజల ప్రజాస్వామిక విప్లవ కాగడాలయ్యారు. కేంద్ర కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ డాక్యుమెంట్‌లను రూపొందించడంలో కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావోలు ఎంతగానో దోహదం చేశారు. ఈ డాక్యుమెంట్‌ల ద్వారా ఫిలిప్పీన్స్ ప్రజల ప్రజాస్వామిక విప్లవాన్ని నడిపేందుకు అవసరమైన సిద్ధాంతాలు మరింత సుసంపన్నమయ్యాయి. ఈసీ-సీసీ పత్రాలు, ఆదేశాలు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ, గెరిల్లా యుద్ధ అవగాహనను మరింత విస్తృతపరచాయి, పటిష్టం చేశాయి. ప్రజాయుద్ధాన్ని బహుముఖంగా నిర్వహించేందుకు దాని సూత్రాలపై, అందులో మూడు అంశాలైన సాయుధ పోరాటం, వ్యవసాయ విప్లవం, ప్రజా పునాది నిర్మాణాలను జోడించవలసిన ప్రాధాన్యతను అర్థం చేసుకోవడంలో పార్టీ క్యాడర్‌లకు సహాయపడేందుకు వారిద్దరు అంకితబద్ధులయ్యారు. వారి రచనలు ఫిలిప్పీన్స్ విప్లవ సిద్ధాంత భాండాగారంలో నిలిచిపోతాయి. మార్క్సిజం-లెనినిజం -మావోయిజాన్ని మరింత సుసంపన్నం చేసేందుకు దోహదం చేస్తాయి.

కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో 2014లో అరెస్టయి రెండు సంవత్సరాల పాటు జైలులో చాలా దృఢంగా ఉన్నారు. 2016లో డుటర్టె ప్రభుత్వంతో శాంతి చర్చలలో పాలు పంచుకోవడం కోసం నేషనల్ డెమోక్రాటిక్ ఫ్రంట్ ఆఫ్ ది ఫిలిప్పీన్స్ (ఎన్‌డీఎఫ్‌పీ) బృందంలో భాగమయ్యేందుకు ప్రభుత్వం వీరిని విడుదల చేసింది. అనతి కాలంలోనే శాంతి చర్చలను నిలిపివేసి, ఎన్‌డీఎఫ్‌పీ, పార్టీ, ఎన్‌పీఏ నాయకత్వాన్ని పట్టుకుని, కాల్చి చంపాలని డుటర్టె ఆదేశాలు ఇచ్చిన వెనువెంటనే కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావో తిరిగి గెరిల్లా ఫ్రంట్‌ల వద్దకు చేరుకున్నారు. చివరి శ్వాస వరకు విప్లవానికి అంకితమై నిస్వార్థ సేవ చేశారు. త్యాగధనులయ్యారు.

జాతీయ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కోసం, సోషలిజం, కమ్యూనిజం కోసం ప్రజల ఆకాంక్షలను పురోగమింపజేసేందుకు వారందించిన సేవలు, వారి శరీరాలను, ఆలోచనలనూ సంపూర్ణంగా పీడిత, అణచివేయబడ్డ ప్రజల సేవ కోసం వెచ్చించిన త్యాగం వారికి ఫిలిపినో ప్రజల నిజమైన వీరులుగా చరిత్రలో స్థానం కల్పించాయి.

కామ్రేడ్ సిసాన్ మరణం, ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావోల మరణం కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫిలిప్పీన్స్, ముఖ్యంగా కేంద్ర కమిటీకి, ఫిలిప్పీన్స్ విప్లవానికి చాలా పెద్ద నష్టం కలిగించింది. గడచిన కొద్ది కాలంలో కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ ఓరిస్, కామ్రేడ్ ఈలే మొదలైన కామ్రేడ్స్ మరణం కూడా పార్టీకి తీవ్ర నష్టం కలిగించింది. అయితే మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతంపై బలమైన పట్టు ఉండి, సరైన మార్గంలో విప్లవాన్ని నడిపిస్తున్న సీపీపీ కఠోర శ్రమతో దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో ముందుకు సాగే క్రమంలో ఈ నష్టాలను అధిగమిస్తుందని భాకపా (మావోయిస్టు) కేంద్ర కమిటీ విశ్వసిస్తున్నది. ఈ కామ్రేడ్స్ అమరత్వం కలిగించిన నష్టాన్ని అధిగమిస్తూ వారి విప్లవ సేవల స్ఫూర్తితో విప్లవోద్యమాన్ని అచంచలంగా పురోగమింపజేసి తీరుతుంది. కామ్రేడ్స్ జోమా, లాన్, బగోంగ్-టావో లాంటి ఉన్నత శ్రేణి నాయకత్వం వేలాది మంది క్యాడర్‌లను తయారు చేసి శిక్షణనిచ్చారు. వారి అమరత్వ స్ఫూర్తితో, రెట్టించిన వర్గ కసితో వారు ఎత్తి పట్టిన ఎర్ర జెండాను మరింత సమున్నతంగా ఎగురవేసేందుకు సుశిక్షితులయిన ఈ క్యాడర్ లందరూ ముందుకు వస్తారు. పార్టీని, ఫిలిప్పీన్స్ విప్లవాన్ని పురోగమింపజేస్తారు. పార్టీ కేంద్ర కమిటీ సమష్టిగా ఈ నష్టం నుంచి పార్టీని అధిగమింపజేస్తుంది. పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా బలోపేతం చేస్తూ ముందుకు నడిపిస్తుంది.

స్థిరంగా, సుదృఢంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ క్రమంలో రాటుదేలిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫిలిప్పీన్స్‌కు ఈ పరిస్థితిలో అండగా

నిలవడం, ఫిలిప్పీన్స్ విప్లవానికి మద్దతు అందించడం ప్రపంచ మావోయిస్టు పార్టీల, సంస్థల, శక్తుల కార్మికవర్గ అంతర్జాతీయ బాధ్యత. ఫిలిప్పీన్స్ ప్రజాయుద్ధం ప్రపంచ సోషలిస్టు విప్లవంలో ఒక ప్రముఖ, విడదీయరాని భాగం. ప్రపంచ సోషలిస్టు విప్లవానికి దోహదం చేసే ఈ ఉద్యమానికి మద్దతుగా నిలవడం ప్రపంచ కార్మికవర్గ, మావోయిస్టు శక్తులన్నింటి బాధ్యత.

శిక్షణనిచ్చి, సాయుధం చేసి, నేరుగా కమాండ్ చేసే జాయింట్ స్పెషల్ ఆపరేషన్స్ టాస్క్ ఫోర్స్, ట్రిడెంట్ ద్వారా అమెరికా సామ్రాజ్యవాదం ఈ ఘోరమైన హత్యాకాండకు మద్దతు నందించింది. ఈ ఘటనకు కారకులయిన అమెరికాకు తొత్తుగా పని చేస్తూ దేశ సంపదను, శ్రమశక్తినీ అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ధారపోస్తూ దేశ విప్లవోద్యమాన్ని నెత్తురుటేరుల్లో పారిస్తున్న దేశాధ్యక్షుడిని, సైనిక, పౌర ఉన్నతాధికారులను సీపీపీ కోరుతున్నట్లుగా శిక్షించాల్సిందిగా డిమాండ్ చేయాలి. సామ్రాజ్యవాదం, ఆయా దేశాలలో దాని దళారీ ప్రతిఘాతుక పాలక వర్గాలూ ప్రపంచవ్యాప్తంగా దోపిడీ, పీడన, అణచివేతలకు వ్యతిరేకంగా, జాతీయ విముక్తి, ప్రజాస్వామ్యం, సోషలిజం-కమ్యూనిజం కోసం పోరాడుతున్న ప్రజలపై, వారికి నాయకత్వం వహిస్తున్న మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు విప్లవ పార్టీలపై కొనసాగిస్తున్న ఫాసిస్టు అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలి.

ప్రపంచ పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థ తీవ్ర సంక్షోభ పరిస్థితిలో ప్రపంచమంతటా, యావత్తు దేశాలలో సామ్రాజ్య వాదానికి, పీడిత జాతులు, ప్రజలకూ మధ్య ప్రధాన వైరుధ్యంతో పాటుగా ఇతర మౌలిక వైరుధ్యాలు తీవ్రతరం అవుతున్నాయి. ప్రపంచ కార్మికవర్గంపై, పీడిత జాతులు, ప్రజలపై, జాతీయ ప్రజాస్వామిక, విప్లవ ఉద్యమాలపై, సమరశీల కార్మికోద్యమాలపై, రోజు రోజుకూ సామ్రాజ్యవాద అణచివేత పెరుగుతున్నది. ఈ భూమి మీద సామ్రాజ్యవాదాన్ని కూకటివేళ్లతో నహా పెకిలించివేయడానికి ప్రపంచవ్యాప్తంగా విప్లవ శక్తులు, పీడిత జాతులు, ప్రజలు ఐక్యంగా, చెక్కుచెదరని సంకల్పంతో భుజం భుజం కలిపి పోరాడవలసిన సమయం ఇది.

ప్రపంచ పునర్విభజన కోసం సామ్రాజ్యవాదుల మధ్య మూడో ప్రపంచ యుద్ధ ప్రమాద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ హత్యలకు నిరసనగా పోరాడడం నేడు అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘీభావ ఉద్యమంలో ఒక కీలక భాగం. ప్రపంచ కార్మికవర్గాన్ని, శ్రమజీవులను, ప్రజాస్వామిక, విప్లవ శక్తులను ఐక్యం చేసే కర్తవ్యంలో భాగంగా ఈ హత్యలకు, ప్రపంచ సామ్రాజ్యవాదుల, వారి దళారీల ఫాసిస్టు చర్యలకూ నిరసనగా **జూన్ 15-16** రెండు రోజులు ప్రపంచ వ్యాప్త ప్రత్యేక క్యాంపెయిన్ చేపడదాం. కమ్యూనిజం కోసం ప్రాణాలర్పించిన ఫిలిప్పీన్స్ విప్లవ యోధులు, ప్రజా నాయకులు కామ్రేడ్స్ లాన్, బగోంగ్-టావోలకు వినమ్రంగా విప్లవ నివాళులు అర్పిద్దాం, వారి మహత్తర త్యాగాన్ని ఎత్తిపడదాం. ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీకి, ఫిలిప్పీన్ విప్లవానికి సంఘీభావం తెలియజేద్దాం.

- కామ్రేడ్ లాన్, కామ్రేడ్ బగోంగ్-టావోలకు విప్లవ జోహార్లు! ఫిలిప్పీన్స్ విప్లవోద్యమం వర్ధిల్లాలి!
- ప్రపంచ కార్మికుల, పీడిత జాతుల, ప్రజల ఐక్యత వర్ధిల్లాలి!
- సామ్రాజ్యవాదం, అన్ని దేశాల ప్రతిఘాతకులు నశించాలి!
- రకరకాల రివిజనిజం నశించాలి!
- మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!
- ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!

**జూన్ 15-16 అంతర్జాతీయంగా ఫిలిప్పీన్స్ అమరుల సంస్మరణ దినాలను పాటిద్దాం.**

---

**6 వ పేజీ తరువాయి**

**ప్రశ్న: చివరగా, ఫిలిప్పీన్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా ప్రజాయుద్ధం కొనసాగుతోంది. కానీ, సాధించిందేమీ లేదు అంటూ రివిజనిస్టులు, ఫిలిప్పీన్స్ విప్లవ వ్యతిరేకులు ఛలోక్తులు విసురుతుంటారు. ఈ ఆరోపణలపై మీరు ఎలా స్పందిస్తారు?**

జవాబు: ద్వీప సమూహమైన ఫిలిప్పీన్స్ లాంటి దేశంలో ప్రజాయుద్ధాన్ని ప్రారంభించి కొద్ది సంఖ్యలో వున్న బలగాలను పట్టుదలతో వుంటూ వేల సంఖ్యలోకి అభివృద్ధి చేసుకొని ఐదు దశాబ్దాలకు పైగా అతి పెద్ద సామ్రాజ్యవాద శక్తి సమర్థిస్తున్న బలవంతమైన శత్రువుతో పోరాడడమే ఫిలిప్పీన్స్ విప్లవ శక్తుల విజయంగా గుర్తించాలి. ఫిలిప్పినో ప్రజల విశాల, లోతైన మద్దతు లేకుండా ప్రజాయుద్ధం కొద్ది సంవత్సరాలైనా కొనసాగి వుండేది కాదు. పార్టీ విప్లవ పంథా మార్గదర్శకత్వంలో విప్లవ శక్తులు భూసంస్కరణలను అమలు చేయడం ద్వార లక్షలాది పేద రైతులు, వ్యవసాయ కూలీలు లబ్ధి పొందారు. దేశ వ్యాప్తంగా వేలాది గ్రామాలలో విప్లవ ప్రజాసంఘాల సమర్థనతో ఏర్పడిన రాజకీయ అధికార అంగాలు భవిష్యత్ ప్రజాస్వామిక రాజ్యానికి భ్రూణ రూపంలో పని చేస్తున్నవి.

2017 నుండి దేశ వ్యాపితంగా కొనసాగుతున్న అమెరికా సమర్థిత దాడి చాలావరకు నిష్ఫలమైంది. ఆ క్రమంలో, కొన్ని ప్రాంతాలలో అనివార్యంగా నష్టాలు ఎదుర్కొన్నాం. కానీ, గెరిల్లా పట్టుదలతో, ఇతర ప్రాంతాలలో సాధించిన విజయాలతో వాటిని అంతిమంగా పూడ్చుకోగలిగాం.

సదా భవిష్యత్తులో సంపూర్ణ విజయం సాధించే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొనే పార్టీ, ఎన్‌పీఏ, విప్లవశక్తులు తక్షణ కర్తవ్యాల సాధనకై పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విప్లవోద్యమాన్ని తీవ్రతరం చేస్తు, చిన్నా-పెద్ద సాఫల్యాలు, విజయాల సాధనకై గెరిల్లా యుద్ధాన్ని విస్తృతం, తీవ్రతరం చేస్తున్నాం.

★

# అమెరికా నిర్దేశిత ఏరియల్ బాంబింగ్ కేంపెయిన్ సహా రాజ్య బీభత్స కేంపెయిన్‌కు వ్యతిరేకంగా విశాల దేశభక్త ఐక్య సంఘటనను నిర్మించండి

ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన సమాచార అధికారి (అధికార ప్రతినిధి) కామ్రేడ్ ఎల్. వల్‌బుయినాతో ఒక విదేశీ పాత్రికేయుడు జరిపిన ఇంటర్వ్యూను **క్రాంతి పాఠకుల కోసం** అందిస్తున్నాం. పెద్ద మరియు జయప్రదంగా విప్లవోద్యమాన్ని కొనసాగిస్తున్న ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలలో ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ ఒకటి. అది గ్రామీణ ప్రాంతంలో, పట్టణాలలో బలమైన ప్రజా పునాదిని, ప్రజా సంఘాలను ఏర్పర్చింది. అది తన ఉద్యమ ప్రాంతాలలోని లక్షలాది ప్రజల కోసం భూసంస్కరణలను చేపట్టింది. దాని నాయకత్వంలో ఈరోజు గతం కన్నా శక్తిమంతమైన సాయుధ విభాగం **'నూతన ప్రజా సైన్యం' (ఎన్.పీ.ఏ)** వుంది. ఈ అన్ని విషయాలపై విలేకరి అడిగిన ప్రశ్నలకు దిగువ ఇచ్చిన ఇంటర్వ్యూలో వల్‌బుయినా జవాబులున్నవి.

ప్రశ్న: **ఇటీవలి సంవత్సరాలలో ఫిలిప్పీన్స్‌లో ప్రజాయుద్ధం తీవ్రతరం అయిన ఫలితంగా, మీరు వర్తమాన ప్రజాయుద్ధాన్ని ఏ దశలో వుందని వ్యూహాత్మక రక్షణ, వ్యూహాత్మక సమతుల్యత, వ్యూహాత్మక దాడి నిర్వచిస్తున్నారు? అందుకు కారణాలేంటి?**

జవాబు: ఫిలిప్పీన్స్‌లోని ప్రజాయుద్ధం వ్యూహాత్మక రక్షణ దశలోనే వుంది. వర్తమాన బలాబలాల స్థితిలో శత్రు బలాలు–అమెరికా సామ్రాజ్యవాదులు, దాని ఆశ్రిత రాజ్యం ఇప్పటికీ బలాధిక్యతలోనే వున్నవి. నూతన ప్రజా సైన్యం విస్తృతంగా, విశాల భూభాగంలో గెరిల్లా యుద్ధ చర్యలను కొనసాగిస్తూ శత్రువును ముక్కలు ముక్కలుగా (విడి విడి భాగాలుగా) దెబ్బ తీయాల్సి వుంటుంది. దానికి విశాల, బలమైన ప్రజల మద్దతు వున్నప్పటికీ ప్రజా సైన్యం ఇప్పటికి ఇంకా ఆ ప్రజా బలం రెగులర్ వార్‌ఫేర్ కొనసాగించే విధంగా రెగులర్ కంపెనీలను నిలబెట్టలేకపోతోంది. ప్రజా పునాదిని మరింత బలోపేతం చేయడానికి, విస్తరించడానికి దేశ వ్యాప్తంగా గెరిల్లా యుద్ధ జ్వాలలను ముమ్మరం చేయాలనీ, ఎత్తుగడలపర చిన్న–పెద్ద దాడులతో శత్రువును దెబ్బ తీయాలనీ ఇటీవలే మా పార్టీ నూతన ప్రజాసైన్యానికి పిలుపునిచ్చింది.

**ప్రశ్న: 2022లో జరుపుకున్న నూతన ప్రజాసైన్య 53వ వార్షికోత్సవ సందేశంలో సీపీపీ, నూతన ప్రజాసైన్యం పట్టణ ప్రాంతాలలో "గెరిల్లా చర్యలను" నిర్వహించాలని పిలుపునిచ్చింది. వర్తమాన పరిస్థితులలో పట్టణ ప్రాంత కేంపెయిన్ కర్తవ్యాలుగా మీరు పెట్టుకున్నవి ఏంటి? ఆ కేంపెయిన్‌లో మీరు అనుభవం, సాధించిన ప్రగతి ఏంటి? ఉదాహరణకు, ఈ మధ్య కాలంలో మీరు మొదటిసారి మనిలా మెట్రో వద్ద కొన్ని చర్యలు చేసినట్టు నేను విన్నాను.**

జవాబు: దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని అనుసరించి గ్రామీణ ప్రాంతం నుండి పట్టణాలను చుట్టుముట్టే నూతన ప్రజా సైన్య వ్యూహాత్మక ఎత్తుగడలలో భాగంగా చాల కాలంగా పట్టణ ప్రాంతాలలో గెరిల్లా యూనిట్లు మోహరించి ఉన్నాయి. శత్రువు చుట్టుముట్టి అణిచివేసే కేంపెయిన్‌ను ఓడించడానికి శత్రు వెనుకతట్టులో అంటే పట్టణాలలో, నగరాలలో శత్రువును అలవగొట్టడానికి అనుసరించే అన్ని ఎత్తుగడలలో భాగంగా గెరిల్లా యుద్ధ చర్యలను నిర్వహించా లనీ పిలుపునిచ్చాం. అంతేతప్ప, ఇప్పటివరకు పట్టణ కేంపెయిన్‌లాంటిదేది లేదు. అయితే, కేంద్ర కమిటీ ఆదేశాలపై కొన్ని నూతన ప్రజాసైన్య యూనిట్లు చాలా బాగా స్పందించి శత్రు యూనిట్లను, వ్యక్తులను, సరఫరాలను లక్ష్యంగా చేసుకొని నూతన ప్రజాసైన్య ఫ్రంట్లకు బయట దెబ్బ తీయడానికి ప్రత్యేక యూనిట్లను ఏర్పర్చాయి. భవిష్యత్తులో మరింత శత్రువు వెనుకతట్టున చర్యలు చేపట్టాలనుకుంటున్నాం.

ప్రజాసైన్య బలగాలు పని చేస్తున్న గ్రామీణ ప్రాంతంతో చుట్టివేయబడివున్న దేశ రాజధాని మెట్రో మనిలాకు బయట చాలా కాలంగా ఎన్‌పీఏ యూనిట్లు పని చేస్తున్నవి. వేలాది కుటుంబాలను ముఖ్యంగా మూలవాసీ మైనార్టీ ప్రజల కుటుంబాల ప్రాంతాన్ని జలమయం చేసి వారిని నిరాశ్రయులను చేయనున్న ఒక డ్యాం నిర్మాణ పనిలో కాపలా వున్న సైన్య యూనిట్‌పై ఇటీవల ఎన్‌పీఏ యూనిట్ దాడి చేసింది. ఆ ప్రాంత ప్రజలు ఆ చర్యను సాదరంగా స్వాగ తించారు.

**ప్రశ్న: మీరు విడుదల చేసిన అదే సందేశంలో, అలాగే ఇటీవలి కాలంలో మీరు "స్పారో యూనిట్లు" (పిచ్చుక యూనిట్లు) గా పిలుచుకునే ప్రత్యేక గెరిల్లా యూనిట్లను ఏర్పరుస్తున్నట్లు, ఏర్పర్చినట్టు రిపోర్టులు వినిపిస్తున్నవి. ఈ రిపోర్టులలో ఏమైనా వాస్తవం వుందంటారా? వుంటే, ఈమధ్య కాలంలో సాధారణంగా స్పారో యూనిట్లు సాధించిన విజయాలు ఏంటి?**

జవాబు: విశాల ప్రజారాసుల అభిప్రాయాలను తీసుకొని వారి డిమాండ్ మేరకు మానవ హక్కులను ఘోరంగా ఉల్లంఘించే శత్రు యూనిట్లను, శక్తులను శిక్షించడానికి, ఎన్‌పీఏ ప్రత్యేక యూనిట్లను ఏర్పర్చాల్సిన విషయాన్ని పార్టీ గుర్తు చేసిందనీ నేను పైనే చెప్పాను. చాలా వరకు ఎన్‌పీఏ ఈ ఆదేశాలను పాటించింది. రానున్న కాలంలో దాని అమలు ముమ్మరంగా జరుగుతుందనీ మేం ఆశిస్తున్నాం.

**ప్రశ్న: గత సంవత్సరం ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ అధ్యక్షుడైనప్పటి నుండి ఫిలిప్పీన్స్ పాలక వర్గం మరోమారు అమెరికా సామ్రాజ్యవాదులకు చాలా సన్నిహితమైంది. ఇదెట్లా జరుగుతోంది, మార్కోస్ తన తండ్రి చేసినట్టే ఫిలిప్పీన్స్‌ను అమెరికాకు ఒక ఆశ్రిత రాజ్యంగా తయారుచేస్తున్నడా లేక ఇంకేవిధంగా చేస్తున్నాడు మీరేమైనా చెప్పగలరా?**

జవాబు: ఫిలిప్పీన్ పాలకవర్గం చాలావరకు అమెరికా సామ్రాజ్యవాదానికి అణుకువగా వుంటూ దాని అదుపాజ్ఞలలోనే వుంటుంది. డుటెర్టె పాలనలో సైతం, అమెరికా నుండి వేరవుతున్నామనీ, బలగాల పర్యటన ఒప్పందాన్ని రద్దు చేస్తామని బెదిరింపు ప్రకటనలు చేసినప్పటికీ ఫిలిప్పీన్ పాలకవర్గం దృఢంగానే దానిని అంటిపెట్టుకొని వుంది. కానీ, నిజానికి ఇవన్నీ మరింత మిలిటరీ సహాయాన్ని, నిధులను పొంది జెట్ ఫైటర్స్, హెలీకాప్టర్లు, డ్రోన్‌లు, బాంబులు, మందుగుండు తదితర సామగ్రిని కొనడానికి చేసిన నాటకాలే. వాస్తవంగా, డుటెర్టె కాలంలో 2017-2022 మధ్య 1.2 బిలియన్ (120 కోట్ల) డాలర్లకు పైగా సైనిక సహాయాన్ని అందించినట్టు, ఫిలిప్పీన్స్ పాలకులు కొనుగోళ్లు చేసినట్టు అమెరికా చెపుతోంది.

మార్కోస్ జూనియర్ డుటెర్టె లేద తన తండ్రిలాగా అమెరికాకు పదహారణాల తొత్తు కాదు. అమెరికా సైనిక మద్దతుకు ప్రతిగా అమెరికా సైనిక, భూభౌగోళిక ప్రయోజనాలను ఆశించి ఫిలిప్పీన్స్ సైన్యంలో (ఏఎఫ్‌పీ) లోని దాని వీరాభిమానులుగా నున్న వారితో వైషమ్యాలను కొని తెచ్చుకునే బాపతు కాదు. ఎవరి పక్షమూ వహించకుండా విదేశీ విధానాలకు తను 'తటస్థంగా' వుంటానని చెప్పుకుంటాడు కానీ ఆ పలుచని పొర అది ఆయన అమెరికా దాసోహాన్ని కప్పిపుచ్చడానికి సరి పోవడం లేదు.

**ప్రశ్న: మార్కోస్ జూనియర్ అధ్యక్షుడైన తరువాత ఫిలిప్పీన్స్‌లో సీపీపీ, ఎన్‌పీఏలకు వ్యతిరేకంగా అమెరికా సైనిక బలగాల మద్దతు, జోక్యం పెరిగాయా?**

జవాబు: ఎన్‌పీఏకు వ్యతిరేకంగా గెరిల్లా వ్యతిరేక చర్యలలో గత పదేళ్లుగా అమెరికా జోక్యం క్రమంగా పెరిగింది. కానీ, అది బహిర్గతమైతే దేశభక్త ఫిలిప్పీనో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంటుందనీ భయపడి మరుగున పెడుతున్నారు. వాళ్లు డ్రోన్‌ల ద్వార నిఘా కొనసాగిస్తున్నారు, చికిత్సా సహాయం సహ అదనపు బలగాలను తరలిస్తున్నారు, ఫీల్డ్‌లో సైనికులనూ మొహరిస్తున్నారు. ఎత్తుగడలపరంగా ఏర్పర్చుకునే కమాండ్ పోస్టులలో తరచుగా అమెరికా సైనికాధికారులు దర్శనమిస్తారు. మార్కోస్ పాలనలో ప్రజల సాయుధ ప్రతిఘటనను సమూలంగా నిర్మూలించ తలపెట్టినందున అమెరికా చర్యలు కొనసాగుతూ మరింత తీవ్రతర మవుతాయి.

**ప్రశ్న: సామ్రాజ్యవాదుల మధ్య అంతర్గత పోటీలో చైనాకు వ్యతిరేకంగా అమెరికా ఫిలిప్పీన్స్‌ను ఒక పావుగా వాడుకోవాలని చూస్తుందన్న చర్చలు జరుగుతున్నవి, అది నిజమేనంటారా? అయితే, ఫిలిప్పీన్స్ పై అమెరికా-చైనాల ప్రభావం ఇంకా ఎలా వుండబోతుంది?**

జవాబు: అమెరికా చాలా కాలం తన దురాక్రమణ, జోక్యందారీ యుద్ధాలకు ఫిలిప్పీన్స్‌ను వినియోగించుకుంది. వియత్నాం, కొరియా అలాగే ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లపై అమెరికా యుద్ధాలకు ఫిలిప్పీన్స్ ఒక ప్రారంభస్థానంగా పని చేసింది. అమెరికా మూడవ సముద్ర యుద్ధ బలగాల లెఫ్టినెంట్ జనరల్ జేమ్స్ బైర్మన్, రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌లో అమెరికా దీర్ఘకాల యుద్ధ సన్నాహాలను పరిగణనలోకి తీసుకొని ఫిలిప్పీన్స్, జపాన్ తదితర దేశాలతో కూడిన మొదటి ద్వీపాల వరుసలో అమెరికా తన బలగాలను, ఆయుధాలను మొహరింపచేయడంలో భాగంగా తన బలగాలను పెంచనుందనీ చెప్పాడు.

చైనాను చుట్టుముట్టే యుద్ధంలో ఫిలిప్పీన్స్‌ను ఒక పావుగా ముఖ్యంగా తైవాన్‌లో అమెరికా సైనిక జోక్యం విషయంలో వెనుకతట్టుగా లేద లాంగ్ రేంజ్ మిస్సైల్ వ్యవస్థను నెలకొల్పడానికి కేంద్రంగా వాడుకోవడం ద్వార చైనా సైనిక దాడికి, ప్రతిదాడికి దేశాన్ని లక్ష్యంగా చేయనున్నారు.

**ప్రశ్న: ఫిలిప్పీన్స్‌లో పెరుగుతున్న అమెరికా సామ్రాజ్యవాద జోక్యంపై సీపీపీ, ఎన్‌పీఏ ఎలా ప్రతిస్పందిస్తుంది. ఉదాహరణకు, నాకు తెల్సినమేరకు, గతంలో ఫిలిప్పీన్స్‌లో అమెరికా ను లక్ష్యం చేసుకొని విప్లవదాడులు చేసినట్టు తిరిగి ఆ వ్యూహాన్ని ఎన్‌పీఏ పునరుద్ధరించనుందా?**

జవాబు: ఫిలిప్పీన్స్‌లో అమెరికా జోక్యానికి వ్యతిరేకంగా ముఖ్యంగా నాలుగు లేద ఎక్కువనే సైనిక అడ్డాలను, సౌకర్యాలను ఏర్పర్చడానికి వ్యతిరేకంగా, అలాగే అమెరికా నిర్దేశిత ఏరియల్ బాంబింగ్ కేంపెయిన్ సహ రాజ్య బీభత్స కేంపెయిన్‌కు వ్యతిరేకంగా విశాల దేశభక్త ఐక్య సంఘటనను నిర్మించాల్సిందిగా విప్లవకర, ప్రజాస్వామిక శక్తులకు పార్టీ పిలుపునిచ్చింది.

కౌంటర్ గెరిల్లా చర్యలలో పాల్గొంటున్న అమెరికా సైనిక బలగాలు ఎన్‌పీఏకు సాధికార లక్ష్యాలుగానే వున్నాయి. ఫిలిప్పీన్స్ సమరభూమిలో అది ఎక్కువ బలగాలను మొహరిస్తే, ఎన్‌పీఏ నిర్వహించే ఎత్తుగడలపర ఎదురుదాడులలో అవి మరింత ఎక్కువ లక్ష్యంగా మారి అధిక నష్టాలను ఎదుర్కోవలసిన రిస్క్ వాటికి పెరుగుతుంది.

**ప్రశ్న: ఇక ఇపుడు మనం అంతర్జాతీయ పరిదృష్యానికి వస్తే, విశ్వ వ్యాప్తంగా వున్న ఇతర విప్లవ పార్టీలతో, ఉద్యమాలతో సీపీపీ వర్తమాన సంబంధాలు ఎలా వున్నాయి? ఉదాహరణకు, సీపీఐ (మావోయిస్టు)తో, ఫ్రీ పాపువా ఉద్యమంతో సంబంధాలు వున్నట్టు నాకు తెలుసు. అవి ఇపుడు ఎలా వున్నవి? అలాగే ఇండోనేషియాలో జాతీయ ప్రజాస్వామిక ఉద్యమాన్ని నెలకొల్పడానికి సీపీపీ సహాయపడడానికి అవకాశం వుందనే చర్చలు వున్నవి. వాటిని మీరు సమర్థిస్తారా, తోసిపుచ్చుతారా?**

జవాబు: సోదర కమ్యూనిస్టు పార్టీలతో, విప్లవోద్యమాలతో స్నేహ ఫలవంత సంబంధాలను ఏర్పర్చుకోవడానికి, పరస్పరం అనుభవాల నుండి నేర్చుకోవడానికి, పంచుకోవడానికి, పరస్పర విప్లవ లక్ష్యాలను సమర్థించుకోవడానికి సీపీపీ సుదీర్ఘంగా కృషి చేసింది. సహజంగానే, ఫిలిప్పీన్స్‌లో విప్లవ శక్తుల మధ్య, ఆయా దేశాలలో సాయుధ విప్లవాన్ని కొనసాగిస్తున్న వారితో బలమైన సాన్నిహిత్య సంబంధాలున్నవి. ఫిలిప్పీన్స్ విప్లవ శక్తులకు, ఇండోనేషియా ప్రజాస్వామిక శక్తులకు మధ్య అనేక సంవత్సరాలుగా సన్నిహిత సంబంధాలున్నవి.

**మిగతాది 4వ పేజీలో**

# ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు
# కామ్రేడ్ హెల్నితా పర్దాలీస్‌కు లాల్ సలాం



23 నవంబర్, 2023 నాడు జరిగిన ఏరియల్ బాంబింగ్‌లో తన ఐదుగురు సహచరులతో అసువులు బాసిన అమరురాలు ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ, కేంద్రకమిటీ సభ్యురాలు కామ్రేడ్ హెల్నితా పర్దాలీస్‌కు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తోంది. తన జీవిత సహచరుడైన కామ్రేడ్ ఎలెన్‌కు, ఆమె కుమారులకు, మనుమలు, మనుమరాళ్లకు, బంధువులకు, కామ్రేడ్స్‌కు తీవ్ర సంతాపాన్ని తెలియచేస్తోంది. నిర్బంధ పరిస్థితులలో మేం వెంటనే స్పందించనందుకు మా సీసీ విచారిస్తోంది.

సామ్రాజ్యవాదుల దోపిడీకి చరమగీతం పాడే పీడిత తాడిత ప్రజలపై తన క్రూరమైన దాడులను తీవ్రతరం చేస్తున్న సామ్రాజ్యవాద అంతానికై పోరాటాన్ని బలోపేతం చేయాలనీ ప్రపంచవ్యాపిత ప్రజాస్వామికవాదులకు, విప్లవకారులకు, జాతీయ విముక్తి, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులకు, విప్లవ ప్రజలకు మా సీసీ పిలుపునిస్తోంది. బైకోల్, తూర్పు విస్యాస్ విప్లవ ప్రజల, కామ్రేడ్స్ యొక్క అత్యంత ప్రియమైన నాయకురాలు, 65 యేళ్ల కామ్రేడ్ హెల్నిత విప్లవ జీవితం నుండి నేర్చుకోవాలనీ, ఆమె గొప్ప కమ్యూనిస్టు ఆదర్శాలను విప్లవాచరణలో అమలు చేయాలనీ తప సమస్త పార్టీ, పీ.ఎల్.జీ.ఏ, ఐక్య సంఘటన శ్రేణులకు కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

ప్రస్తుతం ఫిలిప్పీన్స్ గ్రామీణ, అటవీ ప్రాంతాలలో జరిపిన బాంబు దాడులు ప్రపంచ వ్యాపితంగా విప్లవోద్యమాలపై సామ్రాజ్యవాదులు అనుసరిస్తున్న క్రూరమైన ఎత్తుగడల కొనసాగింపులో భాగమే. ఫిలిప్పీన్స్‌లో 2018 నుండి, ఇండియాలోని ఛత్తీస్‌గఢ్‌లో 2021 ఏప్రిల్ నుండి ఏరియల్ బాంబింగ్ ఓ సాధారణ చర్యగా మారాయి. ఇటీవలి కాలంలో ఫిలిప్పీన్స్ విప్లవోద్యమం 2022 అక్టోబర్ 3నాడు లాస్‌పినాస్‌లో ఒక పాత్రికేయుడు, రేడియో వ్యాఖ్యాత; అక్టోబర్ 30నాడు దీర్ఘకాల అస్వస్థతో కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ అంపాగ్; నవంబర్ 30నాడు ప్రియమైన ఉపాధ్యాయుడు, విద్యార్థి, కవి, నాటక కర్త, ఎర్రయోధుడు, నీగ్రోస్ నాయకుడు కామ్రేడ్ ఇరిక్‌సన్ అకోస్టా మరియు స్థానిక రైతాంగ నాయకుడు జోసెఫ్ జిమినేజ్ హత్యలతో చాలా నష్టాలను ఎదుర్కొంది.

ఫిలిప్పీన్స్ విప్లవోద్యమంపై కొనసాగుతున్న ఊచకోతను న్యూ పీపుల్స్ ఆర్మీ (ఎన్.పీ.ఏ) ప్రతిఘటిస్తోంది. అది కేవలం ఒక్క మాస్బేట్‌లోనే 20కి పైగా దాడులు చేసింది. బారంగేలో ఐబీ సైనిక శ్రేణిపై ఇటీవల నవంబర్ 4నాడు దాడి చేసి ముగ్గురు సైనికులను మట్టుబెట్టింది. సీ.ఏ.ఎఫ్.జీ.యూ బలగాలపై 7 నవంబర్ నాడు బారంగేలో మాటుదాడి జరిపి రెండు చిన్న తుపాకులు, అనేక మాగ్జిన్‌లను స్వాధీనపర్చుకొని ఇద్దరిని హతమార్చింది. 12 నవంబర్ నాడు 62వ ఐ.బీ బలగాలపై అనేక చర్యలు జరిపింది.

ఇటు భారతదేశంలో దండకారణ్య స్పెషల్ జోన్‌లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర దక్షిణ బస్తర్‌లో 2023 జనవరి 11నాడు జరిపిన ఏరియల్ దాడిని పీ.ఎల్.జీ.ఏ గట్టి ప్రతిఘటనతో ఎదుర్కొంది. భారత సైన్యానికి చెందిన వైమానిక దళ గరుడ కమాండోలు గాయపడగా వారిని దేశ రాజధానికి ఆకాశ మార్గాన తరలించారు. ఆయా దేశాలలో పెరుగుతున్న పాలకవర్గాల సాయుధ దాడులను ఎన్.పీ.ఏ., పీ.ఎల్.జీ.ఏలు రెండూ తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి.

ఆ దేశాలలోని సామ్రాజ్యవాదుల, దేశ దళారీలకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా సాయుధ, నిరాయుధ ప్రతిఘటనను బలోపేతం చేయాల్సిన తరుణమిది. అలా చేయడం ప్రపంచ సోషలిస్టు విప్లవం కోసం తనువులర్పించిన కామ్రేడ్ హెల్నిత, కామ్రేడ్ అంపాగ్ తదితర కామ్రేడ్స్ త్యాగాలకు నిజమైన నివాళి అవుతుంది.

★

# ఆఫ్ఘనిస్తాన్ కమ్యూనిస్టు (మావోయిస్టు) పార్టీ రెండవ ప్రాంతీయ కమిటీ సభ్యులు కామ్రేడ్ ఫర్హాద్‌కు లాల్ సలాం

జనవరి 27నాడు గుండెపోటుతో అసువులు బాసిన ఆఫ్ఘనిస్తాన్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) రెండవ ప్రాంతీయ కమిటీ సభ్యులు కామ్రేడ్ ఫర్హాద్ మరణంపై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, ఆఫ్ఘనిస్తాన్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) శ్రేణులకు తన తీవ్ర విచారాన్ని, సంతాపాన్ని తెలియచేస్తున్నది. దేశంపై సామ్రాజ్యవాదం తన దాడులను తీవ్రం చేస్తున్న వేళ ఆయన మరణం ప్రతిఘటనోద్యమానికి పెద్ద లోటు.

కామ్రేడ్ ఫర్హాద్ తన విద్యార్థి రోజుల నుండే క్రియాశీల కార్యకర్తగా ప్రారంభించి నాయకత్వానికి ఎదిగిన విషయం ఆ పార్టీ విడుదల చేసిన ప్రకటన ద్వార మేం తెలుసుకోగలిగాం. 1979 చివర రష్యా సామ్రాజ్యవాదం దేశంపై జరిపిన దురాక్రమణతో ఆయన కార్యకలాపాలు తీవ్రమయ్యాయి. ఆయన దేశం వదలివెళ్లడాన్ని ముజాహిద్దీన్ సంస్థలు అనివార్యం చేయడంతో ఆయన ఇరాన్ వెళ్లక తప్పలేదు. ఆఫ్ఘనిస్తాన్‌ను అమెరికా సామ్రాజ్యవాదం దురాక్రమించడంతో ఆయన విప్లవ రణరంగంలో భాగమయ్యాడు.

కామ్రేడ్ ఫర్హాద్ దేశంలోని మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టుల సమైక్యతా ఉద్యమంలో భాగమై తత్ఫలితంగా ఏర్పడిన ఆఫ్ఘనిస్తాన్ కమ్యూనిస్టు (మావోయిస్టు) పార్టీలో చేరిపోయాడు. ఆయన అవాకియన్ ఆధునిక రివిజనిజాన్ని దృఢంగా త్రోసిపుచ్చాడు. ఆయన తాలిబాన్లకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక వైఖరిని తీసుకొని 2019 నుండి ప్రాంతీయ కమిటీ నంబర్ (2) సభ్యుడయ్యాడు.

విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి తన భావాలకు ఒక సమర్థవంతమైన కవిగా, విమర్శకుడిగా, రచయితగా పదునుపెడుతూ ఆఫ్ఘనిస్తాన్ విప్లవోద్యమంలో అనేక దశలను చూసిన అత్యంత సీనియర్ కామ్రేడ్ ఫర్హాద్ లేని లోటును ఆఫ్ఘనిస్తాన్ కమ్యూనిస్టు (మావోయిస్టు) పార్టీ అధిగమిస్తుందనీ మా పార్టీ కేంద్రకమిటీ విశ్వసిస్తోంది.

★

# పుర్బో బంగ్లార్ షార్‌బొహరా పార్టీ-పీబీఎస్‌పీ/బంగ్లాదేశ్ 50వ వ్యవస్థాపక, మావోయిస్టు ప్రజాయుద్ధ ప్రారంభ వార్షికోత్సవాన్ని జరపండి

## కేంద్ర కమిటీ, పీబీఎస్‌పీ/బంగ్లాదేశ్, 2021 మార్చ్

## (2021 జూన్‌లో సీసీ సవరించి, విస్తృతపరచినది)

ప్రొలిటేరియన్ పార్టీ ఆఫ్ పుర్బో బంగ్లా (పుర్బో బంగ్లార్ షార్‌బొహరా పార్టీ-పీబీఎస్‌పీ/బంగ్లాదేశ్) 1971 జూన్ 3వ తేదీన ఆనాటి నాయకుడు, పార్టీ వ్యవస్థాపకుడు కామ్రేడ్ సిరజ్ సిక్‌దర్ (ఎస్ఎస్) నాయకత్వంలో ఏర్పడింది. అది పాకిస్తాన్ దేశ పీడక రాజ్యానికి వ్యతిరేకంగా తూర్పు బెంగాల్ విముక్తి యుద్ధ కాలం. అప్పటికి ప్రధాన బూర్జువా పార్టీ అవామీ లీగ్ ప్రజలను పాకిస్తానీ ఊచకోతలో నిస్సహాయంగా విడిచిపెట్టి భారతదేశానికి పారిపోయింది. అంతకు ముందు ఊచకోత సందర్భంగా వారి ప్రధాన నాయకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ పాకిస్తానీయులకు లొంగిపోయాడు. ఇతర నాయకులు ఉద్యమాన్ని, పోరాటం, త్యాగం, అంకితత్వాలను అవకాశంగా తీసుకుని అధికార స్వార్థ ప్రయోజనాల కోసం వాటిని భారతదేశానికి అమ్మివేసారు, అక్కడకు పారిపోయారు.

ఆ సమయంలో, ప్రమాదంలో ఉన్న ప్రజల కోసం వివిధ రాజకీయ, స్వీయాత్మక బలహీనతలు ఉన్నప్పటికీ మావోయిస్టులు నూతనంగా ఎగుస్తున్న శక్తిగా మారారు. బూటకపు భారతీయ-అవామీ విముక్తి యుద్ధానికి విరుద్ధంగా దేశంలో వివిధ ప్రాంతాలలో నిజమైన/విప్లవ విముక్తి యుద్ధం చేశారు. అధికారం లేని ఆ పరిస్థితిలో మన పార్టీ వ్యవస్థాపకుడు సిరాజ్ సిక్‌దర్ బరిషాల్‌లో పెయరబగన్ ప్రాంతంలో విప్లవ సైన్యాన్ని సంఘటితం చేసి, స్వల్పకాలిక విముక్తి ప్రాంతం నెలకొల్పాడు. అప్పుడే జూన్ 3వ తేదీన 'ప్రొలిటేరియన్ పార్టీ'ని స్థాపించాడు. అంతకు ముందు పాకిస్తాన్ పాలనా కాలంలో ఈ రకమైన పార్టీ ఏర్పాటుకు సన్నాహక సంస్థగా 'ఈస్ట్ బెంగాల్ వర్కర్స్ మూవ్మెంట్'ను స్థాపించాడు.

1971లో ఫిరంగి గుండ్ల శబ్దంలో షార్‌బొహరాని కార్మికవర్గ

పార్టీగా మార్చాడు. ఈ పార్టీ 50వ వ్యవస్థాపక వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంలో మనం గడచిన అర్ధ శతాబ్ద కాలంలో, పార్టీ నాయకత్వంలో నిరంతర వీరోచిత పోరాటాలను, పార్టీ నాయకత్వంలో అనేక మంది నాయకుల, శ్రేణుల, ప్రజల త్యాగాన్ని, అంకితత్వాన్ని స్మరించుకోవాలి. పార్టీ వ్యవస్థాపకుడు కామ్రేడ్ ఎస్ఎస్ దోహదాన్ని, బోధనలను, త్యాగాలను, వీరోచిత అమరత్వాన్ని స్మరించుకోవాలి. వీటి మార్గదర్శక వెలుగులోనే మన పార్టీ భావజాలపర, రాజకీయ, సైద్ధాంతిక వైఖరులు ఏర్పడ్డాయి. వీటితో పాటుగా స్థాపనా కాలంలోను ఆ తరువాత వివిధ దశలలోనూ పార్టీ సైద్ధాంతిక, రాజకీయ, సైనిక పంథా, పోరాటాల వివిధ పొరపాట్లు, చారిత్రక పరిమితుల పట్ల అపారమైన జాగరూకత కలిగి ఉండాలి.

పార్టీ పాజిటివ్ పునాదులు, నెగిటివ్ అంశాల పట్ల జాగరూకంగా ఉండేందుకు, దేశంలో మావోయిస్టు విప్లవ పోరాటాన్ని కొనసాగించేందుకు ఎస్ఎస్ తరువాత దాదాపు నాలుగు దశాబ్దాల పాటు కామ్రేడ్ అనోవర్ కబీర్ పార్టీకి నాయకత్వం వహించారు. పార్టీ విస్తృతమైన అనుభవాలను ఆయన అలుపెరుగకుండా క్రోడీకరించారు. ఈ క్రమంలో నూతన పొరపాట్ల నుంచి అధిగమింపజేశారు. మెట్టు మెట్టుగా పార్టీని సరైన మావోయిస్టు పంథాతో సుసంపన్నం చేశారు. ఇలా అభివృద్ధి చెందిన రూపంలో ప్రాథమికంగా 2011లోను, 2017 నాటి నాలుగో కాంగ్రెస్ రిపోర్ట్‌లోనూ ఆమోదించిన 'న్యూ సింథసిస్' ఉన్నది.

ఇంటర్నేషనల్ కమ్యూనిస్టు మూవ్మెంట్ నూతన దృక్పథంలో ఇవి జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి గుణాత్మకంగా ఉన్నత దిశను అందించాయి. ఆ తరువాత కాలానికి అవసరమయిన పంథాలు, పోరాటాల అభివృద్ధికి మార్గం సుగమం చేసి వాటికి నూతన పునాదిని నెలకొల్పాయి. ఈ దిశ మనకు బోధిస్తున్నదేమంటే, మనం 1970ల నాటి మావోయిస్టు ఉద్యమ మొత్తం దృక్పథం నుంచి, ఆ తరువాత చాలా కాలం పాటు దాని కొనసాగింపుగానూ మన పార్టీ స్థాపనను, పోరాటాన్ని అర్థం చేసుకోలేకపోయాం. అందువల్లనే మావోయిస్టు ఐక్యతను నిర్మించలేకపోయాం. ఆ కాలంలో మన పార్టీయే కాకుండా ఈ దేశంలో మరి కొన్ని మావోయిస్టు కేంద్రాలు కూడా పని చేస్తున్నాయి. వీటిలో చాలా వరకు 1971 నాటి విముక్తి యుద్ధంలో విప్లవ దోహదం చేసాయి. మనం వాటిని కూడా కలుపుకుని మొత్తంగా మావోయిస్టు ఉద్యమాన్ని అంచనా వేయాలి.

మన పార్టీ స్థాపనకు సన్నాహక చర్యలతో పాటుగా మావోయిస్టు ఉద్యమం దాని కంటే ముందుగానే ప్రారంభమయింది. అయితే మన పార్టీలో కొంతమందితో సహా ఆ కాలపు మావోయిస్టు శక్తులు చాలా వరకు వివిధ కాలాలలో వివిధ జాతీయ-అంతర్జాతీయ ప్రమాదాల వల్ల క్షీణించాయి. ఈ సుదీర్ఘ ప్రతికూల కాలంలో మన పార్టీ జాతీయ, అంతర్జాతీయ రంగాలలో వివిధ రివిజనిస్టు, పెడధోరణులకు వ్యతిరేకంగా ఎలా పోరాటం చేసిందో, తన తప్పులను ఎలా సరిదిద్దుకుందో, మన పార్టీ పంథాను ఎలా అభివృద్ధి చేసుకుందో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఇలా చేయకుండా ఇవాళ ఎటువంటి విప్లవ పంథాను గానీ పోరాటాన్ని గానీ అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. పార్టీ, మావోయిస్టు ప్రజాయుద్ధ స్థాపన వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి నిజమైన అర్థం ఉండదు.

ఈ పోరాటాలలో సైద్ధాంతిక-రాజకీయ-సైనిక పంథాలో వివిధ అంశాలు, అంతర్జాతీయ పంథాలో వివిధ సంక్లిష్ట పంథాలూ ఉన్నాయి. కామ్రేడ్ అనోవర్ కబీర్ నాయకత్వంలో మన పార్టీ నాయకత్వ పాత్ర వహించింది. దేశంలో ఏకైక మావోయిస్టు విప్లవ కేంద్రంగా రూపొందింది. అయితే ఇప్పటికీ మన పార్టీ బయట ఇంకా కొన్ని మావోయిస్టు కేంద్రాలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ మన పార్టీ ఈ దేశంలో స్వయం సమృద్ధ దృక్పథంతో, గతిశీల, సృజనాత్మక, విప్లవ మావోయిస్టు పార్టీగా రూపొందింది. కామ్రేడ్స్ ఎస్ఎస్, ఏకేల బోధనలే ఇందుకు పునాదులు. 'న్యూ సింథసిస్'లోను, నాలుగో కాంగ్రెస్ రిపోర్ట్‌లోను, ఇతర డాక్యుమెంట్‌లలోనూ వీటిని సంశ్లేషించుకున్నాం. అదే విధంగా మనం మావోయిస్టు ప్రజాయుద్ధ 50వ వార్షికోత్సవాన్ని కూడా జరుపుకుందాం. వాస్తవానికి మన పార్టీ 1970లో మావోయిస్టు ప్రజాయుద్ధాన్ని, మరి కొన్ని కేంద్రాలనూ ఆరంభించింది. 1971 నాటి ప్రత్యేక పరిస్థితులలో మావోయిస్టు ప్రజాయుద్ధం ఈ దేశంలో ఒక విశేష, ప్రత్యేక మొత్తంగా, గొప్పగా కనిపించింది. దాని కొనసాగింపుగా, 1970ల మొదటి సగంలో కొన్ని మావోయిస్టు కేంద్రాల నాయకత్వంలో ప్రజాయుద్ధం దేశవ్యాప్తంగా వీరోచిత గొప్ప పోరాటంగా మారింది. అందులో మన పార్టీ అగ్ర స్థానంలో ఉన్నది.

అయితే ఈ వెల్లువ ఎక్కువ కాలం నిలబడలేకపోయిందన్నది అందరికీ తెలిసిన విషయమే. ప్రజల, విప్లవ వ్యతిరేక శత్రువుల క్రూర అణచివేత ఇందుకు ఒక కారణం. మావోయిస్టులు (మన పార్టీతో సహా) చేసిన పొరపాట్లు చాలా తీవ్రమైనవి. అలాగే మన, ఇతరుల ఆ తరువాత కాలపు వెల్లువలు, ముఖ్యంగా 1980ల నాటి మదారిపుర్ పోరాటం, కొద్ది కాలం తరువాత మన పార్టీ నాయకత్వంలో రెండవ దేశవ్యాప్త సాయుధ వెల్లువా ధ్వంసమయ్యాయి. వీటితో పాటుగా గడచిన ఒకటిన్నర దశాబ్ద కాలంలో ప్రపంచవ్యాప్త మావోయిస్టు ఉద్యమంలో వినాశనాల కారణంగా ప్రపంచ విప్లవ పోరాటంలో తీవ్ర సంక్షోభాలు ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు మన పార్టీ చాలా కాలంగా ప్రపంచవ్యాప్తంగా యావత్తు అంకిత, విప్లవకారులు, విప్లవాన్ని ఆకాంక్షించే శక్తులతో కలిసి పని చేస్తున్నది.

రిమ్ ప్రపంచవ్యాప్త మావోయిస్టుల నూతన కేంద్రంగా ఏర్పడింది. దీని ప్రభావం, నాయకత్వాలతో ప్రపంచమంతటా నూతన విప్లవ వెల్లువ సృష్టించబడుతూ ఉన్నది. అయితే, రెండు దశాబ్దాల పాటు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ పునర్నిర్మాణం, అభివృద్ధిలో చెప్పుకోదగ్గ దోహదం చేసినప్పటికీ, ఈ శతాబ్ది మొదటి దశకంలో వివిధ కారణాలతో రిమ్ నిష్క్రియమయిపోయింది. దీనికి

ముఖ్య కారణాలు – 1. పెరూలో మితవాద ప్రజాయుద్ధ వ్యతిరేక పంథా ముందుకు రావడం. పెరూ కేంద్ర నాయకత్వంలో అనేక మంది ఏదో ఒక రకంగా దీనికి గురి అయ్యారు 2. నేపాల్‌లో ప్రచండ–రివిజనిజం ప్రజాయుద్ధాన్ని విడిచిపెట్టడం, విప్లవానికి ద్రోహం చేయడం 3. అమెరికాలో అవాకియన్ నాయకత్వంలో 'న్యూ కమ్యూనిజం'తో కార్మికవర్గ వర్గ దృష్టికోణం నుంచి, ఎంఎల్ఎం సారానికీ పెడగా పోవడం. ఇంతేకాకుండా, ప్రపంచంలో కొన్ని ముఖ్యమైన మావోయిస్టు శక్తులకు విప్లవ కమ్యూనిస్టుల అంతర్జాతీయ కేంద్రంగా రిమ్ ఏర్పాటు అవసరం గురించిన చైతన్యం లేకపోవడం వల్ల కూడా మన అంతర్జాతీయ ఐక్యత, బలం బలహీనపడ్డాయి. అయితే మన పార్టీతో సహా ప్రపంచవ్యాప్త మావోయిస్టు విప్లవకారులు సమస్యలను పునరంచనా వేస్తున్నారు. నూతనంగా అంతర్జాతీయ కేంద్రం/ఒప్పందం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. మన పార్టీ కూడా ఇందుకు దోహదం చేస్తున్నది.

ఈ మధ్య కాలంలో అంతర్జాతీయ, జాతీయ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు చాలా మారాయి. ఇవి ప్రజాయుద్ధ వ్యూహం, ఎత్తుగడలపై భారీ ప్రభావం వేస్తున్నాయి. ముఖ్యంగా మనది లాంటి దేశాలలో సామాజిక, ఆర్థిక పరిస్థితి చాలా మారింది. వ్యవసాయం మౌలికంగా అర్ధభూస్వామ్యంగా ఉన్నప్పటికీ దీని కేంద్రంగా భారీ మార్పులను అర్థం చేసుకోవాలి. పైన పేర్కొన్న అంశాల వల్ల కమ్యూనికేషన్ వ్యవస్థ, మొబైల్, ఐటీ, సైనిక సాంకేతికత, సాధారణ సాంకేతికత, కేంద్రీకృత రాజ్య యంత్రాంగం అపారంగా బలోపేతం కావడంతో గతంలో కంటే సైనిక అంశాలు చాలా విభిన్న పద్ధతులలో ముందుకు వచ్చాయి. వీటి పరిష్కారం ఇంకా పరిపూర్తి కాలేదు. వివిధ దేశాలలో నిరంతరం, కఠినంగా ప్రజాయుద్ధాన్ని ఆచరించడం ద్వారానే ఈ సమస్యలను అధిగమించవచ్చు. యుద్ధ, పోరాట సూత్రీకరణను, వ్యూహాలను పెంపొందించాలి. గత పోరాటాల కార్బన్ కాపీలు పని చేయవు. గ్రామీణ ప్రాంతాలు పునాదిగా మాత్రమే ఇది సాధ్యం. రైతాంగాన్ని ప్రధాన శక్తిగా ఎంచుకుని, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ సూత్రానికి కట్టుబడి ఉండాలి. మరో మార్గం లేదు.

జాతీయ, అంతర్జాతీయ పరిస్థితిలో మార్పుల గురించి మనం జాగరూకంగా ఉండాలి. ప్రపంచంలో ఎక్కడా సోషలిస్టు దేశం లేదు కనక, ప్రపంచవ్యాప్తంగా మూడు మౌలిక వైరుధ్యాలు చురుకుగా ఉన్నాయి. వీటిల్లో సామ్రాజ్యవాదానికి, పీడిత జాతులు, ప్రజలకూ మధ్యనున్నది ప్రధానమైనది. అంతర్ సామ్రాజ్యవాద వైరుధ్యం మరోసారి ద్విధ్రువ ప్రపంచాన్ని ముందుకు తీసుకువస్తున్నది. ఒక పక్క అమెరికా నాయకత్వంలో సామ్రాజ్యవాదులు, వారి మిత్రులు ఉంటే మరో పక్క చైనా సోషల్ సామ్రాజ్యవాదం, రష్యా సామ్రాజ్యవాదం, వాటి నాయకత్వంలో ఉన్న శక్తులూ ఉన్నాయి. ఇవి సంక్షోభాన్ని పెంచుతున్నాయి. తత్ఫలితంగా, సామ్రాజ్యవాదానికి, దాని వివిధ విధానాలకు, యుద్ధోన్మాదానికీ వ్యతిరేకంగా వివిధ దేశాలలో ప్రజల పోరాటం ఎగుస్తున్నది. ఈ సంక్షోభాలను నివారించడానికి సామ్రాజ్యవాదులు, వారి ఏజెంట్‌లు ఫాసిజానికి పాల్పడుతున్నారు. యుద్ధ సన్నాహాలను అపారంగా పెంచివేస్తున్నారు. ఈ పోరాటాలన్నీ సరైన సిద్ధాంతం, కార్యక్రమాలు, పంథాలకు అనుగుణంగా ప్రజా పోరాటానికి మార్గదర్శకత్వం అందించడానికి ఉన్న ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి. వస్తుగత విప్లవ పరిస్థితులకు మన ఎంఎల్ఎం శక్తుల స్వీయాత్మక సామర్థ్యం వెనుకబడే ఉన్నది. విప్లవ పార్టీని, పోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఈ తేడాను తగ్గించేందుకు మన కృషిని బహుళం చేయాలి.

పార్టీ, ప్రజాయుద్ధ స్థాపన 50వ వార్షికోత్సవం సందర్భంగా మన కర్తవ్యాలు స్పష్టంగా ఉండాలి – 1. యావత్తు అంకితబద్ధులైన మావోయిస్టులను ఐక్యం చేయడం ద్వారా నూతన రకపు ఏకైక మావోయిస్టు పార్టీ ఏర్పాటు 2. ఈ పార్టీ నాయకత్వంలో విజయవంతంగా ప్రజాయుద్ధాన్ని నిర్మించడం 3. వివిధ బహిరంగ సంఘాలు, వేదికలలో భారీ సంఖ్యలో ప్రజలను ఐక్యం చేయడం 4. ప్రపంచవ్యాప్తంగా మావోయిస్టుల నూతన 'ఇంటర్నేషనల్' ఏర్పాటు. ఉన్నత సైద్ధాంతిక–రాజకీయ పంథా, సైనిక, అంతర్జాతీయ పంథా ఈ కర్తవ్యాలకు ప్రాతిపదికగా ఉంటుంది. ఈ ముఖ్యమైన కర్తవ్యాలకు సంబంధించి, మనం, అంటే యావత్తు నాయకులు, శ్రేణులు, మద్దతుదారులు, ప్రజలూ మరింతగా పోరాట దిశగా ముందుకు సాగాలి. యావత్తు విప్లవకారుల స్వప్నాన్ని సాకారం చేసేందుకు కృషి చేయాలి. చివరి వరకు, ఆఖరి శ్వాస వరకు ఈ పని కొనసాగించాలి. అంకితత్వానికి, ఏ రకమైన త్యాగానికి, ప్రజలకు సేవ చేయడానికి వీరంతా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. ఇందుకోసం మార్క్సిజం–లెనినిజం–మావోయిజాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవాలి. ప్రపంచ కార్మికవర్గ, పీడిత ప్రజల విముక్తి పోరాటానికి మొత్తంగా అంకితమవ్వాలి. ☆

**"గెరిల్లా యుద్ధం వికేంద్రీకృత స్వభావం కలది. దీనిని ఏ ప్రాంతానికైనా విస్తరింపచేయువచ్చు. ఇది జరిపే అనేక చర్యలలో శత్రువును చికాకుపరుచుట, శత్రువును నిలువరించడం, శత్రువును విచ్ఛిన్నపరుచుట, ప్రజలలో సాగించే కార్యక్రమం – వీటన్నింటిలోనూ వికేంద్రీకరణ సూత్రాన్ని పాటించవలసి వుంటుంది"**

**–మావో**

(నోటు: మేడే సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సహా 15 విప్లవ పార్టీలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలు క్రాంతి పాఠకుల కోసం అందిస్తున్నాం)

# ప్రపంచ కార్మికులారా, పీడిత ప్రజలారా ఐక్యం కండి!

## ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదం, ప్రతిఘాతుకత, వేదన, యుద్ధాలకు వ్యతిరేకంగా, కార్మికవర్గ, సోషలిస్టు విప్లవం కోసం మేడే!

ప్రపంచ కార్మికవర్గం, దోపిడీకి గురయ్యే ప్రజానీకం పెట్టుబడిదారీ ప్రపంచ దోపిడీకి వ్యతిరేకంగా ఒకే అంతర్జాతీయ వర్గంగా కూడళ్లలోకి, వీధులలోకి తరలి రావాలని కోరుకునే రోజు మేడే.

మేడే నాడు కార్మికులు, ప్రజలు పెట్టుబడిదారీ వ్యవస్థను, పీడిత దేశాలపై సామ్రాజ్యవాద పాలనను బహిర్గతం చేస్తారు. దోపిడీదారులతో రాజీని, వేతన శ్రమ దోపిడీని సాటిలేనిదిగా చేసి చూపించే, లాభాలను, సంపదనూ సంచయనం చేసుకునే సామ్రాజ్యవాద బడా గుత్తాధి పత్యాలకు సేవ చేసే, కుమ్మక్కుపూరిత ట్రేడ్ యూనియన్‌ల, 'కార్మికుల–అమ్మక' పార్టీలను వ్యతిరేకిస్తారు.

గడిచిన 40 సంవత్సరాల కాలంలో అత్యవసర సరుకుల ధరలు ఎన్నడూ లేనంతగా పెరిగాయి. కార్మికుల నిజవేతనాలు మరింతగా పడిపోయాయి. బడా పరిశ్రమలన్నింటిలోనూ నిరుద్యోగం, శ్రమశక్తి కుదింపు నాటకీయంగా పెరుగుతున్నాయి. గడచిన పది సంవత్సరాలలో ప్రపంచ సంపదలో 99 శాతం, 1 శాతం పెట్టుబడిదారుల యాజమాన్యంలో ఉన్నది. పర్యావరణం, ప్రకృతి వినాశనం పెరిగి పోతున్నది. ప్రాకృతిక వినాశనాలను పెట్టుబడిదారీ విధానం వేగవంతం చేస్తున్నది, పెంచుతున్నది. సామాజిక అసమానతలు ప్రపంచ ప్రజలకు తీవ్ర విషాదం కలిగిస్తున్నవి.

పెట్టుబడిదారీ విధానం సంచయనం, లాభం, కార్మికవర్గాల దోపిడీ వ్యవస్థ పెట్టుబడిదారీ ఉత్పత్తికి మరింత సమాజ వ్యతిరేక ఉత్పత్తి, మరింత ప్రైవేటు దోపిడీ చిహ్నాలు. ఈ మౌలిక వైరుధ్యం దాని అనివార్య క్షీణతకు దారి తీస్తుంది.

మార్క్స్ పేర్కొన్నట్టుగా పెట్టుబడి పైనుంచి కింది వరకు ప్రతి రంధ్రం నుంచి నెత్తురు, మురికి ఓడుతూ ఉంటుంది. అవసరమైన యావత్తు శక్తితో పెట్టుబడిదారీ వ్యవస్థను నాశనం చేయడం ఒక్కటే కార్మికవర్గ విముక్తికి మార్గం.

వర్గ పోరాటం చరిత్రను నిర్మిస్తుందని మార్క్స్, కమ్యూనిస్టులు వక్కాణించారు. ఇవాళ ప్రపంచం ఒక చారిత్రక పరిస్థితిలో ఉన్నది. ఒక పక్క సామ్రాజ్యవాదం సంక్షోభంలో ఉన్నది. తన సంక్షోభాన్ని కార్మికవర్గంపై, విశాల ప్రజానీకంపై మోపుతోంది. కార్మికవర్గ, కమ్యూనిస్టు సంస్థల పోరాటాన్ని అణచివేస్తోంది. మరో పక్క కార్మికవర్గం, ప్రజానీకం మరింతగా విస్తృత పోరాటాలు, తిరుగుబాట్లు చేస్తున్నారు. సామ్రాజ్యవాద, ప్రతిఘాతుక ప్రభుత్వాలను, బూర్జువా రాజ్యాలను, యావత్తు సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ సామాజిక వ్యవస్థనూ ప్రశ్నిస్తున్నారు.

మాక్రాన్ ప్రభుత్వ ఫించను సంస్కరణకు వ్యతిరేకంగా పారిస్‌లో, ఇతర ఫ్రెంచి నగరాలలో వీధులు కార్మికవర్గ, ప్రజానీక క్రమబద్ధ, యుద్ధపూరిత ఉద్యమంతో ఎలా నిండిపోయాయో యావత్తు ప్రపంచం వీక్షిస్తున్నది. గ్రేట్ బ్రిటన్, జర్మనీ, స్విట్జర్లాండ్ లలో కూడా పెద్ద పోరాటాలు పెంపొందుతున్నాయి. ఫ్రెంచ్ సామ్రాజ్యవాద రాజ్యం ఈ పెద్ద పోరాటాలకు నిర్బంధంతో జవాబు చెబుతున్నది. అయితే నిర్బంధం కార్మికవర్గ, ప్రజానీక పోరాటాలను నిలిపివేయకపోగా, మరింత సృష్టిస్తుంది. బూర్జువా ప్రజాస్వామ్యం అంచున వారు మిలిటెంట్ పోరాటాలు చేశారు.

సామ్రాజ్యవాద పెట్టుబడిదారులే సామాజిక ప్రగతిని అడ్డుకుంటున్నారని, ఈ భూమి మీద నుంచి నిర్మూలించవలసిన పరాన్నభుక్కు వర్గం ఇదేనని ఇవాళ ఎప్పటి కంటే కూడా మరింత స్పష్టంగా అర్థం అవుతున్నది.

వేతనాలు, ఉద్యోగాలు, ఆరోగ్య సేవలు, జీవన పరిస్థితులపై పెట్టుబడిదారుల దాడులను ప్రతిఘటించే కార్మివర్గ, ప్రజానీక పోరాటాలు తమ దోపిడీ మూలాల వద్దకు వెళ్లాలి. ఉత్పత్తి సాధానాలపై వ్యక్తిగత ఆస్తిని రద్దు చేయాలి. శ్రమ ఉత్పత్తిపై హక్కును సాధించాలి.

సంక్షోభాన్ని అధిగమించేందుకు సామ్రాజ్యవాద ప్రపంచాన్ని విభజించే యుద్ధం దిశగా, ప్రపంచ మార్కెట్‌ను కబ్జా చేసే దిశగా సాగుతుందని చరిత్ర స్పష్టం చేసింది. రష్యా, అమెరికాల మధ్య సామ్రాజ్యవాద పోటీ వల్లనే రష్యా–యుక్రెయిన్ యుద్ధం బద్దలయింది. ఇది ప్రపంచ విభజన కోసం జరుగుతున్న యుద్ధం. ప్రాకృతిక వనరులపై గుత్తాధిపత్య నియంత్రణ కోసం జరుగుతున్నది. యుద్ధం ప్రారంభమయిన నాటి నుంచి, యుద్ధ పరిశ్రమల లాభాలు, చమురు, వాయు కంపెనీలూ ద్విగుణీకృతం

అయ్యాయి. కార్మికవర్గం, రైతాంగం, ప్రజానీక పరిస్థితులు మరింతగా దిగజారాయి.

బూర్జువా వర్గం ఒక పార్లమెంట్‌లు, ఎన్నికలతో పాలించలేదు. కార్మికవర్గం, ప్రజానీకం ఎన్నికలకు ఎడంగా ఉంటున్నారు.

సామ్రాజ్యవాద సంక్షోభం నుంచి, ప్రపంచ కార్మికవర్గ, ప్రజల పోరాటాల నుంచి సోషలిజం, కమ్యూనిజం అవసరం పుడుతుంది. కార్మికవర్గ పోరాటాలు, ప్రజల, యువత, మహిళల వలస ప్రజల తిరుగుబాట్లు ఐక్యతను, సంస్థను, నాయకత్వాన్ని, అలాగే పాత అధికారాన్ని కూల్చివేసి, నూతన అధికారాన్ని నిర్మించేందుకు, నూతన సమాజం కోసం ఒక కార్యక్రమాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సామ్రాజ్యవాద దేశాల బూర్జువా వర్గం దాన్ని పరిష్కరించడానికి యుద్ధం దిశగా సాగుతున్నది. ప్రపంచ పునర్విభజనకు మరో సామ్రాజ్యవాద యుద్ధం కోసం మరో ఊచకోత. అమెరికా, రష్యా, చైనా, ఐరోపా, జపాన్ మొదలుగా యావత్తు సామ్రాజ్యవాద దేశాలూ ప్రపంచ యుద్ధానికి చురుకుగా సన్నాహాలు చేసుకుంటున్నాయి. అందుబాటులో ఉన్న తమ యావత్తు ఆయుధాలను వినియోగిస్తున్నాయి. యుద్ధ పరిశ్రమ భారీ లాభాలను జమ చేసుకునే స్టేట్-ఆఫ్-ఆర్ట్ ఆయుధాలతో తమ ఆయుధాగారాలను పునర్నిర్మిస్తున్నాయి.

ప్రపంచ యుద్ధ సన్నాహాలలో ఉన్న పాలక వర్గాలు, పీడిత దేశాలలో ఉన్న వారి తొత్తులు తమ దేశ ప్రజల ప్రయోజనాలు, ఇష్టాయిష్టాలకు వ్యతిరేకంగా ఆయా సామ్రాజ్యవాద యజమానులకు సేవ చేస్తున్నాయి.

యుద్ధాన్ని వ్యతిరేకించే, అదే గనక బద్దలయితే, దాన్ని విప్లవ యుద్ధంగా మార్చగలిగే సామర్థ్యం ఉన్న ఏకైక సామాజిక శక్తి కార్మికవర్గం. అన్యాయ యుద్ధం కోసం బలగాల, ఆయుధాల మోహరింపును, 'బలిపశువులుగా మారనున్న' కార్మికవర్గ భర్తీని వాళ్లు అడ్డుకోవాలి. సామ్రాజ్యవాద దోపిడీకి గురయ్యే దేశాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని, ప్రజాయుద్ధాలను తీవ్రతరం చేయాలి. ప్రపంచ కార్మికవర్గ, ప్రజల ఐక్యత, విప్లవ పోరాటాలూ సామ్రాజ్యవాద యుద్ధ సన్నాహాలను, అసలు యుద్ధాన్నే విప్లవ అంతర్యుద్ధంగా, యావత్తు దేశాలలో పెట్టుబడి అధికారాన్ని ఓడించే సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని నాశనం చేసే ప్రజల యుద్ధంగా పరివర్తన చెందించగలవు.

ప్రపంచంలో యావత్తు మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీలు, సంస్థలూ, సామ్రాజ్యవాద ప్రస్తుత సంక్షోభాన్ని, సామ్రాజ్యవాద యుద్ధాన్ని ప్రపంచ కార్మికవర్గ, ప్రజల ఉద్యమాలుగా మార్చాలి. ఆయా దేశాలలో ఆయా దశలలో కార్మికవర్గ, సోషలిస్టు విప్లవాలు చేసే లక్ష్యం కలిగి వుండాలి.

నూతన ప్రపంచ సామ్రాజ్యవాద వినాశనం కోసం జరుగుతున్న సన్నాహాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయతావాద ఐక్యత, పోరాటాలకు కమ్యూనిస్టులు ఉదాహరణ నెలకొల్పాలి; సామ్రాజ్యవాద యుద్ధాల కోసం, ప్రతిఘాతుక, అన్యాయ యుద్ధాల కోసం బలగాల, ఆయుధాల మోహరింపుకు వ్యతిరేకంగా కార్మికవర్గ, ప్రజానీక సైన్యాల విప్లవ పోరాటాన్ని ముందుకు తీసుకురావాలి; ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశాలలో యుద్ధాన్ని, తమ సామ్రాజ్యవాద యజమానుల కోసం తొత్తు ప్రభుత్వాలు అందించే సైనిక మద్దతునూ వ్యతిరేకించే యావత్తు విప్లవ, సామ్రాజ్యవాద వ్యతిరేక, నిజమైన ప్రజాస్వామిక శక్తులతో కలిసి నిలబడాలి; కార్మికవర్గం, ప్రజల పేరుతో ఒక్కోసారి ప్రపంచ పీడిత, దోపిడీకి గురయ్యే ప్రజలకు బద్ధ శత్రువులైన సామ్రాజ్యవాద ముఠాలలో ఒక దానికి మద్దతు ఇచ్చే సంస్కరణవాద, అవకాశవాద సోషల్-డెమోక్రటిక్ శక్తులను నిరాకరించాలి, బహిర్గతపర్చాలి; వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయాలి, కార్మికులు, నిజమైన వర్గ సంఘాలు, అంటే, ఫ్యాక్టరీలలో, అత్యున్నత దోపిడీ రంగాలలో, వేతన శ్రమ నూతన వాస్తవికతలలో కార్మికుల పోరాటాలను సంఘటితం చేసే వారి ప్రతిఘటనా, రక్షణా సాధనాలను బలోపేతం చేయాలి; భూమి సాగు చేసే రైతాంగ ప్రజల గొప్ప పోరాటాలకు మద్దతు ఇవ్వాలి; వివక్ష, అసమానత, మహిళలపై హత్యలు, అత్యాచారాలు, గర్భస్రావ హక్కు నిరాకరణ, సామ్రాజ్యవాద దేశాలలో ఆధునిక మధ్య యుగాల మాదిరి, సామ్రాజ్యవాద అణచివేతలో వున్న దేశాలలో భూస్వామ్య బానిసత్వ మాదిరి ద్విగుణీకృత పీడనకు వ్యతిరేకంగా మహిళా ఉద్యమాన్ని, విప్లవ కార్మికవర్గ స్త్రీవాదాన్ని అభివృద్ధి చేయాలి; ప్రత్యేకించి సామ్రాజ్యవాద దేశాలలో స్వీకారం కోసం, ఆశ్రయ హక్కు కోసం, సంచరించే స్వేచ్ఛ, పని చేసే హక్కు, వేతనాలు, ఇళ్ల కోసం, సముద్రం మీద భూమి మీద ఊచకోతలకు వ్యతిరేకంగా శరణార్థులు చేస్తున్న పోరాటాలను సంఘటితం చేసి ఫాసిజానికి, జాత్యాహంకారానికి వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాన్ని తీవ్రతరం చేయాలి; బూర్జువా రాజ్యానికి వ్యతిరేకంగా విప్లవ పోరాట అగ్రశ్రేణిలో నిలబడే విధంగా యువజనుల తిరుగుబాటుపై ఆధారపడాలి; సామ్రాజ్యవాద, ప్రతిఘాతుక ప్రభుత్వాల బందీఖానలలో బందీగా ఉన్న రాజకీయ ఖైదీల, మన యావత్తు వర్గ సోదరుల విడుదల కోసం పోరాడాలి.

ప్రపంచ కార్మికవర్గ ఐక్యత, సామ్రాజ్యవాద దేశాల కార్మికవర్గం, ప్రపంచ పీడిత ప్రజల ఐక్యతే అంతర్జాతీయతావాద సారాంశం.

ప్రతి దేశంలోనూ కార్మికవర్గం స్వతంత్ర రాజకీయ పార్టీ, అదే కమ్యూనిస్టు పార్టీ, ఇవాళ మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీగా సంఘటితం కావడం, యావత్తు దేశాల కమ్యూనిస్టు పార్టీలూ నిజమైన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ఐక్యం కావడం, నూతన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ దృష్టితో, దృక్పథంతో ఒకే అంతర్జాతీయ సంస్థను నిర్మించడం అంతర్జాతీయతావాదానికి అవసరం.

మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు కమ్యూనిస్టులు ముందుకు సాగుతున్నారు. అనుభవం నుంచి నేర్చుకోవాలి. పొరపాట్ల నుంచి నేర్చుకోవాలి. నూతన చారిత్రక ఐక్యతకు సిద్ధం కానివ్వకుండా తమను అడ్డుకున్న చారిత్రక లోపాల నుంచి నేర్చుకోవాలి.

నిజమైన కార్మికవర్గ, విప్లవ పార్టీలు,

# ప్రపంచ కార్మిక దినం మేడే వర్ధిల్లాలి

## ప్రపంచ వ్యాపిత మాంద్య పరిస్థితులలో

### జీవితాలు అస్తవ్యస్తమవుతున్న కార్మికవర్గాన్ని సంఘటితం చేయండి

### సామ్రాజ్యవాద యుద్ధ ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడండి

కార్మికులారా!

"ప్రపంచ కార్మికులారా ఏకం కండి", "పోరాడితే పోయేది ఏమీ లేదు, బానిస సంకెళ్ల తప్ప" అన్నారు మార్క్సిస్టు మహోపాధ్యాయులు మార్క్స్ ఏంగెల్స్‌లు. ప్రపంచ కార్మిక వర్గం అనేక వీరోచిత పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకున్న రోజు మే డే. ఇది కార్మిక వర్గ పోరాటాల దినం. గత 137 సంవత్సరాలకు పైగా ఈ దినాన్ని అంతర్జాతీయ శ్రామిక వర్గం గొప్ప పోరాట ఉత్సాహంతో, దీక్షా-వట్టుదలలతో జరుపుకుంటున్నది. వారు తమ హక్కుల హననానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేస్తూ విజయాలు సాధిస్తున్నారు. వారు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై గొప్ప పోరాటాలకు తలపడుతూ వాటిని సాధించుకుంటున్నారు. అంతర్జాతీయ మేడే శ్రామికవర్గ పోరాటాల దినం సందర్భంగా విశ్వ కార్మిక వర్గానికి ముందుగా రెడ్ శల్యూట్స్, అరుణారుణ విప్లవాభివందనాలు తెలియచేద్దాం.

కార్మికులారా!

గత శతాబ్దమంతా కార్మికవర్గ విప్లవాల విజయాలతో ప్రపంచం పరవళ్లు తొక్కింది. రష్యా, చైనా విప్లవ విజయాలే కాకుండా ప్రపంచంలో అనేక దేశాలలో కార్మికవర్గ విప్లవాలు జయప్రదమై సోషలిస్టు శిబిరం ఏర్పడింది. ప్రపంచంలో మూడవ వంతు భూభాగంపై ఎర్రజెండా రెపరెప లాడింది. కానీ, ఆ విజయాలు ఎక్కువ కాలం నిలువలేదు. కార్మికవర్గ అధికారం, ప్రజల ప్రజాస్వామిక నియంతృత్వం దెబ్బతినిపోయింది. విప్లవ పార్టీలలో, కార్మికవర్గ ప్రభుత్వాలలో రివిజనిస్టులు బలపడి అంతిమంగా రాజ్యాధికారాన్ని కైవశం చేసుకున్నారు. చరిత్రలో మొదట సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం, ఆ తరువాత చైనా నూతన సోషల్ సామ్రాజ్యవాదంగా అవతరించి ప్రపంచంలో సోషలిస్టు శిబిరం అంటూ లేకుండా పోయింది. అయినప్పటికీ, ప్రపంచ వ్యాపితంగా కార్మికవర్గ పోరాటాలు కొనసాగుతున్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా పోరాటాలు తీవ్రమవుతున్నాయి. మరోవైపు వివిధ దేశాలలో నూతనంగా మావోయిస్టు పార్టీలూ ఆవిర్భవిస్తున్నాయి. ఇది వర్తమాన ధోరణిగా కొనసాగుతోంది. ఈ పోరాటాలను, నూతన వరవడిని దెబ్బతీయడానికి రివిజనిస్టులు, నయా రివిజనిస్టులు బూర్జువా వర్గాలతో అంటకాగుతూ ప్రధాన ప్రమాదకర శక్తులుగా నిలిచారు. వీరిని బట్టబయలు చేయకుండా, వీరి కుట్రలను ఓడించకుండా కార్మిక వర్గం రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకునే పోరాటాల దిశలో పురోగమించలేదు. ఈ మేడే సందర్భంగా అన్ని దేశాలలోని విప్లవ కార్మికవర్గ అగ్రగామి దళాలు ఆ ప్రమాద తీవ్రతను గుర్తించి, కార్మికులను జాగరూకులను చేస్తూ వర్తమాన విప్లవకర పరిస్థితులలో శ్రామికవర్గ పోరాటాలను తీవ్రతరం చేస్తుందనీ మేం దృఢ విశ్వాసంతో వున్నాం.

కార్మికులారా!

గత కొద్ది సంవత్సరాలుగా ప్రపంచవ్యాపితంగా శ్రామికవర్గ పోరాటాలు ఏయేటికాయేడు తీవ్రం అవుతున్నాయి. వర్తమాన

---

మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీలు, కార్మికవర్గానికి నిజంగా అగ్రగామి విభాగాలు ఉండి, ఆయా దేశాలకు, ఆయా దశలకు అనుగుణంగా వ్యూహం ఎత్తుగడలను రూపొందించుకోగల; చట్టబద్ధ, చట్ట వ్యతిరేక నిర్మాణ పోరాట రూపాలను వినియోగించగల, ప్రజల నుంచి నేర్చుకోగల, నిర్వీర్య, దివాళాకోరు, భావవాద, స్వీయాత్మక, సైనిక పెటీ బూర్జువా తీవ్రవాదానికి బలి కాకుండా కుళ్లిపోయిన పాత, కొత్త రూపాల రివిజనిజాన్ని వదిలించుకోగల వాటిని నిర్మించుకోవడం, అభివృద్ధి చేసుకోవడం అవసరం.

ఆయా దేశాల పరిస్థితులకు అనుగుణంగా, విశాల ప్రజల నిజమైన నాయకత్వాన్ని సాధించేందుకు అవసరమైన, వర్గ శత్రువుల మధ్య వైరుధ్యాల నుంచి ప్రయోజనం పొందగల పెట్టుబడిదారీ వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్యసంఘటనను నిర్మించడం అవసరం.

కార్మిక సైన్యాన్ని నిర్మించే, వర్గ యుద్ధాన్ని, విప్లవ యుద్ధాన్ని, దీర్ఘకాలిక ప్రజా యుద్ధాన్నీ పెంపొందించగల పోరాట శక్తికి మనం జన్మనివ్వడం అవసరం.

సామ్రాజ్యవాదం నశించాలి! సోషలిజం, కమ్యూనిజం కోసం పోరాడుదాం.

☆

ప్రపంచం తీవ్ర మాంద్య పరిస్థితులలో కొట్టుమిట్టాడుతుండగా, అనేక దేశాలలోని కార్మికుల జీవితాలు అస్తవ్యస్థమవుతున్నాయి. ఇపుడు మళ్లీ ఒకసారి బ్యాంకుల పతనం మొదలైంది. అమెరికాలో మూడవ అతిపెద్ద బ్యాంకు సిలికాన్ వ్యాలీ బ్యాంకు షేర్ల విలువలు పడిపోయి కుప్పకూలింది. ఆ వరుసన అమెరికా, యూరప్ దేశాలలో బ్యాంకుల పతనం మొదలైంది. ఈ బ్యాంకు దివాళాలు మరోవిడుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అస్తవ్యస్తం చేసితీరుతాయి. గత మూడేళ్లుగా కార్మికులతో పాటు సమస్త ప్రజానీకాన్ని సామ్రాజ్యవాదులు సృష్టించిన కోవిడ్ మహమ్మారి అతలాకుతలం చేస్తున్నది. ఇప్పటికి ప్రపంచం వివిధ రకాల కోవిడ్ వేరియంట్లతో సతమతమవుతున్నది. సామ్రాజ్యవాదులు వాక్సిన్ పేరుతో శ్రమజీవుల జేబులు ఖాళీ చేశారు. కానీ ఏ వ్యాక్సిన్ వ్యాధిని సంపూర్ణంగా నిరోధించలేకపోతున్నదనీ వాస్తవాలు వెల్లడిస్తున్నవి. కోవిడ్ కాలంలో ప్రభుత్వాలు విధించిన లాక్‌డౌన్ విధానాలతో లక్షల సంఖ్యలో శ్రామికుల జీవితాలు కడతేరాయి. ప్రపంచ వ్యాపితంగా దోపిడీ ప్రభుత్వాలు మాంద్య పరిస్థితులలో కార్పొరేట్ దిగ్గజాలను ఆదుకోవడానికి పెద్ద మొత్తాలలో నిధులు అందచేస్తున్నాయి. కానీ, కార్మికుల సంక్షేమం గురించి ఏ ప్రభుత్వం ఆలోచించలేదు. వారిని ఆదుకోవడానికి సమగ్ర విధానాలను ఎక్కడా చేపట్టలేదు. అందుకే దోపిడీ ప్రభుత్వాల స్వభావాన్ని గుర్తించిన కార్మికవర్గం ఆ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తమ పోరాటాలను తీవ్రతరం చేయాల్సిన తరుణమిది.

గడచిన యేడాది కాలానికి పైగా ప్రపంచం సామ్రాజ్యవాదులు రగిలించిన యుద్ధ జ్వాలలలో రగిలిపోతోంది. ఒకవైపు రష్యన్ సామ్రాజ్యవాదులు, మరో వైపు అమెరికా సామ్రాజ్యవాదులు మరియు దాని నాటో కూటమి నిలిచి ఉక్రెయిన్ భూభాగాన్ని యుద్ధ మంటలలో బూడిద చేస్తున్నారు. రష్యా సామ్రాజ్యవాదం ఉక్రెయిన్‌పై ప్రత్యేక సైనిక చర్య పేరుతో యుద్ధానికి పాల్పడడం ఎంత నిందనీయమో, అంతకన్నా అధికంగా అమెరికా, నాటో కూటమి అనుసరిస్తున్న యుద్ధ పిపాస విధానాలు ప్రమాదకర పరిణామాలకు దారితీస్తున్నాయి. రష్యా, ఉక్రెయిన్‌లు యుద్ధంలో మునిగిపోవడంతో ఆ రెండు దేశాలలోని ప్రజలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటు న్నారు. ఉక్రెయిన్‌లో ఇప్పటికే దాదాపు లక్షన్నర మంది ప్రజలు సమిధలయ్యారనీ వార్తలు వెలువడుతున్నాయి. అక్కడ పెద్ద ఎత్తున లక్షల సంఖ్యలోనే ప్రజలు కాందిశీకులై ఇతర దేశాలకు వలస వెళ్లారు. ఉక్రెయిన్ రక్తసిక్తమవుతోంది. కానీ, నియో నాజీ జెలెన్స్కీ యుద్ధాన్ని ఆపడానికి, నియో జారిస్టు రష్యాతో చర్చలకు ఎంత మాత్రం సుముఖంగా లేకపోవడమే కాకుండా అమెరికా, నాటో కూటమి అండతో యుద్ధ మంటలను ఎగదోస్తున్నాడు. ఈ యుద్ధంతో లాభపడుతున్నది ప్రధానంగా అమెరికా సామ్రాజ్యవాదులు వారి మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ అన్న విషయం బహిరంగ రహస్యం. యేడాది యుద్ధ కాలంలో ఒక్క అమెరికా సామ్రాజ్యవాదులే 30 బిలియన్‌లకు పైగా యుద్ధ సామగ్రిని సహాయం పేరిట ఉక్రెయిన్‌కు అందచేసిందంటే దాని లాభాల స్థాయిని అర్థం చేసుకోవచ్చు. ఈ యుద్ధాన్ని తక్షణం ఆపాలంటూ ప్రపంచ కార్మిక వర్గం గొంతెత్తి నినదిస్తున్నది. అనేక దేశాలలో యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. వీటిని మరింత తీవ్రం చేయాల్సిన అవసరం వుంది. ఆ దిశలో మేడే నాడు అన్ని దేశాల కార్మికవర్గం సమరశీల నిర్ణయాలు తీసుకోవలసిన ఆవశ్యకత వుంది.

ప్రపంచం కార్మికవర్గ పోరాటాలతో వెల్లువెత్తుతున్నది. బ్రిటన్‌లో లక్షలాది కార్మికులు తమ జీతాలు పెంచాలంటూ, అత్యవసర సరుకుల ధరలు తగ్గించాలంటూ ఈ మధ్య కాలంలో ఎన్నడూ ఎరుగని స్థాయిలో సమ్మెలు కొనసాగిస్తున్నారు. ఫ్రాన్స్ కార్మికవర్గం రోడ్లపైకి వచ్చి తమ డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్నారు. యూరప్‌లోని అన్ని దేశాలలో, అమెరికాలో కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్నారు. భారతదేశంలో అన్ని రకాల ప్రభుత్వోద్యోగులు సమ్మెలు చేస్తున్నారు. ముఖ్యంగా లక్షల సంఖ్యలోని కాంట్రాక్టు ఉద్యోగులు ఆంగన్ వాడీలు, ఆశా వర్కర్లు, సఫాయి కార్మికులు, మిథానిన్ వర్కర్లు తమను ప్రభుత్వోద్యోగులతో సమానంగా చూడాలనీ, జీతాలు పెంచాలనీ, ఉద్యోగులకు వర్తించే అన్ని సౌకర్యాలు తమకూ వర్తింపచేయాలనీ డిమాండ్ చేస్తున్నారు. రైతులు అపూర్వస్థాయిలో తమ డిమాండ్ల సాధన కోసం సమరశీల పోరాటాలు, పాదయాత్రలు కొనసాగించడం ప్రభుత్వాలను పరేషాన్ చేస్తున్నది. దక్షిణాసియా దేశాలు ముఖ్యంగా శ్రీలంక, పాకిస్తాన్ సంక్షోభపు సుడిగుండంలో సతమతమవుతుండగా, ఆ దేశాలలోని పీడిత ప్రజలు పెరుగుతున్న ధరల కొలిమిలో మండిపోతున్నారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలోని కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై పోరాడుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రపంచం కార్మికుల సమ్మెలతో అట్టుడికిపోతున్నది. మరోవైపు కార్మికులను ఉద్యోగాల నుండి తీసేయడం ప్రపంచ వ్యాపిత ఫినామినాగా మారింది. భారీ కార్పొరేట్ సంస్థలలో నుండి వేల సంఖ్యలో కార్మికులకు ఉద్వాసన చెపుతున్నారు. ఉద్యోగాలు ఊడిపోయి వీధుల పాలవుతున్న కార్మికులూ పోరాడుతున్నారు. ఈ పోరాటాలకు విప్లవ కార్మికవర్గ అగ్రగామి దళాల నాయకత్వ అవసరం వుంది. ఈ అదును జారవిడుచుకోకుండా తగిన పోరాట నిర్మాణ రూపాలతో కార్మిక వర్గ అగ్రగామి దళాలు రంగంలో నిలిచి కార్మిక వర్గాన్ని సంఘటితం చేయాలి. సమరశీల పోరాటాలను అధికారాన్ని హస్తగతం చేసుకునే విప్లవ రాజకీయాలతో పదునెక్కించాలి. లేని పక్షంలో కార్మికవర్గం దశాబ్దాల ఆర్థికవాద, సంస్కరణవాద రొంపిలో కూరుకుపోయి నాలుగు డాలర్ల పెరుగుదలతో సంతృప్తి చెంది రివిజనిస్టు రాజకీయాలకు బలిగాక తప్పదు. ఆ అవకాశాన్ని ససేమిరా ఇవ్వకూడదనీ మేడే నాడు అరుణారుణ పతాక సాక్షిగా ప్రతినబూనాలి.

సామ్రాజ్యవాదులు రగిలించిన ఉక్రెయిన్ యుద్ధ జ్వాలలు చల్లారడమే లేదు. అవి ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని తీవ్రం చేస్తున్నవి. అణు యుద్ధ ప్రమాదం పెరుగుతోంది. ప్రపంచంలో ఉక్రెయిన్

ఒక్కటే సామ్రాజ్యవాద యుద్ధ వినాశనానికి బలికావడం లేదు. యెమన్‌లో లక్షల సంఖ్యలో ప్రజలు మరణిస్తున్నారు. అనేక దేశాలలో సామ్రాజ్యవాదుల యుద్ధ ప్రయోజనాలకు ప్రజలు బలవుతున్నారు. పీడిత ప్రజల హాహాకారాలతో ప్రపంచం తల్లడిల్లుతున్నది. యుద్ధం మూలంగా పర్యావరణం ధ్వంసమవుతూ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. తీవ్రతరమవుతున్న కార్మికవర్గ కడగండ్లకు సామ్రాజ్యవాదుల యుద్ధాలు ఒక ప్రధాన కారణం. సంక్షోభాలకు అవే మూలం. కార్మికవర్గ హక్కుల హననానికి, మారణహోమాలకు సామ్రాజ్యవాదులే కారకులు.

ప్రపంచంలో ఒక్క అమెరికానే 300కు పైగా యుద్ధాలు కొనసాగించి కోట్ల సంఖ్యలో ప్రజలను బలిగొంది. అది కేవలం తన ప్రపంచాధిపత్యం కోసం తన అపార లాభాల కోసం వినాశనాన్ని కోరుకుంటున్నాది. అది చేపట్టే ప్రతి చర్య ప్రపంచంలో ఏదో మూల యుద్ధ వినాశనానికి దారులు తెరిచేదేనన్నది నిర్వివాదాంశం. అమెరికా, యూరప్ సామ్రాజ్యవాదాలు ఒక వైపు, రష్యా, చైనా సామ్రాజ్యవాదులు మరోవైపు నిలిచి ప్రపంచ పునర్విభజనకు ఉవ్విళ్లూరుతున్నారు. ఫలితంగానే, ప్రపంచం వినాశకర యుద్ధాలతో, సంక్షోభాలతో, మాంద్యాల తో, ఆకలి, దారిద్ర్యం, అత్యాచారాలు, అణచివేతలు, నిరుద్యోగం, పాక్షిక ఉద్యోగం, అధిక ధరలతో సతమతమవుతోంది. యుద్ధాలకు తావులేని ప్రపంచాన్ని సృష్టించుకుందాం. సామ్రాజ్యవాదం అంతం కాకుండా అది సాధ్యం కాదు. అందుకే మనం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను మరింత సమరశీలంగా కొనసాగిద్దాం. రివిజనిస్టుల ఆర్థికవాద, సంస్కరణవాద ప్రలోభాలకు కార్మికవర్గం బలికాకుండా విప్లవ రాజకీయాలతో వారిని తీర్చిదిద్దుకోవాలి.

ప్రపంచంలోని పలు దేశాలలో రైటిస్టు పార్టీలు అధికారాన్ని చేపట్టి రేసిజాన్ని ప్రోత్సహిస్తు న్నాయి. అనేక దేశాలలో ఫాసిజ ప్రమాదం పెరుగుతోంది. భారతదేశంలో హిందుత్వ శక్తులు గత పదేళ్లుగా దేశ అధికారాన్ని చేబూని ఫాసిస్టు విధానాలను అమలు పరుస్తున్నాయి. దేశంలో బహుళత్వాన్ని రూపుమాపడానికి అవి తమ రియాక్షనరీ విధానాలను బలవంతంగా దేశ ప్రజలపై రుద్దుతున్నాయి. దేశంలో 5 దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ప్రజాయుద్ధాన్ని తుదకంటా నిర్మూలించడానికి అవి 2024 మేను తుది గడవుగా ప్రకటించాయి. డ్రోన్ దాడులు, హెలీకాప్టర్ ఫైరింగ్‌లతో, లక్షలాది కమాండో బలగాలతో మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలు అట్టుడికి పోతున్నాయి. ఫిలిప్పీన్స్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రజాయుద్ధాన్ని రూపుమావడానికి అక్కడ మున్నెన్నటికన్నా తీవ్రంగా జూనియర్ మార్కోస్ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదుల అండదండలతో యుద్ధ చర్యలను తీవ్రం చేసింది. టర్కీ, పెరూ తదితర దేశాలలో కొనసాగుతున్న ప్రజాయుద్ధాలను అంతం చేయడానికి అక్కడి దళారీ ప్రభుత్వాలు సామ్రాజ్యవాదుల మార్గదర్శ కత్వంలో, అండదండలతో దాడులు తీవ్రం చేస్తున్నాయి. పాలస్తీనా తదితర జాతుల పోరాటాల అణచివేత చర్యలు దశాబ్దాలుగా కొనసాగుతునే వున్నాయి. ప్రపంచంలో సామ్రాజ్యవాదులను ఎదిరిస్తూ, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలకులను ఎదిరిస్తూ కొనసాగుతున్న ప్రజాయుద్ధాలకు, జాతుల పోరాటాలకు ప్రపంచ కార్మికవర్గం అండగా నిలవాలి. వాటి సమర్థనలో వివిధ రకాల సంఘీభావ ఉద్యమాలను సమరశీలంగా నడపాలి. ఇది కార్మికవర్గ కర్తవ్యం. మే డే నాడు ప్రపంచ కార్మికవర్గం తమ తమ దేశాలలోని విప్లవోద్యమాలను సంఘటితం చేసుకుంటూ, పరస్పర సంఘీభావ ఉద్యమాలను పెంపొందించుకోవడానికి ప్రతిన పూనాలి. కార్మికవర్గం యొక్క ప్రతి చర్య రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకునే విప్లవ రాజకీయాల దిశలో సాగాలి. ఈ భూమండలంపై సామ్రాజ్యవాదానికి గోరీ కట్టే దిశలో కార్మికవర్గం తన పోరాటాలను తీవ్రం చేయడానికి మేడేను పోరాట దినంగా పాటించాలి.

ప్రపంచ కార్మిక దినం మే డే వర్ధిల్లాలి.

రివిజనిజం, నయా రివిజనిజం నశించాలి. సామ్రాజ్యవాదం నశించాలి.

సామ్రాజ్యవాద యుద్ధ/అణు యుద్ధ ప్రమాదానికి వ్యతిరేకంగా ప్రపంచ శాంతి కోసం పోరాడుదాం.

ప్రపంచంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధాలకు అండగా, సంఘీభావ ఉద్యమాలను బలంగా పెంపొందించాలి. ✯

**"పెట్టుబడితో తమ అనుదిన ఘర్షణలో, కార్మికులు పిరికివారై, వెనుకంజ వేసినట్టుయితే, అంతకన్నా పెద్ద ఉద్యమాన్ని దేన్నీ ప్రారంభించే అర్హతను తప్పనిసరిగా కోల్పోతారు".**

**(మార్క్స్ 'వేతనం, ధర, లాభం' వ్యాసం – 1865)**

**మార్చ్ 6, అంతర్జాతీయ నిరుద్యోగ దినం**

**కమ్యూనిస్టు నాయకత్వం కింద అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ కేంద్ర సంస్థ, 1930, మార్చ్ 6వ తేదీ ప్రపంచమంతటా "నిరుద్యోగదినం"గా పాటించాలని ప్రకటించింది. 1930 మార్చ్ 6వ తేదీ అమెరికాలో 12 లక్షల 50 వేల మంది కార్మికుల నిరసన ప్రదర్శన జరిగింది. అనేక దేశాల్లో కార్మి సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు నిరుద్యోగుల పోరాటాలు నడిపాయి.**

# కార్మిక వ్యతిరేక పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఫ్రెంచి కార్మికుల వీరోచిత పోరాటం

ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఏకపక్షంగా పెన్షన్ సంస్కరణలను అమలు చేయడాన్ని ఫ్రెంచి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. 4 నెలలుగా ఉద్యోగ, కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా నిరవదికంగా ఆందోళన చేస్తున్నారు. ప్రజా వ్యతిరేక సంస్కరణలను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగ కార్మిక సంఘాలు హెచ్చరించాయి.

2023 జనవరి 31న 12లక్షల మంది ప్రజలు రోడ్ల మీదికి వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. మాక్రాన్ ప్రభుత్వం ఎంతగా నిర్బంధాన్ని ప్రయోగిచినా ప్రజలు భయపడడంలేదు. ప్రజలు పెద్ద ఎత్తున కదిలి పోలీసులతో ఘర్షణలకు తలపడుతున్నారు. కార్మిక సంఘాల నాయకత్వంలో రవాణా, విద్య, ఇంధన రంగాలకు చెందిన కార్మికులు ఫ్రాన్స్ లోని ప్రధాన నగరాలలో భారీ ప్రదర్శనలు జరిపారు.

మేడే నాడు మరింత బలంగా, సంఘటితంగా, సమరశీలంగా నిరసన ప్రదర్శనలు చేసారు. జూన్ 6న దేశ వ్యాపిత ఆందోళనా దినం పాటించాలని 8 కార్మిక సంఘాలు సంయుక్తంగా ప్రకటించాయి.

ప్రపంచీరరణ ఆర్థిక విధానాలు రాక ముందు ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థల యజమానులు సామాజిక సంక్షేమంలో భాగంగా ఉద్యోగులు, కార్మికులకు పెన్షన్ చెల్లించేవారు. ఇప్పుడు ఉద్యోగులు, కార్మికులు తమ జీతాల నుండి తామే తమ పెన్షన్‌లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. నెలనెలా చెల్లించుకునే ఈ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలు నిర్దేశిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్ లు దీనిని అమలు చేయాలని ఆంక్షలు విధిస్తున్నాయి. వాటి ఒత్తిడి కారణంగానే కార్పోరేట్ అనుకూల విధానాలకు దాసోహం అంటూ ఫ్రాన్స్ ప్రభుత్వం ఇటువంటి పెన్షన్ సంస్కరణలకు పూనుకున్నది. రిటైర్‌మెంటు వయస్సును 62 నుండి 64 ఏళ్ళకు పెంచడానికి, పెన్షన్ అర్హతకోసం 43ఏళ్ళు పని చేయాలని ఫ్రాన్స్ ప్రభుత్వం జనవరి 19న పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టింది. ప్రతిపక్షాలు, కార్మిక, ఉద్యోగ సంఘాలతో పాటు, ఉద్యోగావకాశాలు తగ్గిపోవడంతో నిరుద్యోగులు కూడా ఈ నిరసన ప్రదర్శనల్లో లక్షలాదిగా పాల్గొంటున్నారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 49 క్లాజ్ 3ని ఉపయోగించుకుని, పార్లమెంటు ఆమోదం లేకుండానే రాజ్యాంగ మండలి ఆమోదంతో చట్టం చేయడానికి మాక్రాన్ నిర్ణయించుకున్నాడు. ఏప్రిల్ 14న పెన్షన్ సంస్కరణలకు రాజ్యాంగ మండలి ఆమోదం తెలిపింది. మరుసటి రోజు ఏప్రిల్ 15న మాక్రాన్ సంతకం చేపిన నేపథ్యంలో నిరసనలు మరింత ఉధృతం అయ్యాయి.

అధ్యక్షుడు మాక్రాన్ కార్పొరేట్ వ్యాపార వర్గాలకు మేలు చేకూర్చే విధంగా కార్మిక చట్టాలను సవరించాలని చూస్తున్నాడని, ఇప్పటికే కార్పోరేట్ సంస్థల మీద పన్ను తగ్గింపు వంటి నిర్ణయాలు తీసుకున్నాడని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

★

# మజ్దూర్ సంఘటన్ సమితిపై దాడులను ఖండించండి

గత మూడు దశాబ్దాలకు పైగా ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్, గిరిడీహ్, బొకారో బొగ్గు గనుల ప్రాంతంలోని కాంట్రాక్టు లేబర్‌లను సంఘటితం చేస్తూ వారి సమస్యలపై మజ్దూర్ సంఘటన్ సమితి పోరాడుతోంది. అలాంటి కార్మిక సంఘాన్ని 2018లో మావోయిస్టుల అనుబంధంగా సంస్థగా పేర్కొంటూ ఝార్ఖండ్ ప్రభుత్వం నిషేధించింది. ఝార్ఖండ్‌లోని విస్థాపన వ్యతిరేక వుద్యమ నాయకుడు దామోదర్ తురి ఆ సంఘ సభ్యుడనీ, యంఎస్ఎస్ వేదికపై ఉపన్యసించాడనీ 2018లో అరెస్టు చేసి పోలీసులు ఊపా కింద జైల్లో పాలు చేశారు. కానీ, నాలుగేళ్ల న్యాయ పోరాటం ఫలితంగా రాంచీ ఉన్నత న్యాయస్థానం నిషేధాన్ని ఎత్తివేస్తూ పోలీసుల తప్పుడు కేసులను కొట్టివేసింది. యంఎస్ఎస్ గిరిడీహ్ జిల్లాలోని మధుబన్‌లో పేదలు మరియు శ్రావికుల కోసం ఉచిత ఆస్పత్రిని కొనసాగిస్తున్నది. కార్మికుల సమస్యలపై పోరాడుతూ ప్రజానుకూల కార్యక్రమాలను కొనసాగిస్తు దోపిడీ విస్థాపనలపై ఆధారపడిన కార్పొరేట్-ప్రభుత్వాల అభివృద్ధికి భిన్నంగా అభివృద్ధికి ఒక నమూనాగా నిలిచిన యంఎస్ఎస్‌ను అభివృద్ధి నిరోధక కార్మిక సంస్థగా ప్రభుత్వం పేర్కొనడం దాని దోపిడీ వర్గ స్వభావాన్ని తెలుపుతోంది. ప్రజల అధికారం, ప్రజల అభివృద్ధిని కాంక్షించి పని చేస్తున్న కార్మిక సంఘాన్ని దెబ్బ తీయాలనీ పోలీసులు దానిపై పదే పదే దాడులు చేస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల మే 2 నాడు ఝార్ఖండ్‌లోని అనేకచోట్ల బచ్చా సింగ్, నాగేశ్వర్ మహతో, సంజయ్ తురి లాంటి యంఎస్ఎస్ కార్యకర్తలతో పాటు దామోదర్ తురి, స్వతంత్ర పాత్రికేయులు రూపేశ్‌కుమార్‌ల ఇంటిపై డజన్‌ల కొద్ది పోలీసు బలగాలతో ఎన్ఐఏ వారు దాడులు నిర్వహించారు. ఈ దాడులను రాజ్య నిర్బంధ వ్యతిరేక కేంపెయిన్ (సీ.ఏ.ఎస్.ఆర్) తీవ్రంగా ఖండించింది.

★

# ప్రపంచ మాంద్య పరిస్థితులలో కార్మికుల ఉద్యోగాలు ఊడి పోతున్నాయి కార్మిక సమ్మె పోరాటాలతో నగరాలు ఎరుపెక్కుతున్నాయి

"నిరుద్యోగం అనేది పెట్టుబడిదారి విధానం యొక్క ఉప ఉత్పత్తి'' (Unemployment is the by product of Capitalism)అంటారు. నిరుద్యోగం అనేది మన దేశం, ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు. నిరుద్యోగం అంటే పని చేయగల సామర్థ్యం వున్న వ్యక్తి పని కోసం వెతుకుతూ, ఏ పనిని పొందలేకపోవడం. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రకారం, నిరుద్యోగం అనేది నిర్దిష్ట వయసు కన్నా ఎక్కువ వయసున్న వ్యక్తులు (సాధారణంగా 15) వేతనంతో కూడిన ఉపాధి లేదా స్వయం ఉపాధి ఉండకపోవడంగా నిర్వచించారు. నిరుద్యోగం అనేది నిరుద్యోగ రేటు ద్వార కొలుస్తారు. నిరంతరం అధిక నిరుద్యోగిత రేటు అనేది ఒక దేశంలో ఆర్థిక కష్టాలకు ముఖ్యమైన సూచిక మరియు ప్రపంచ దేశాలలో అంతర్గత నిర్మాణం యొక్క క్షీణతకు దారితీసే సామాజిక, రాజకీయ పరిణామాలను కలిగి వుండవచ్చు. మరోవైపు, తక్కువ నిరుద్యోగిత రేటు ఆర్థిక వ్యవస్థలో అందుబాటులో వున్న కార్మికుల గరిష్ట వినియోగం, అధిక వేతన పెరుగుదల, జీవన ప్రమాణాల మొత్తం పెరుగుదలను సూచిస్తుంది. నిరుద్యోగిత రేటు దేశంలోని ద్రవ్యోల్బణం, వస్తువులు సేవల ఉత్పత్తికి, అదనపు శ్రామిక శక్తి అవసరమయ్యే యజమానులకు అనుకూల పరిస్థితులకు కారణమవుతోంది.

నిరుద్యోగానికి కారణం వ్యవస్థ అంతర్గత లక్షణంగానే వుంటుందనేది ముందు మనం గుర్తించాలి. ఏ దోపిడీ వ్యవస్థ అయినా సమాజంలో పనిచేయగల సామర్థ్యం వున్న ప్రతి ఒక్కరికి పనిని కల్పించదనేది, అది దోపిడీ వ్యవస్థ (పెట్టుబడిదారీ విధానం) లక్షణమనీ పైన రాసిన నానుడి తేటతెల్లం చేస్తున్నది. బాహ్య కారణాలకు వస్తే, నూతన సాంకేతికతల ఆవిష్కరణలు, ఆర్థిక వ్యవస్థ స్థితి, ప్రపంచీకరణ, అంతర్జాతీయ వాణిజ్యం వల్ల ఏర్పడే పోటీ, ప్రభుత్వ విధానాలు, నియంత్రణ మార్కెట్, ఆర్థిక మాంద్యం, జాబ్ అవుట్‌సోర్సింగ్, స్వచ్ఛందంగా ఒక ఉద్యోగాన్ని వదలి వేరొక ఉద్యోగ అన్వేషణలో వుండడం అంటూ బూర్జువా ఆర్థికవేత్తలు చెపుతుంటారు. కానీ నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో వుండే అరాచక ఉత్పత్తి మూలంగా మార్కెట్లో సరుకులు కుప్పలు కుప్పలుగా వున్నప్పటికి వాటిని కొనుగోలు చేసే కార్మికుల ఉద్యోగాలు వూడి పోవడంతో నిరుద్యోగం గతం కన్నా అధికంగా విలయతాండవం చేస్తుంది. మరోమాటలో చెప్పాలంటే, పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి శక్తులు అతి త్వరితగతిని పెరగటం వ్యక్తిగత పంపకం విధానం – రెండింటి మధ్య తీవ్రమయిన ఘర్షణ ఏర్పడిందనీ – ఈ ఘర్షణే ఆర్థిక సంక్షోభానికి మూలకారణమని అర్థం చేసుకోవాలి.

మన దేశంలో నిరుద్యోగం పోకడలు: 2023 ఫిబ్రవరి 26 నాటికి పట్టణ నిరుద్యోగిత 8.0 శాతం, గ్రామీణ నిరుద్యోగిత రేటు 7.3 శాతం. 2022 మే నుండి జాతీయ గణాంక సంస్థ నివేదిక ప్రకారం పట్టణ భారతదేశంలో నిరుద్యోగం రేటు అక్టోబర్–డిసెంబర్ 2021లో 10.3 శాతం నుండి 8.7 శాతానికి తగ్గింది. కొరోనా మహమ్మారీ నియామకాల దశ ముగిసినప్పటి నుండి 'టెక్కీ'ల (సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు) ఉద్యోగులు ఊడుతున్నాయి. 2022లో అల్ఫాబెట్ 12 వేల మంది ఉద్యోగులను, అమెజాన్ 18 వేల ఉద్యోగులను, మెటా 11 వేల ఉద్యోగులను, రానున్న కొద్ది రోజులలో మరో 10 వేల ఉద్యోగాలను, ట్విట్టర్ 4 వేల ఉద్యోగులను, మైక్రోసాఫ్ట్ 10 వేల ఉద్యోగులను, సేల్స్ ఫోర్స్ 10 వేల ఉద్యోగులను, గూగుల్, వందలాది ఉద్యోగులను, రానున్న అతి కొద్ది సంవత్సరాలలో ఐబీఎం కృత్రిమ మేధతో (ఏఐ) 26,000 ఉద్యోగాలను రీప్లేస్ చేస్తామంది. ఈ మార్పులే సంభవిస్తే పరిస్థితి ఎంత వికటిస్తుందో చెప్పలేం! ఇలా ప్రధాన టెక్ కంపెనీలు సహ దాదాపు వెయ్యి సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పెద్ద సంఖ్యలో అంటే 2 లక్షల 30 వేల ఉద్యోగులను తొలగించాయి. అందుకే ఆ సంవత్సరాన్ని 'పీడకలల సంవత్సరం' (నైట్‌మేరిష్ ఇయర్) అన్నారు.

2023 ఏప్రిల్‌లో దేశ వ్యాప్త నిరుద్యోగం 7.83 శాతం కాగా హర్యాణాలో మాత్రం అత్యధికంగా 34.5 నమోదైంది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ అందించిన వివరాల ప్రకారం పట్టణాలలో 9.22 శాతానికి చేరింది. గత రెండేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోవడం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మూలంగా మన దేశంలోని అనేక పరిశ్రమలలోని ఉత్పత్తులు మందగించడం ముఖ్యంగా హరియాణలోని పరిశ్రమలపై, వ్యాపారంపై విపరీతంగా ప్రభావం పడడం, విద్యుత్ సరఫరాలో ఎదుర్కొంటున్న కారణాలతో పరిశ్రమల ఉత్పత్తులు పడిపోవడంలాంటి అనేక కారణాలతో ఉద్యోగాలు కోల్పోతున్నారు.

దేశంలో "రోజ్‌గార్ మేళాలు" పురుడు పోసుకుంటున్నాయి. 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్రం ఆశ చూపింది. రాష్ట్రాలు కూడ రాజకీయ లబ్ధి కోసం కొత్త ఉద్యోగాలను సృష్టిస్తున్నట్టు ఊదరగొడుతున్నాయి. కేంద్రం గత అక్టోబర్‌లో ప్రకటించిన 75వేల కొత్త ఉద్యోగాల నియామకాలను 45 రోజ్‌గార్ మేళాలను జరిపి ప్రధాని చేతుల మీదుగా వాటిని అందించారు. 10 లక్షలలో 75 వేల ఉద్యోగాలంటే అది ఎలాంటి రాజకీయమో తెలుసుకోవచ్చు. మోదీ అధికారంలోకి రావడానికి ముందు యేటా 2 కోట్ల వుద్యోగాలు కల్పిస్తామని మురిపించాడు. కానీ, సామ్రాజ్యవాద ఆర్థిక

విధానాలు అందుకు అనుమతించవనేది ఆయనకు తెలియనిది కాదు. అయినప్పటికీ ఓట్ల లబ్ధి కోసం మోసం చేశాడు. ప్రకటిస్తున్న ఉద్యోగాలలో కాంట్రాక్టు లేబర్ లాంటి అగ్నివీర్ లు సహా పోలీసు, సైనిక ఉద్యోగాలకు పెద్ద పీట వేస్తు, మన్రేగా పనులను కూడ లెక్కకడుతున్నారు. వాస్తవానికి లక్షల సంఖ్యలో ఊడిపోతున్న ఉద్యోగాలను, పడిపోతున్న నిజవేతనాలను నిజాయితీగా ప్రకటించడమే లేదు. ఫలితంగా దేశ వ్యాప్తంగా కార్మికులు సహా బతుకు దుర్భరం అవుతున్న అన్ని రంగాలలోని ఉద్యోగులు సమ్మె ఆయుధాలతో వీధుల్లోకి వస్తున్నారు. దేశ జీడీపీ వృద్ధిరేటులో పెరుగుదల నమోదవుతుందనీ అనేక సంవత్సరాలుగా గణాంకాల ద్వార వెల్లడి చేస్తున్నారు. కానీ ఈ వృద్ధిని ఉపాధి రహిత వృద్ధి (జాబ్‌లెస్ గ్రోత్)గా ఆర్థికశాస్త్రవేత్తలు నిర్ధారించారు.

భారతీయ ఐటీ కంపెనీలు రాబోయె రెండు త్రైమాసికాలలో (2023 ఏప్రిల్-సెప్టెంబర్) 80 వేల నుండి లక్షా 20 వేల మంది ఉద్యోగాలకు ఉద్వాసన చెప్పే అవకాశం వుందనీ వార్తలు వెలువడుతున్నాయి. సేవా తయారీ రంగాల సంయుక్త వృద్ధిని సూచించే ఎస్ అండ్ పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీ.ఎం.ఐ. ఔట్‌పుట్ సూచీ 2023 జనవరిలో 57.5గా నమోదైంది. 2022 డిసెంబర్‌లో ఈ సూచి 11 ఏళ్ల గరిష్టానికి పెరిగి 59.4గా నమోదైంది. అంటే సేవా రంగంలో ఉద్యోగ కల్పన జనవరిలో నెమ్మదించింది. నిలకడగా లేని ఆర్థిక వ్యవస్థ వల్ల, ఉద్యోగ భద్రత లేని కారణంగా, భారతదేశపు నగరాల్లో వారానికి 50 మంది చొప్పున ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ 2021 నాటి ప్రభుత్వ లెక్కలే చెపుతున్నాయి. రైతాంగ ఆత్మహత్యలు దశాబ్దాలుగా కొనసాగుతునే వున్నాయి. కార్ల్ మార్క్స్ **'ఆత్మహత్యలు రోగగ్రస్థ సమాజ లక్షణం'** అంటాడు.

మన దేశంలో ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటిస్తున్నది. కానీ, ఏ పథకం నిరుద్యోగాన్ని రూపుమాపడం లేదు. సరికదా, పై గణాంకాల ద్వార నిరుద్యోగం పెరిగిపోతూ ప్రభుత్వ పథకాల వైఫల్యాన్ని తెలుపుతోంది. ప్రభుత్వం **ప్రధానమంత్రి ముద్రా యోజన**ను ప్రకటించి మహా ఆర్భాటంగా స్టార్టప్‌లను ప్రారంభించింది. పూచీకత్తు రహిత ఋణాలు రూ.10 లక్షల వరకు సూక్ష్మ, చిన్న వ్యాపార సంస్థలకు అందుతాయనీ చెప్పారు. కానీ 2022 మార్చ్ 11 వరకు దేశంలో కేవలం రూ. 34.08 కోట్లే వీటికి కేటాయించారంటే మాన్యూఫ్యాక్చరింగ్ హబ్‌గా దేశాన్ని మలిచే వారి చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు! ఫలితంగా, లక్షల సంఖ్యలోని స్టార్టప్ యూనిట్లు పెట్టుబడుల లేమితో మూలపడుతున్నాయి. మోదీ అధికారానికి వచ్చిందే తడవుగా అనేక పాత పథకాలకు తన దైన శైలిలో కొత్త రూపం ఇస్తూ వస్తున్నాడు. అందులో భాగంగా **'కౌశల్ యోజన'** ఒకటి. ఇది ఎగుమతుల నాణ్యతను పెంచే దృష్టితో ప్రారంభించడంతో, నైపుణ్యం లేదంటూ వేలాది మంది కార్మికుల ఉద్యోగాలు ఊడగొడు తున్నారు. మన దేశంలో సేవల రంగం విస్తరించిన కొద్ది నిర్మాణం, రవాణా, టూరిజం, రిటైల్ రంగాలలో సెమీ స్కిల్డ్ ఉద్యోగాలు మాత్రమే వస్తాయనీ కానీ దేశంలో తయారీ రంగంలో ఉద్యోగాలు స్తంబ్దంగా ఉన్నాయనీ పూర్వ ఆర్‌బీఐ గవర్నర్ రఘురాంరాజన్ చెబుతున్నాడు. ఉద్యోగాల సృష్టి జరుగాలంటే, సేవలు తయారీ రెండింటినీ అభివృద్ధి చేయాలనీ సూచించాడు. కానీ దేశంలో ఏనాటికానాడు తయారీ రంగం కునారిల్లుతోంది.

వ్యాపారానికి ఉద్దీపన అందించడానికి, కోవిడ్-19 ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి అంటూ భారత ప్రభుత్వం **"ఆత్మనిర్భర్" భారత** ప్యాకేజీని ప్రకటించింది. ఈ ప్యాకేజీ కింద ప్రభుత్వం రూ. 27 లక్షల కోట్ల ఉద్దీపనలను అందిస్తోంది. దేశాన్ని స్వావలంబన దిశగా మార్చడానికి అంటూ ఉపాధి అవకాశాలను సృష్టించడానికి వివిధ పథకాలను ఉనికిలోకి తెచ్చింది. వాటిలో భాగంగా 1 అక్టోబర్ 2020 నుండి ఆత్మనిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభించబడింది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) ద్వార అమలు చేయబడిన ఈ పథకం యాజమానుల ఆర్థిక భారాన్ని తగ్గించడానికి, మరింత మంది కార్మికులను నియమించుకునేలా వారిని ప్రోత్సహిస్తుందని ఊదరగొట్టింది. కానీ, మరోవైపు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన ఈపీఎఫ్ఓ దుష్ప్రభావం ఉద్యోగుల, ఉద్యోగ విరమణ చేసిన పెన్షన్లపై ఎలా పడుతుందో 2022 నవంబర్ 4న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ద్వార అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భద్రత సమకూర్చడం ప్రభుత్వ బాధ్యత. ఉద్యోగుల వేతనాల నుంచి మినహాయించి 'ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్ఓ)కు జమ చేసిన సొమ్మును ప్రభుత్వం మదుపుదారులకు అందచేస్తూ అతి తక్కువ వడ్డీ శాతం 8.1 మాత్రమే చెల్లిస్తోంది. 1977 తరువాత ఇంత తక్కువ వడ్డీ రేటు వుండడం ఇదే మొదటిసారి. వర్తమాన మాంద్య పరిస్థితులలో 27 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగులు తమ విశ్రాంత జీవితంలో నిశ్చింతగా ఉండలేని విధంగా మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది.

ప్రభుత్వాలు నూతన ఉద్యోగాల కల్పన ఆశలు చూపుతూ ఉన్న ఉద్యోగాలను వూడగొడుతోంది. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలలో 30 లక్షల ఉద్యోగ ఖాళీలున్నాయి. వాటిని నింపడం లేదు. మరోవైపు పెద్దెతున కార్మికులు మాంద్య పరిస్థితులలో ఉద్యోగాలు కోల్పోతున్నారు. **'గిగ్'** కార్మికులంటూ తాత్కాలిక కార్మిక సైన్యాన్ని సృష్టిస్తున్నారు. దేశంలో వీరి సంఖ్య 2 శాతానికి పెరిగింది. పెట్టుబడికి పుట్టినిల్లయిన ఇంగ్లండ్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలతో సహా ప్రపంచమంతటా మాంద్యం మేఘాలు ఆవరించాయి. మరోవైపు కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలు, పారిశ్రామిక యాజమాన్యాలు వారి మీద విపరీతమైన పని భారాన్ని పెంచుతూ వారి వేతనాలను తగినట్టుగా పెంచడం లేదు. కార్మిక సంస్కరణలంటూ యాజమాన్య ప్రయోజనాలను నెరవేర్చే కార్మిక వ్యతిరేక నిర్ణయాలు చేస్తున్నారు. వీటన్నింటికి వ్యతిరేకంగా మన దేశం సహ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ పోరాటాలు వెల్లువెత్తుతున్నాయి. ★

# ప్రపంచ, దేశ వ్యాపితంగా వెల్లువెత్తుతున్న కార్మిక ఉద్యోగ పోరాటాలకు జేజేలు

**నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో అధికార మార్పిడి తర్వాతి కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నవీకరణ పేరుతో ముందుకు తెచ్చిన 4 కోడ్‌లను (1. వేతనాల కోడ్ 2019, 2. పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, 3. వృత్తిపర భద్రత , ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్ 2020 4. సామాజిక భద్రత కోడ్ 2020) ఉప సంహరించుకునేలా చేసిన కార్మికవర్గ పోరాట విజయానికి ముందుగా జేజేలు చెప్పుదాం.**

కార్మికుల, ఉద్యోగుల పోరాటాల గురించి తెలుసుకునే ముందు 1845లో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఏంగెల్స్ సమ్మెల గురించి చెప్పిన విషయాన్ని చూద్దాం. **'కార్మికులు, జంతువులుగా గాక మనుషులుగా జీవించాలనే' ఆశను పూర్తిగా కోల్పోనంతవరకూ, యజమానుల విధానాలకు వ్యతిరేకంగా తిరుగబడుతునే వుండాలి. ఈ కార్మిక సంఘాలు చేసే సమ్మెల నిజమైన ప్రాధాన్యత ఏమంటే, కార్మికులు తమలో పోటీని రద్దు చేయడానికి చేసే తొట్టతొలి ప్రయత్నాలే సమ్మెలు. కార్మికులకు వారిలో వారికి గల పోటీయే, అంటే వారిలో కలసి కట్టుతనం లోపించడమే, కార్మికులందరూ ఒకే లక్ష్యంతో వుండకపోవడమే, పెట్టుబడిదారుల ఆధిక్యానికి ఆధారమనే నిజాన్ని గుర్తించడం సమ్మెల్లో ఇమిడి వుంది'.**

(ఇంగ్లండ్‌లో కార్మికవర్గ స్తితిగతులు- 1845)

2008 సంక్షోభం నుండి అమెరికా ఎన్ని కసరత్తులు చేసినా బయటపడడమే లేదు సరికదా, దాని ఆర్థిక వ్యవస్థ మరింత బలహీనపడుతూ సైన్యకరణ చెందుతోంది. అమెరికాలో ఆరోగ్య కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు చేశారు. 65 వేల మంది ఉపాధ్యాయులు, బస్ డ్రైవర్లు, చౌకీదార్లు, వెయ్యి స్కూళ్ల విద్యార్థుల సహాయక సిబ్బంది తమ వేతనాలలో 30 శాతం పెంచాలనీ డిమాండ్ చేస్తు అతి తక్కువ వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు ప్రతి గంటకు రెండు డాలర్లు అదనంగా చెల్లించాలనీ కోరారు. వారు తమ ప్రదర్శనలను ఉద్యోగ భద్రత, జీతాల పెంపుదల, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బైడెన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించారు. 15 వేల మంది నర్సులు చేసిన సమ్మె అమెరికా చరిత్రలోనే ప్రైవేట్ రంగ నర్సుల సిబ్బంది అతి పెద్ద సమ్మె. ఈ రకంగా అమెరికాలో 2022లో సమ్మెలు వెల్లువెత్తాయి.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత రెండవసారి ఎన్నడూ లేని స్థాయిలో ఈ సంవత్సరం రక్షణ బడ్జెట్ 858 బిలియన్ డాలర్లతో రూపొందింది. దీని దుష్ప్రభావం అక్కడి కార్మికులపై, ప్రజలపై విపరీతంగా పడుతోంది. అది ప్రపంచ వ్యాపితంగా దాదాపు 80 దేశాలలో కొనసాగిస్తున్న 700కు పైగా సైనిక శిబిరాలు, దేశంలో పోషిస్తున్న లక్షల సైన్యం, దాని యుద్ధాల ఖర్చులు మితిమీరి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. సైనికుల కుటుంబాలను అస్తవ్యస్తం చేస్తున్నాయనీ వార్తలు వెలువడుతున్నాయి.

యుద్ధోన్మాదంతో అమెరికా చేపడుతున్న చర్యల ఫలితంగా మానవ హక్కులు, పౌర హక్కులు మృగ్యమవుతున్నాయి. మెరుగైన వైద్య సౌకర్యాలు అందకుండా పోతున్నాయి. సైనిక కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్న వార్తలు అక్కడి ప్రజలలో ఆందోళనను కలిగిస్తున్నాయి. వాటి తీవ్రతను అర్థం చేసుకోవడానికి 2021 జనవరి 6 నాడు అక్కడి క్యాపిటల్ దాడిని ఉదాహరణగా చెప్పుకుంటున్నారు. సైన్యంలో ఆత్మహత్యలు పెరిగిపోయాయి. మానసిక వత్తిళ్లతో విపరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం, చైనాతో ఉద్రిక్తతలు అక్కడి ప్రజల, కార్మికుల జీవితాలలో అభద్రతను, అధిక ధరలను, నిరుద్యోగాన్ని, ఇతర అన్ని రకాల సామాజిక రుగ్మతలను పెంచడానికి వ్యతిరేకంగా అక్కడి కార్మికులు వీధుల్లోకి వస్తున్నారు.

బ్రిటన్‌లో ద్రవ్యోల్బణం కారణంగా, రైల్వే సిబ్బంది, వైద్యులు, ఉపాధ్యాయులు, ఇతర రంగాల ఉద్యోగులు సమ్మెలతో హోరెత్తిస్తున్నారు. గత మేలో మొదట నార్త్ సీ ఆయిల్ రిగ్ తరువాత స్కాట్లాండ్, ఇంగ్లండ్‌లలోని పెట్రోకెమికల్ వర్కర్లు, ఆ వరుసనే మాంచెస్టర్ ఫుడ్ ప్రాసెసింగ్ వర్కర్స్, అమెజాన్ వర్కర్స్ ప్రారంభించిన సమ్మెలు ఇప్పటివరకు కొనసాగుతున్నవి. రోబోల కంటే హీనంగా వేతనజీవులను అమెజాన్ పరిగణిస్తోందనీ అమెజాన్ కార్మికులు సెంట్రల్ ఇంగ్లండ్‌లోని కంపెనీ గిడ్డంగి వద్ద సమ్మె చేపట్టారు. వారి సమ్మెలకు లక్షలాది మంది ప్రజానీకం వీధుల్లోకి వచ్చి సంఘీభావం తెలియచేస్తూ ప్రజా ఐక్యత చాటుతుండడం హర్షణీయం. మరోవైపు, బ్రిటన్ ప్రభుత్వం కార్మికుల సమ్మోలను అణచివేయడానికి ఫాసిస్టు చట్టాలను ఆశ్రయిస్తోంది. 2022లో అది ముందుకు తెచ్చిన 4 చట్టాలే అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. గడచిన నాలుగు దశాబ్దాలలో ఎన్నడూ లేని స్థాయికి అక్కడి ద్రవ్యోల్బణం 10.1 శాతానికి చేరుకుంది. దీనితో కనీస వేతనాలతో రోజులు గడిపే వారి జీవితాలు అస్తవ్యస్తమవుతున్నాయి. దానితో వీధుల్లోకి రాక తప్పడం లేదు. అక్కడ ముందుకు తెచ్చిన చట్టాలతో కార్మికుల సాంఘిక భద్రత కూడ ప్రమాదంలో పడింది. 4 లక్షల పేద కార్మిక కుటుంబాలు, 14 లక్షల పిల్లలు ప్రభావితమవుతున్నారు. అక్కడి పరిస్థితి ఎంత దారుణంగా తయారైందంటే, ప్రతి 25 మంది పెద్దలలో కనీసం ఒక్కరు ఉపవాసంతో గడుపుతున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. అక్కడి మహిళలు అన్ని విషయాలలో తీవ్రంగా దుష్ప్రభావితులవుతున్నారు. వివక్ష, లైంగిక వేదింపులు పెరుగుతున్నాయి.

ఫ్రాన్స్‌లో పెన్షన్ వయస్సును 64 ఏళ్లకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ 11 లక్షల మంది కార్మికులు వరుసగా నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. ఆస్ట్రేలియాలో రవాణా కార్మికుల సమ్మె మాంద్యంలో నుండి పుట్టుకొచ్చిందే. గతంలో ఇక్కడ 2016లో కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా సమరశీల కార్మికుల సమ్మె జరిగినపుడు డిఫెన్స్ కలెక్టివ్ అనే సంఘీభావ సంస్థ ఏర్పడింది.

దానిని ఫ్రాన్స్ ప్రభుత్వం నిషేధించింది. ఆ నిషేధానికి వ్యతిరేకంగా కార్మికులు ప్రదర్శనలు జరుపుతుండగా అక్కడి ఇంటీరియర్ మినిష్టర్ గెరాల్డ్ దార్మానిన్ ఏప్రిల్ 5నాడు ఆ సంస్థనే మూసేస్తం అనే బెదిరింపు వదిలాడు.

గ్రీస్‌లో సంక్షోభంతో, ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలతో అట్టుడికిపోతున్న కార్మికులలో, ప్రజలలో ఏప్రిల్‌లో జరిగిన ఒక రైలు దుర్ఘటనలో 57మంది ప్రజలు ప్రాణాలు కోల్పోవడంతో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రభుత్వ రైల్వేలను ప్రైవేట్‌పరం చేసిన ఫలితమే ఈ మరణాలంటూ వారు ప్రభుత్వ విధానాలకు నిరసనగా వీధుల్లోకి రావడంతో, రవాణా, విమానాలు స్తంభించిపోయాయి. పాఠశాలలు మూసేశారు.

ఐర్లాండ్‌లో ఈస్టర్ రోజు 1916 సోమవారం ఐరిష్ రిపబ్లిక్ ఆవిర్భవించి బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని ప్రారంభించింది. దానిని గుర్తు చేసుకుంటూ గుడ్ ఫ్రై డే ఒప్పందాన్ని బ్రిటిష్ ప్రభుత్వం బుట్టదాఖలా చేయడానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 10 నాడు వందలాది ఐర్లాండ్ కార్మికులు, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు సమరశీల చర్యలు నిర్వహించాయి. ఆరోజుతో బ్రిటన్‌లో నూతన ప్రధానిగా రిషి శునక్ పదవీ బాధ్యతలు చేపట్టి యేదాది నిండడంతో, జోబైడెన్ రావడాన్ని అవకాశంగా తీసుకొని నిరసనగా ప్రదర్శనలు జరిపారు. ఐర్లాండ్ లోని డెర్రిలో పోలీసు వాహనంపై పెట్రోల్ బాంబులు విసిరారు. డబ్లిన్‌లోని రాయబార కార్యాలయానికి గుడ్ ఫ్రైడే ఒప్పంద ఉల్లంఘనకు నిరసనగా పెయింట్ పూశారు.

బెల్జియంలో ఏప్రిల్ 17నాడు ఎఫ్.పీ.ఎస్ ఎంప్లాయిమెంట్ ముందు కార్మికుల సంయుక్త సంఘటన పిలుపుతో డెల్‌హైజ్ సమ్మె కార్మికుల సమరశీల ప్రదర్శన చోటుచేసుకుంది. వారు ప్రభుత్వంతో తమ లేబర్ సమస్యలపై చర్చలకు వెళ్లారు. పోలీసులు అడ్డగించడంతో వారు పోలీసుల దిగ్బంధనాన్ని ఛేదించుకోవడానికి పూనుకోగా టియర్ గ్యాస్ ప్రయోగానికి గురయ్యారు. నలుగురు సమ్మెకారులను పోలీసులు అరెస్టు చేశారు. తిరిగి వారు మరుసటి రోజు కోర్టుహౌజ్ ముందు ప్రదర్శన జరిపారు.

ఇజ్రాయిల్‌లో రాజధాని టెలీ అవీవ్‌లో బెంజమిన్ నెతన్యాహూ పాలనకు వ్యతిరేకంగా ఆయన నివాసం ముందు వేలాది మంది ప్రజలు మార్చ్ నుండి ప్రదర్శనలు జరుపుతున్నారు. నరహంతక నెతన్యాహూ ప్రవేశపెట్టిన న్యాయ సంస్కరణలతో న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి దెబ్బతిని బ్యూరోక్రసీ జోక్యం పెరుగుతుందనీ ప్రదర్శకులు వ్యతిరేకిస్తున్నారు. ప్రజా ప్రదర్శనల ఫలితంగా ఆ సంస్కరణల తో ప్రమేయం వున్న ప్రభుత్వోద్యోగులు రాజీనామాలు చేశారు. రక్షణ కార్యదర్శిని పదవి నుండి తొలగించారు. తుదకు నెతన్యాహూ ఆ సంస్కరణలను ఉపసంహరించుకున్నాడు.

గత 15 మాసాలుగా యుద్ధ జ్వాలలలో జ్వలిస్తున్న ఉక్రెయిన్ కార్మిక వర్గ స్థితి దయనీయంగా వుంది. అక్కడ కొనసాగుతున్న సామ్రాజ్యవాద యుద్ధం మూలంగా 50 లక్షల మంది కార్మికులు తమ ఉద్యోగాలు కోల్పోయారు. అక్కడి జీడీపీ మూడవ వంతుకు పడిపోయింది. దాదాపు కోటి మంది కార్మికులు, ప్రజలు కాందిశీకులుగా ఇతర దేశాలకు తరలివెళ్లారు. దాదాపు 50 లక్షల మంది స్వదేశంలోనే పొరుగు ప్రాంతాలకు తరలివెళ్లారు. కాందిశీకులుగా తరలివెళ్లిన కార్మికుల దుస్థితి మరింత దుర్భరంగా వుంది. వారు రోజు గడవడానికి మూడు పనులు చేయాల్సి వస్తున్నది. ఇలాంటి దుర్భర పరిస్థితులలో అక్కడి కార్మిక సంఘాలు ప్రపంచ కార్మిక సంఘాల అండదండలతో యుద్ధ పీడిత కార్మికులను, ప్రజలను ఆదుకుంటున్నాయి. వారికి వైద్య సేవలు అందించడం, ఇండ్ల మరమ్మత్తులు చేయించడం, ఆహారాన్ని సమకూర్చడం మున్నగు మానవతా చర్యలకు నడుం బిగించాయి. అయితే, అక్కడి కార్మికవర్గం అక్కడి నియో నాజీ పాలకవర్గం అమెరికన్ సామ్రాజ్యవాదం, దాని తోడు దొంగ నాటోల ప్రోత్సాహంతో కొనసాగిస్తున్న యుద్ధాన్ని అంతం చేసే దిశలో పోరాడకుండా యుద్ధానికి చరమగీతం పాడలేరన్న వాస్తవ దృష్టి కోణంతో పని చేయాల్సిన తరుణమిది.

కెన్యాలో గతేడు డెల్ మోంటే మల్టీనేషనల్ ఫ్రూట్ ప్రాసెసింగ్‌లో పని చేసే వేలాది మంది కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై సమ్మె చేశారు. అమానవీయ పని పరిస్థితులను మార్చాలనీ, చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్మిక నాయకులను తొలగించడం, జీతాల పెంపుదల కోసం సమ్మె చేశారు. యాజమాన్యం కార్మికులతో కుదుర్చుకున్న కలెక్టివ్ బార్గెనింగ్ ఒప్పందాన్ని ఉల్లంఘించడాన్ని తప్పు పట్టారు. 20 సంవత్సరాలుగా పని చేస్తున్నప్పటికి క్యాజువల్ లేబర్‌గానే వుండాల్సి వస్తున్నది కానీ పర్మినెంట్ చేయడం లేదనీ తమ సమస్యలను ముందుకు తెచ్చారు. ఫిలిప్పీన్స్‌లో ప్రతి ఉద్యోగికి నెలకు 33 వేల పెసోలు ఇవ్వాలనీ డిమాండ్ చేస్తూ కార్మికులు వివిధ పట్టణాలలో ప్రదర్శనలు చేశారు.

మన దేశంలో మొదట పుదుచ్చేరిలో 1936లో ఆ తరువాత దేశమంతా 1947లో 8 గంటల పని దినం చట్టబద్దంగా అమలులోకి వచ్చింది. కానీ, సరిగ్గా వందేళ్ల క్రితమే అంటే 1923లోనే లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలోనే కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలలో ఒకరైన కార్మిక నాయకులు ఎం.సింగారువేలు చెట్టియార్ మద్రాస్ నగరంలోని ట్రిప్లికేన్ బీచ్‌లో మేడే రోజు ఎర్ర జెండా ఎగురవేశాడు. ఇక ఆ తరువాతి నుండి మన దేశంలో అంతర్జాతీయ శ్రామిక దినం యేటా జరుపుకోవడం ఒక కార్మికవర్గ పోరాట సంప్రదాయంగా కొనసాగుతోంది.

2023లో అంతర్జాతీయ శ్రామిక దినం నాడు హిందుత్వ శక్తుల సర్కార్ ఢిల్లీ సమీపంలోని తుగ్లకాబాద్‌లో అసంఘటితరంగ కార్మికులకు చెందిన వేలాది పూరిళ్లను బుల్‌డోజర్లతో నేలమట్టం చేసింది. వారు అనేక సంవత్సరాలుగా దాదాపు కొందరు మూడు దశాబ్దాలుగా అక్కడ భూములు కొనుక్కొని ఇండ్లు కట్టుకొని జీవిస్తున్నారు. వారికి ప్రభుత్వం కరెంటు, నీళ్ల పంపులు సమకూర్చింది. వారి నుండి బిల్లులు సేకరించుకుంటున్నది. కానీ,

ఇపుడు ఆ భూమి భారత పురాతత్వశాఖకు చెందినదనీ, దానిని ఖాళీ చేయాలనీ బలవంతంగా వారిళ్లను మేడే రోజు కూల్చి వేలాది కార్మికులను నిరాశ్రయులు చేయడాన్ని **క్రాంతి పత్రిక** తీవ్రంగా ఖండిస్తున్నది.

మన దేశంలో కార్మికుల సమస్యలలో భాగంగా నికృష్ట కుల వ్యవస్థలో వాళ్లు ఎదుర్కొంటున్న కుల సమస్యలు, దుస్థితి, సమ్మెల గురించి చెప్పుకోవాలంటే ముందు మురుగుదొడ్లను శుభ్రపరిచే పాకీ కార్మికుల (మానవ విసర్జితాలను సాటి మనుషులే ఎత్తిపోయడం) సమస్యలే చెప్పుకోవాలి. మన దేశంలో చట్టబద్ధంగా ఈ అమానుషమైన 'మానవ శ్రమ' 2013లో నిషేధితం. కానీ, అది దేశంలో ఎక్కడా అమలు కావడం లేదు.

'స్వచ్ఛ్ భారత్' గురించి రంకెలు వేసే మోదీ గుజరాత్‌లో గత రెండేళ్లలో 11 మంది పాకీ కార్మికులు మరణించినట్లు ప్రభుత్వం లెక్కలు చూపుతోంది. కానీ, ఇవన్నీ కాకి లెక్కలు అని వారి సంఘాలు చెపుతున్నాయి. 150 మందికి తక్కువ మరణించలేదనీ అవి వివరిస్తున్నాయి. మురుగు కాల్వలు శుభ్రం చేస్తూ దేశంలో నిరుపేద పాకీ కార్మికులు దాదాపు 2018లో 68 మంది, 2019లో 119 మంది 2017 నుంచి 2022 మధ్య 330 మంది ప్రాణాలు కోల్పోయారనీ రాజ్యసభలో వెల్లడించారు. కానీ, ఈ లెక్కలు సరైనవి కావనీ వారి సంఘాలు తప్పు పడుతున్నాయి. వీరంతా దళిత, ఆదివాసీ సమూహాలకే చెందినవారు. కాగా, మైనర్టీ ముస్లిం సోదరులు కూడ వున్నారు. వారికి 44 రకాల రక్షణ పరికరాలు లేకుండా మ్యాన్‌హోల్స్‌లోకి దిగకూడదు. కానీ, వాటిని ఎక్కడా సమకూర్చడమే లేదు. వారికి కనీసం రూ. 10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలనీ డిమాండ్ చేస్తే ప్రమాదవశాత్తు మరణించినవారికి అలాంటిది వర్తించదనీ గుజరాత్ ప్రభుత్వం దాటవేస్తున్నది. అలాంటి ఘటనలపై ప్రభుత్వం దర్యాప్తు జరిపి సంబంధిత అధికారులను శిక్షిస్తుందనీ గుజరాత్‌లో ఒక సర్క్యులర్ జారీ చేశారు. కానీ, ఇప్పటివరకు ఏ ఒక్క అధికారినీ శిక్షించలేదు. సరికదా, ఆ సర్క్యులర్ విడుదలైన తరువాత 95మంది మరణించారు. తెలంగాణలో వీరి సంఖ్య 45 వేలకు పైగా వుండగా ప్రభుత్వం మాత్రం అంకెల గారడీతో 35 వేలకే వారి సంఖ్యను కుదించి చెపుతోంది.

సంగ్రూర్ జిల్లాలోని మంగువాల్ ప్రాంత దళిత రైతాంగం పంచాయతీ భూమి కోసం గత 60 యేళ్లుగా పోరాడుతున్నారు. వారు ఇటీవల మార్చ్ మొదటి వారంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పంజాబ్‌లోని నవర్‌షరా పట్టణంలో ఇఫ్టూ నాయకత్వంలో వందలాది కార్మికులు నరేంద్రమోదీ భాజపా ప్రభుత్వం కొనసాగిస్తున్న ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రదర్శన జరిపారు. వారు కార్మిక నవీకరణ కోడ్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు.

తమిళనాడులో పని గంటలను పెంచుతూ విధానసభ (అసెంబ్లీ)లో **"1948 పరిశ్రమల చట్టాన్ని"** సవరించుతూ ఏప్రిల్ 21న ప్రవేశపెట్టిన బిల్లును ఉపసంహరించుకుంటున్నట్టు మే దే రోజు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం కార్మికుల విజయం. ఆ బిల్లును ఉపసంహరించు కోవాలనీ రాష్ట్ర వ్యాపితంగా 9 కార్మిక సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఉద్యమించిన ఫలితంగా ఆ బిల్లును ముఖ్యమంత్రి స్టాలిన్ పై ప్రకటన చేయక తప్పలేదు. ఇదే చట్టాన్ని 1948 ఫ్యాక్టరీల చట్టం సవరణ (కర్ణాటక) బిల్లును, 2023 పేరుతో ఫిబ్రవరి 24న కర్ణాటక విధానసభ ఆమోదించింది. ఈ సవరణతో ఫ్యాక్టరీలలో శ్రామికుల పని గంటలు 8 నుండి 12కు పెంచడానికి వీలవుతుంది. అలాగే, ఈ సవరణలు మూడు నెలలలో 75 అదనపు గంటల పనిని 145కు పెంచుతుంది. రాత్రి షిఫ్టులలో మహిళలు పని చేయాల్సి వస్తుంది. ఇది కార్మిక వ్యతిరేక చట్టం. కర్ణాటకలో అత్యంత నిరంకుశంగా పాలించిన హిందుత్వ శక్తులను ఎన్నికలలో ఓడించిన కార్మికులు, ప్రజలు ఆ ప్రభుత్వం ముందుకు తెచ్చిన ఈ చట్టం సహ అనేక ప్రజా వ్యతిరేక చట్టాల ఉపసంహరణకు కాంగ్రెస్ ప్రభుత్వంతో రాజీ లేని పోరాటాలకు పూనుకుంటారనీ ఆశిద్దాం. తమిళనాడులో కానీ, ఇతర అనేక రాష్ట్రాలలో కానీ అన్ని ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం ఇలాంటి సవరణలు తేవడానికి చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను కార్మికులు దృఢంగా ఎదుర్కోవాలి.

మన దేశంలో రైతులు 400 రోజుల చారిత్రాత్మక సమ్మె చేసి విజయం సాధించిన విషయం తెలిసిందే. వారు ఆ సందర్భంగా 700కు పైగా ప్రాణాలను త్యాగం చేశారు. అయినప్పటికీ మన దేశ రైతాంగ సమస్యలు మౌలికంగా పరిష్కారం కానేలేదు. రైతులు తమ తక్షణ సమస్యల పరిష్కారానికి ఎక్కడికక్కడే ఉద్యమిస్తుండడం ఒక సాధారణ విషయంగా మారింది. మహారాష్ట్రలో ఏప్రిల్‌లో వేలాది మంది రైతులు ఎండకు కాళ్లు బొబ్బలెక్కి రక్తమొడుతున్నా లెక్కచేయం కదం తొక్కుతూ ఐదు రోజులపాటు నాసిక్ నుంచి ముంబాయికి 250 కిలో మీటర్ల పాదయాత్ర జరిపి ఉల్లి, పత్తి, టమాటా తదితర పంటలకు కనీస మద్దతు ధర, అటవీ హక్కుల పరిరక్షన తదితర 15 డిమాండ్లపై విధానసభను నిలదీయగా ముఖ్యమంత్రి షిందే ఆమోదం తెలుపక తప్పలేదు. ఇది రైతాంగ విజయం. "రైతులను కాపాడండి, కార్పొరేట్లను తన్ని తరమండి" అనేది నేటి రైతాంగ రణనినాదంగా మారుతోంది.

మన దేశంలో ప్రభుత్వోద్యోగులు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య పెన్షన్ సమస్య. దేశంలోని కొన్ని రాష్ట్రాలలో పాత పెన్షన్ పద్ధతి కొనసాగుతుండగా, మరి కొన్ని ప్రధానంగా బీజేపీ పాలిత రాష్ట్రాలలో కొత్త పెన్షన్ పద్ధతి అమలులో వుంది. కొత్త పెన్షన్ పద్ధతి అమలులో వున్న దగ్గర ఉద్యోగులు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారు. మహారాష్ట్రలో మార్చ్‌లో దాదాపు 17 లక్షల ఉద్యోగులు తమకు పాత పెన్షన్ పద్ధతినే అమలుచేయాలనీ సమ్మె చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని ఉద్యోగులు పాత పెన్షన్ అమలు చేయాలనీ డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలోని లక్షా 72 వేల మంది ఉద్యోగులు పాత పెన్షన్ అమలుకు డిమాండ్ చేస్తున్నారు. ఇలా దేశంలోని అనేక రాష్ట్రాలలో ఉద్యోగులు పాత పెన్షన్ అమలును డిమాండ్ చేస్తు సమ్మెలకు దిగుతున్నారు.

మన దేశంలో మాజీ సైనికులకు **"వన్ ర్యాంక్ వన్ పెన్షన్"** చెల్లింపు విషయంలో 2015 నవంబర్ 7న ప్రభుత్వం ఒక విధాన నిర్ణయం

తీసుకున్నప్పటికీ యేండ్లు గడిచినా వారికి రావలసిన పెన్షన్ చెల్లింపులు జరుగడమే లేదు. 2019-22 మధ్య కాలానికి వారికి 28వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి వుంది. వీటిని 2024 ఫిబ్రవరిలోగా చెల్లించాలనీ కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. మరోవైపు దేశ గృహ మంత్రి అమిత్‌షా 'వన్ రాహుల్, వన్ ప్రియాంక' అంటూ ఆ విధానాన్ని ఎద్దేవా చేయడం 6 లక్షల మాజీ సైనికుల కుటుబాల పట్ల వారి చిత్తశుద్ధికి నిదర్శనం.

మన దేశంలో కాంట్రాక్టు వర్కర్ల సమస్య చాలా తీవ్రమైంది. ఇది అన్ని పరిశ్రమలలో అమలవుతోంది. కొన్ని పరిశ్రమలలో 10 శాతమైనా పర్మినెంట్ కార్మికులు లేరు. దేశంలో కాంట్రాక్టు వర్కర్ల సంఖ్య కోటికి పైగా వుంటుంది. ఆంగన్‌వాడీలు 10 లక్షలు, ఆశా వర్కర్లు 10 లక్షలు ఇలా వివిధ రంగాలలో ప్రజలకు సేవలందించే వీరిలో 90 శాతం మహిళలే వున్నారు. వీరంతా పేద, కింది మధ్య తరగతి వర్గాలకు చెందినవారే. 'గౌరవవేతనం' పేరుతో వీరికి అతి తక్కువ కూలీ చెల్లిస్తూ ప్రభుత్వాలు విపరీతమైన చాకిరీ చేయిస్తున్నావి. వీరు తమను పర్మినెంట్ చేయాలనీ, కనీస వేతన చట్టం ప్రకారం తమకు వేతనాలు చెల్లించాలనీ, ప్రభుత్వోద్యోగులకు వర్తించే అన్ని నియమాలు, సౌకర్యాలు తమకు వర్తించాలనీ సమరశీల పోరాటాలు చేస్తున్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో ఆంగన్‌వాడి, సహాయికాల సమ్మె మూలంగా ప్రభుత్వం వారి వేతనాలలో స్వల్ప పెంపుదల చేసింది. దేశంలో హర్యాణా నుండి ఆంధ్రప్రదేశ్ వరకు లక్షలాది కాంట్రాక్టు వర్కర్లు ఏదో ఒక రాష్ట్రంలో సమ్మెకు దిగని రోజు వుండదు.

మన దేశంలో మార్చ్ 28-29 తేదీలలో అతి పెద్ద సార్వత్రిక సమ్మె జరిగింది. దానికి దేశ వ్యాపిత ప్రజల మద్దతు లభించింది. ఆ తరువాత దేశంలో సామ్రాజ్యవాద ఆర్థిక విధానాల దుష్ఫలితాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఏప్రిల్ 5న లక్షలాది మందితో కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీ జరిగింది. **'అక్కడ రైట్ టూ వర్క్', 'రైట్ టూ ఫుడ్'** నినాదం మార్మోగింది. వాటిని పౌరుల ప్రాథమిక హక్కులలో చేర్చాలనీ డిమాండ్ చేశారు. వారిలో అత్యధిక శాతం కాంట్రాక్టు లేబర్ వుండడంతో వారంతా ఎంత కష్టపడినా వారికి పొద్దు గడవని స్థితి వుందనీ, వారి వుద్యోగాలు పర్మినెంట్ చేయాలనీ, జీతాలు పెంచాలనీ డిమాండ్ చేశారు.

ప్రపంచ అసమానత 2022 నివేదిక ప్రకారం 2021లో భారత మహిళా కార్మిక ఆదాయం వాటా 18 శాతం. ఇది ప్రపంచంలోనే అత్యల్పం. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2020-21లో శ్రామిక శక్తిలో మహిళలు 25.1 శాతం మాత్రమే. కానీ, వీరి సంఖ్య 2004-2005లో 42.7 శాతంగా వుండేది. అంటే దేశంలో హిందుత్వ శక్తుల పాలన ఫలితంగా మహిళలు పని నుండి వంచించబడుతున్నారు.

ప్రస్తుతం మన దేశ యువతలో 34 శాతం నిరుద్యోగం వున్నట్టు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ధృవీకరించింది. మన్రెగా పథకం ప్రకారం ప్రతి వ్యక్తికి యేడాదికి 100 రోజుల పని దినాలు కల్పించాల్సి వుండగా 2021-22లో అందులో సగం అంటే 50 రోజులు మాత్రమే కల్పించారు. మన్రెగా నిధులు తగ్గిస్తూ కూలీ పనులకు మరింత ఉద్వాసన చెపుతున్నారు.

దేశంలో కార్మికులు సహ అన్ని సెక్షన్ల ప్రజల సమస్యలు తీవ్రతరమవుతున్నాయి. ప్రభుత్వాలు అనుసరిస్తున్న దోపిడీ విధానాలతో అవి మరింత విషమిస్తున్నాయి. దానితో కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టు వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు, విద్యార్థులు ప్రతి ఒక్కరు సమ్మెలకు దిగక తప్పడం లేదు. వారి న్యాయమైన పోరాటాలకు ప్రజలు అండగా వుంటున్నారు. వారి పోరాటాలకు నిజాయితీతో నాయకత్వం వహించి అంతిమంగా దోపిడీ వర్గాల అధికారానికి చరమగీతం పాడే దిశలో వాటిని సమరశీల ఉద్యమాలుగా మలచాలి. ☆

---

**26 వ పేజీ తరువాయి**

ఈ ప్రకటన దాని ఎన్నికల స్టంట్ అని కూడా చెప్పకనే చెప్తుంది. ఇది మహిళల ఓట్లు దండుకోవటం, మహిళా పక్షపాతి అని ప్రదర్శించు కోవడానికి తప్ప నిజాయితీగా చేసింది కాదు. ప్రభుత్వ మోసపూరిత విధానాలపై ఆంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయికలు సహ సమస్త కాంట్రాక్టు ఉద్యోగులు పోరాటాల ద్వారానే తమ డిమాండ్ల సాధనకు పూనుకోవాలి. సమరశీల పోరాటాలు మాత్రమే సమస్యల పరిష్కారానికి దారులు చూపుతాయి. హక్కులను సాధిస్తాయి.

ఉద్యోగం అనేది కేవలం ఉపాధి కోసం చేసే చాకిరీలా వుండకూడదు. అది సమాజంలో ఒక గౌరవప్రదమైన, ప్రజాహితమైన వృత్తిగా వుండాలి. ఆ వృత్తి చేస్తున్న వారికి ఆత్మ సంతృప్తిని ఇవ్వాలి. తాము ప్రజల కోసం పని చేస్తున్నామనే బాధ్యతను పెంచాలి. ఇవేమీ పట్టించుకోని దోపిడీ ప్రభుత్వాలు ఆ ఉద్యోగాలపై ఆధారపడి బతుకున్న 'జీవితాలను' ఛిద్రం చేయటానికి పూనుకుంటున్నాయి. దేశంలో వికటాట్టహాసం చేస్తున్న నిరుద్యోగాన్ని అవకాశంగా తీసుకొని గౌరవవేతనం అనే ఓ పేరు తగిలించి అగౌరవంగా చూస్తూ ఆంగన్‌వాడీలంటూ మహిళల కోసం ఒక ప్రత్యేక పథకాన్ని కంటితుడుపు చర్యగా కాంట్రాక్టు సిస్టమ్‌ను తీసుకొచ్చాయి. దీని ప్రకారం తన ఇష్టం వచ్చినట్టు ఎవరికైనా ఉద్యోగం ఇవ్వోచ్చు, ఎవరి ఉద్యోగమైన తీసేయవచ్చు. ఉద్యోగానికి ఎటువంటి గ్యారంటీ లేదు. ఇది పోతే కాళ్ళు అరిగి పోయేంత వరకు తిరిగి వేరే ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. కానీ, ఈ వ్యవస్థలో ఉద్యోగాలెక్కడ దొరుకుతాయి? మన్రేగాకే దిక్కు లేకుండా పోతున్న పరిస్థితులలో ఈపాటి ఉద్యోగమైనా దొరికే భరోసానే లేదు. కాబట్టి కాంట్రాక్టు ఉద్యోగులంతా సమైక్యంగా నిలిచి ప్రభుత్వాల మెడలు వంచి తమ డిమాండ్లు సాధించుకోవడం తప్ప మరో మార్గమేమీ లేదు. అందుకు వర్తమాన చిరు విజయం గాంధాంధకారంలో చిరు వెలుతురులా దారి చూపుతుందన్న విశ్వాసంతో కాంట్రాక్టు ఉద్యోగులంతా సమైక్యంగా పోరుపథంలో నడుం బిగించాలి. ☆

# గుజరాత్ నమూనా అభివృద్ధిలో వలస కార్మికుల దుస్థితి

గుజరాత్‌లోని అహ్మదాబాద్ పారిశ్రామిక సముదాయంలో వాట్వా, నరోల్, సర్కెజ్, రమోల్, ధనిలిండా, అస్లాలీ మున్నగు ప్రాంతాలు చిన్న, సూక్ష్మ, మధ్యరకం (యంఎస్‌యంఈ) పరిశ్రమలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో అనేక రకాల పరిశ్రమలు దుస్తుల తయారీ, బట్టలు, మందుల కంపెనీలు, యంత్ర పరికరాలు, ప్లాస్టిక్ సైక్లింగ్, గాజు పరిశ్రమ, రవాణ, కర్ర చెక్కడాలు, ఇనుప దుకాణాలు, చిన్న చిన్న హోటళ్లు, చిల్లర కొట్లు, వాహన గారేజీలు మున్నగు అనేక రకాల పరిశ్రమలు, వృత్తి వ్యాపారాలు రెండు వేలకు పైగా వున్నప్పటికీ 70 శాతం బట్టలు, దుస్తుల తయారీవే వున్నవి. ఇవి నరోల్‌లో కేంద్రీకరించబడివున్నవి. వీటిలో అత్యధికంగా పనిచేసే వాళ్లు వలస కార్మికులే. రెండు లక్షలకు పైగా శ్రామికులు పనిచేసే ఈ పరిశ్రామిక ప్రాంతాలకు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిం బంగాల్‌ల నుండి వలస కార్మికులు చేరుకుంటారు. ఇక్కడ 35 మాత్రమే పెద్ద పరిశ్రమలు కలవు. ఈ పరిశ్రమలలో పని చేస్తున్న శ్రామికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఇక్కడున్న యంఎస్‌యంఈ యూనిట్లన్నీ భారీ సప్లైదారుల నుండి లభించే ఆర్డర్లపై ఆధారపడి తమ ఉత్పత్తులను కొనసాగిస్తుంటాయి. ఇంటర్నేషనల్ గార్మెంట్స్ కంపెనీలుగా 'ప్రసిద్ధి' చెందిన హెచ్ అండ్ ఎం, ఆదిదాస్, మార్క్స్ అండ్ స్పెన్సర్, జీఏపీ, లేవీస్‌లు కూడ వున్నాయి. నరోల్‌లో నెలకొన్న పెద్ద బట్టల, గార్మెంట్ల మిల్లులలో చిర్పాల్ గ్రూప్, మహాలక్ష్మీ టెక్స్‌టైల్స్, ఆర్వీడీనిం, జిందల్ ప్రాసెసింగ్ లాంటివి కూడ వున్నావి. వీటిలో అనేక రకాల దుస్తులు తయారవుతుంటాయి. ఈ గజ కార్పొరేట్ శక్తులు సంపాదించే అపార లాభాలలో వలస కార్మికుల శ్రమశక్తికి తగిన మూల్యం చెల్లించని వారి చెమటనెత్తుర్ల దోపిడీ వాటా కూడ వుంది.

వలస కార్మికులంతా దాదాపు కాంట్రాక్టు వర్కర్లే. వారికి ఎలాంటి కార్మిక సంఘాలు వుండవు. కార్మిక, పౌర హక్కులు వుండవు. సామాజిక భద్రత కరువే. వారి సమస్యలను పట్టించుకునేదే వుండదు. దేశంలో విపరీతమైన నిరుద్యోగం తాండవిస్తుండడం, ఆకలితో అలమటిస్తూ ముమ్మరంగా వలసలు వెళ్లే నిరుపేదలు వుండడం, పోటీపడుతూ కూలీపనులలో పాల్గొంటున్న స్థితిలో వారు కడుహీన కూలీకైనా పని చేయడానికి సిద్ధపడుతుంటారు. దానితో, వేతనాల విషయంలో యాజమాన్యాలు చిత్తం వచ్చినట్లు వ్యవహరిస్తూ శ్రమశక్తిని విపరీతంగా దోచు కుంటున్నాయి. అక్కడి లక్షలాది కార్మికుల మధ్య కార్ఖానా శ్రమిక్ సురక్షా సంఘ్ (కేఎస్ఎస్ఎస్), మిల్ మజ్దూర్ పంచాయత్ పేరుతో రెండు కార్మిక సంఘాలు వున్నప్పటికీ వాటి నాయకత్వం కార్మికుల పక్షాన నిలిచి దృఢంగా పోరాడి అనుకున్న డిమాండ్లు సాధించుకున్న చరిత్రే లేదు. ఫలితంగా వారు అనేక రకాల వివక్షకు గురవుతూ రోజూ వందల మంది కూలీ పనుల నుండి తొలగించబడుతున్నారు.

అక్కడి కార్మికులకు ఆర్థికంగా కనీస వేతనాల చట్టం వర్తించదు. అదనపు పని గంటలు అదనపు కూలీ చెల్లించనక్కర లేకుండానే విధిలేక చేయాల్సి వస్తుంది. వారికి సామాజిక భద్రతలుగా గుర్తించే పథకాలు ఈఎస్ఐ, పెన్షన్, భవిష్య నిధి, బోనస్, గ్రాట్యుటీ (కార్మికులకు దీర్ఘకాల సేవలకు ఇచ్చే డబ్బు) వర్తించవు. వేతనంతో కూడిన సెలవులు వీరెరుగరు. వీరంతా రోజు కూలీ శ్రామికులుగా లెక్కలోకే వస్తారు. వీరికి దొరికే కూలీతో రోజు గడవడమే గగనంగా వుంటుంది. పొదుపు కానీ, బ్యాంకు ఖాతాలు కాని వుండే అవకాశాలే లేవు. పని స్థలాలలో జరిగే దుర్ఘటనలలో వీరికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించే ప్రసక్తే వుండదు. వీరు కోర్టు కడప కూడ ఎక్కలేరు. వీరి పేర్లు ఏ పారిశ్రామిక రిజిష్టర్లలోనే నమోదు కానపుడు ఏ చట్టం వీరిని ఆదుకోదు.

గుజరాత్ నమూనా అభివృద్ధిగా దేశ ప్రధాని అలుపూ సొలుపూ లేకుండా చాటుకునే ఇక్కడ స్త్రీ-పురుష వేతనాలలో తేడాలు ఇప్పటికీ కొనసాగుతున్నావి. ఒకే పనికి ఒకే కూలీ అనే ప్రజాస్వామిక నియమం ఇక్కడ చెల్లదు. ప్రశ్నిస్తే వారి శ్రమ ఉత్పత్తుల నాణ్యత సరిగా లేదంటూ వారికి దొరికే కూలీ డబ్బులకు అదనపు కోతలు తప్పవు. ఇంటి పనిలో మునిగే మహిళలు కూలీ పనికి కొద్ది నిముషాల ఆలస్యంగా వెళితే కూలీ చెల్లింపులలో కోతలు ఎదుర్కొంటుంటారు. బట్టలు కుట్టే పనిలో స్త్రీ-పురుషులుండగా వారికి నెలకు దాదాపు రూ. 9వేలు దొరుకుతుంటాయి. బట్టల తయారీలో సాధారణంగా పురుషులే వుంటారు. వీరికి నెలకు దాదాపు రూ. 12 వేలు గిడుతాయి. బట్టలకు రంగు వేయడం, ప్యాకింగ్ లాంటి పనులలో నెలకు రూ. 10వేల సంపాదనలో కూడ ఇద్దరుంటారు. ఇతరులకు చేసి పెట్టే ఇంటి పనులలో లేద ఇంట్లో వుండి చేసే కుట్లు, ఎంబ్రాయిడరీ లాంటి పనులలో ప్రధానంగా మహిళలే వుంటారు. వీరికి దొరికే నెలసరి కూడ అతి తక్కువగా రూ. 7-8 వేలకు మించదు. ఇక్కడ పని చేసే లక్షలాది శ్రామికులలో అత్యధికులు దళితులు, ఆదివాసీలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాలవారు. ఇంట్లో వుంటూ పనిచేసే వారిలో ముస్లిం మైనార్టీ మహిళలు కూడ వుంటారు.

వలస కార్మికులు సామాజికంగా కూడ అనేక ఇక్కట్లను ఎదుర్కొంటుంటారు. వీరికి నివాస స్థలాలను యాజమాన్యాలు చూపించవు. ఎక్కడో దూరంగా పాడుపడిన కొంపలల్లో లేద ప్రత్యేకంగా వీరి కోసం కట్టి కిరాయిలకు ఇచ్చే తగిన వసతులు లేని కిరాయి ఇళ్లలలో అనేక అగచాట్లకు ప్రధానంగా మహిళలు గురువుతూ వీరు గడుపుతుంటారు. మోదీ గొప్పగా ప్రచారం చేసిన

శౌచాలయాల అసలు సంగతి అక్కడికి వెళితే సునాయసంగా అర్థమవుతుంది. వాటికి కూడ నోచుకోని వారు రోడ్డుపైన, ఫ్లై ఓవర్ల కింద, బహిరంగ ప్రదేశాలలోనే తలదాచుకుంటారు. వీరికి ఎలాంటి నివాస చిరునామాలు వుండకపోవడంతో వీరికి ప్రభుత్వ గుర్తింపు పత్రాలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కిరాయి ఒప్పందాలు, పాన్ కార్డులు లభించక ప్రభుత్వం నుండి లభించే చౌక ధరల సరుకులు, ఎల్‌పీజీ సబ్సిడీ, ఆరోగ్య బీమా, అంగన్‌వాడీ, పాఠశాల సౌకర్యాల నుండి వంచింపబడుతున్నారు. వీరికి దొరికే కూలీ డబ్బులలో 80 శాతం తిండికే పోతుండగా ఇక ఆరోగ్యాలకు, పిల్లల చదువుకు రిక్త హస్తాలతోనే దైవాదీనంగా జీవిస్తుంటారు.

వృత్తిపరమైన విషయాలలో అత్యంత ప్రమాదకర, అనారోగ్యకర వాతావరణంలో పని చేస్తూంటారు. పని స్థలాలలో భద్రత, ఆరోగ్య ప్రమాదాల నుండి రక్షణ, కార్మికుల శారీరక యోగ్యతల విషయంలో వైద్య పరీక్షల నిర్వహణ, శిక్షణా, వైద్యుల పర్యవేక్షణలో యంత్రాలపై పని చేయడం లాంటివి వుండడం లేదు. పని స్థలాలలో భద్రతా చర్యల కమిటీలు కానీ సెక్సువల్ వేదింపులపై ఫిర్యాదు కమిటీలు కానీ ఇక్కడ వలస కార్మికులలో చాలా మందికి తెలియవంటే ఆశ్చర్యం వుండదు. కోవిడు 19 ఉపద్రవం కారణంగా కీలక కార్మిక చట్టాలను మూడు సంవత్సరాలు ఉపసంహరించుకున్న ఫలితంగా కార్మికుల కష్టాలు అనేక రకాలుగా తీవ్రతరమయ్యాయి. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారమార్పిడి తర్వాత కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను కార్మిక చట్టాల నవీకరణ పేరుతో 4 కోడ్‌లుగా తలపెట్టిన సంస్కరణలు దేశవ్యాప్త కార్మికుల జీవితాలను బలిగొంటాయనడంలో సందేహం లేదు. వాటిని సంక్షిప్తంగా చూస్తే **మొదటి కోడ్ ప్రకారం**, 300 కంటే తక్కువ మంది కార్మికులు పని చేసే కంపెనీల యాజమాన్యాలకు తమ ఇష్టానుసారం వారిని తొలగించవచ్చు లేద ప్రభుత్వ అనుమతి లేకుండానే వాటిని మూసివేయవచ్చు. యాభై మంది కూలీలను ఉపయోగించుకునే కాంట్రాక్టర్లకు పని ప్రదేశ భద్రతా చట్టాల నుంచి మినహాయింపు వుంటుంది. **కోడ్ రెండు ప్రకారం** ప్రనకారం, పని ప్రదేశ భద్రత, సామాజిక భద్రత, లే-ఆఫ్‌ల నుంచి రక్షణ, కార్మికుల తొలగింపు, లేద మూసివేత నిబంధనల విషయంలో సదరు సంస్థకు మినహాయింపు ఇవ్వడం లేద పూర్తిగా రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి వుంటుంది. **కోడ్ మూడు ప్రకారం**, హక్కులను కాపాడు కోవడానికై యూనియన్‌లు ఏర్పాటు చేసుకోవడంలో సమస్యలు సమస్యలు కల్పించడం, సమ్మెను సమర్థించేవారిని శిక్షించడం, **కోడ్ నాలుగు ప్రకారం**, కాంట్రాక్టు లిఖితపూర్వకంగా లేనపుడు ఆ కార్మికులు అన్ని రకాల హక్కుల నుండి వంచింపబడుతారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ పారిశ్రామిక ప్రాంతం సహ దేశంలోని కోట్లాది అసంఘటిత కార్మికవర్గం పై కోడులు అమలులోకి రాకముందే కోడులలోని సమస్యలు చట్టరహితంగా ఎదుర్కొంటునే వున్నారు. అయితే, ఆ కోడులు చట్టరూపం ధరించకుండా నిలువరించగలిగిన కార్మిక పోరాటాలు శ్లాఘనీయం.

1886 నుండి అంతర్జాతీయంగా మేడే జరుపుకుంటున్నప్పటికీ, మన దేశంలో పరాయి పాలన 'అంతమైనప్పటికీ' శ్రామికుల జీవితాలు నరకయాతనను అనుభవి స్తున్న దృశ్యాలు కోకొల్లలు. సామ్రాజ్యవాద ఆర్థిక విధానాల ఫలితంగా శ్రామికులు అనేక చోట్ల పెద్ద ఎత్తున తమ పనులు కోల్పోతున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ పారిశ్రామిక ప్రాంతం అందుకు మినహాయింపు కాదు. నిరుద్యోగం పెరిగిపోతోంది. ఆధునిక యంత్రాలు ఉనికిలోకి వచ్చి దోపిడీ వ్యవస్థలో కార్మికుల జీవితలు అగమ్యగోచరంగా తయారవుతున్నాయి. ఇలాంటి దుస్థితిలో యావత్ శ్రామిక వర్గం నాణ్యమైన, మెరుగైన, గౌరవప్రదమైన, నిలకడైన జీవితాల కోసం శ్రమ దోపిడీకి అవకాశాలు లేని, ప్రజాస్వామిక వ్యవస్థ కోసం పోరాడడం మినహ మరో మార్గం లేదు.

☆

## మహిళా ఎంఎస్ఎంఈలను నులిపివేస్తున్న ప్రభుత్వ విధానాలు

మన దేశంలో ఆగస్టు 2022 నాటికి మహిళలు నడుపుకుంటున్న ఎంఎస్ఎంఈలు దాదాపు 18 లక్షలున్నాయంటూ రాజ్యసభలో ఆ శాఖామాత్యులు భానూ ప్రతాప్ వర్మ వివరించాడు. దేశంలో అధికారికంగా నమోదైన ఎంఎస్ఎంఈలలో ఇవి 18 శాతం అనుకోవాలి. ఈ సంఖ్య డిసెంబర్ 2021 నాటికి వున్న 16.6 తో పోలిస్తే 1.4 శాతం అధికం. "ఉదయం" పేరుతో ఆ శాఖ నిర్వహించే పోర్టల్‌లో కోటి యూనిట్లున్నట్టుగా నమోదై వుంది. ఈ సంఖ్య మార్చ్ 2023 నాటికి కోటీ యాభై లక్షలకు పెరిగిపోయింది. నిజానికి ఈ అంకెల గారడీ చూస్తుంటే ఇదంతా మోదీ ప్రభుత్వ 'వికాస్ మంత్ర' రాజకీయ స్టంట్ అని తెలిపోతుంది. అందుకే దేశంలోని మహిళా ఎంఎస్ఎంఈలే సజీవ సాక్షంగా వుంటాయి. వాస్తవానికి మహిళా ఎంఎస్ఎంఈల సంఖ్య ఎంత అనేదానికన్నా వాటి నిర్వహణ తీరు పట్ల ప్రభుత్వ వైఖరి ఎలా వుందనేది ముఖ్యమవుతుంది.

ప్రపంచ బ్యాంకుకు చెందిన అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ విడుదల చేసిన ఇటీవలి నివేదిక ప్రకారం విశ్వ వ్యాప్తంగా ఇంచుమించు కోటీ యాభై లక్షల మహిళా ఎంఎస్ఎంఈలు వున్నాయి. ఈ నివేదిక ప్రకారం వీటిలో 90 శాతం యూనిట్లకు అధికారిక ఆర్థిక సంస్థల నుండి ప్రోత్సాహజనక పెట్టుబడులు అందడం లేదు. వీటిలో 18 శాతం అంటే 27 లక్షలను మహిళా అతి చిన్న యూనిట్లు (డబ్ల్యు.వీ.ఎస్.ఈఎస్)గా వ్యవహరిస్తున్నారు. వాటి పెట్టుబడి అంచనా డిమాండ్ ఎంత? కేవలం రూ. 83,600 కోట్లు. మన దేశంలోని మహిళా ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న పెట్టుబడుల కొరత సమస్య కన్నా గత రెండు దశాబ్దాలుగా అమెరికా మహిళా సంస్థలు రెట్టింపు సమస్యలను ఎదుర్కొంటున్నారు.

# సమ్మె పోరాటంతో డిమాండ్లు సాధించుకున్న అంగన్‌వాడీ, సహాయికలకు జేజేలు

ఎట్టకేలకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అంగన్‌వాడీ కార్యకర్తల, సహాయికల నిరవధిక రిలే ధర్నా 43 రోజుల పాటు కొనసాగి విజయంతో ముగిసింది. వారు తమ ఆరు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 2023 జనవరి 23న మొదలుపెట్టిన సామూహిక ధర్నా మార్చి 6 వరకు వివిధ సమరశీల పోరాట రూపాలలో కొనసాగించారు. ధర్నా జరుగుతున్న సమయంలో పోలీసుల నుండి, ప్రభుత్వ అధికారుల నుండి ఎన్ని బెదిరింపులు ఎదురైనప్పటికీ వెరువక చివరి వరకు పోరాడి తమ డిమాండ్స్‌ను సాధించుకున్నారు. విజయం పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయికలకు అభినందనలు. ధర్నా మొదలు పెట్టినప్పటి నుంచి ఆఖరి వరకు, ఉదయం నుంచి సాయంత్రం వరకు పాలు తాగే పసి పిల్లలను చంకనేసుకొని నిప్పులు కొరికే చలిని సైతం తట్టుకొని అనేక మంది అంగన్‌వాడీ కార్యకర్తలు వారి హెల్పర్లు ధర్నాలో పాల్గొన్నారు.

2018 ఛత్తీస్‌ఘడ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, దాని నాయకుడు భూపేష్ బఘేల్ అంగన్‌వాడీ కార్యకర్తలను, సహాయికలను కాంట్రాక్టు ఉద్యోగులుగా కాకుండా, రెగ్యులర్ చేసి వారికి గౌరవ వేతనం కాకుండా వేతనాలే కల్పిస్తామనీ వాగ్దానం చేసి వారి ఓట్లను గెలుచుకొని అధికారంలోకి వచ్చాడు. కానీ అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాలు దాటిపోతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ఊపిరాడని పని భారాన్ని ప్రభుత్వం వారి నెత్తిన పడేసింది. ప్రతి నెల వారు తయారు చేయాల్సిన రికార్డులు చూస్తే ఎవరికైనా దిమ్మ తిరిగిపోయే పరిస్థితి. ఓవైపు ఇంటి చాకిరీ, మరోవైపు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లల సంరక్షణతో పాటు ప్రభుత్వ రికార్డులు నింపడంతో వారికి ఊపిరి సల్పకుండా వుంటుంది.

అంగన్ వాడీ కేంద్రానికి వచ్చే పిల్లల సంఖ్య, వారి వయసు, పోషణ, సంరక్షణ, టీకాలు, గర్భిణీ స్త్రీలు-శిశువుల పరిస్థితి, ఎనీమియా చెకింగ్, మాతా శిశివు బరువు చెకింగ్, ప్రసవం తర్వాత తల్లీ, బిడ్డల ఆరోగ్యం, మాతా శిశు మరణాల రేటును తగ్గించే ప్రయత్నం, వయో వృద్ధుల ఆరోగ్యం, మొత్తం జనసంఖ్య వివరణ, వికలాంగులుగా (మోదీ గారి భాషలో దివ్యాంగులు) ఉన్న శిశువుల వివరాలు, తీవ్రమైన పౌష్టికాహార లోపమున్న పిల్లల వివరాలు, రకరకాల వైరస్‌ల ద్వారా వచ్చే జబ్బుల వివరాలు, వాటి నుంచి రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు.... ఈ రికార్డంతా ప్రతి నెల ఇంటింటికీ తిరిగి వారు సేకరించాలి. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను కూడా జనం వద్దకు తీసుకువెళ్ళాలి.

ఇవే కాకుండా కొరోనా-19 సమయంలోనైతే ప్రభుత్వం ఇచ్చిన అదనపు బాధ్యతలను కూడా ప్రజా సంక్షేమం దృష్ట్యా నెరవేర్చారు. కొరోనా పీడితుల రిపోర్టు సేకరించేవారు, పీడితులకు వైద్య సేవలు అందించారు. పిల్లల పౌష్టికాహార లోపాన్ని తీర్చటానికి పలు విధాలుగా పాటుపడుతుంటారు. జనగణన జాబితా, ఓటర్ల గుర్తింపు జాబితా తయారీ పనిని కూడా ప్రభుత్వం వారి మీదే వేసింది. ఈ రిపోర్టును తయారు చేయటానికి కార్యకర్తలు, సహాయికలు ఎంతో కష్ట పడాల్సి వచ్చింది. ఎంతో కష్టపడి రికార్డు తయారు చేసినా, పై అధికారుల నుండి నిత్యం వేధింపులే ఎదురయ్యేవి. అయినా గానీ 'గౌరవ వేతనం' కోసం మారు మాట్లాడకుండా తమకిచ్చిన బాధ్యతలను విధిలేక నెరవేర్చారు. ఇన్ని అదనపు బాధ్యతలను నిర్వర్తించినప్పటికీ ప్రభుత్వం వీరి ప్రజాహిత సేవలకు ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదు. ఒక గుర్తింపు లేని పనులకు ఇచ్చే ముష్టి అదనపు బత్తెం మాట సరేసరి. మరోవైపు ఈ వెట్టి చాకిరంతా పిల్లల సేవలపై చాలా దుష్ప్రభావాన్ని వేసేది. ఏళ్ళ తరబడిగా వెట్టి చాకిరీ, చాలీ చాలనీ 'గౌరవ' వేతనంతో విసిగి వేసారిపోతున్న కార్యకర్తలు, సహాయికలు ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా నిరవధిక పోరాట రూపాన్ని ఎంచుకోక తప్పలేదు. ఒక పక్క పేదరికం, కుటుంబం, భూమి వున్న వారికి వ్యవసాయపు పనులు మరో పక్క ధర్నా. వీటన్నింటిని సమన్వయం చేసుకొంటూ మహిళలంతా పోరాటాన్ని ఎంతో పట్టుదలగా ముందుకు నడిపించారు. అది వారి బతుకు పోరులో అనివార్య భాగమైంది.

రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌లోనూ, ఎక్కడికక్కడ జిల్లా కేంద్రాల్లో ర్యాలీ ప్రదర్శనలు చేశారు. జనవరి 28 నుంచి ఈ పోరాటం బ్లాకు కేంద్రాలలోకి విస్తరించింది. ధర్నా మొదలు పెట్టిన 15 రోజులకు కేస్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సంతరామ్ నేతమ్ నివాసాన్ని చుట్టు ముట్టి తమ నిరసనను తెలియజేశారు. పోరాటం మొదలై నెల గడిచినా సమస్యలు పరిష్కారం కాకపోవటంతో రాష్ట్రంలోని అన్ని జిల్లా ముఖ్య కేంద్రాల్లో నినాదాలు ఇస్తూ భారీ ర్యాలీ, ప్రదర్శనలు నిర్వహించారు. 43 రోజుల్లో పలు సమరశీల పోరాట రూపాలను ఎంచుకొని ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. హైవేపై రాస్తారోకో చేయటానికి కూడా సన్నాహాలు చేసుకున్నారు. పోరాటం జరిగే క్రమంలో కేస్కల్ నుంచి ధర్నా స్థలానికి వెళుతున్న ఇద్దరు అంగన్ వాడీ కార్యకర్తలు దుర్ఘటనకు గురై తీవ్రంగా గాయపడినప్పటికీ కూడా వారు పోరాటంలో పాల్గొన్నారు. వారికి ఏదీ అడ్డు రాలేదు. వారు ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ తమ డిమాండ్ల సాధనకై పట్టుదలతో ముందుకు నడిచారు. వారి సమస్యలను ప్రధాన మీడియా కన్నా ప్రత్యామ్నాయ వీడియా శక్తులే ఎక్కువగా పట్టించుకున్నాయి.

ఈ పోరాటాన్ని సహించలేని రాష్ట్ర ప్రభుత్వం దీన్ని వివిధ రూపాల్లో పక్కదారులు పట్టించటానికి ప్రయత్నించింది, కార్యకర్తలను వేధించింది, ఉన్న ఉద్యోగం కూడా ఊడుతుందనీ బెదిరింపు ఆదేశాలు జారీ చేసింది. '48 గంటల్లో కనుక డ్యూటీలోకి పోని పక్షంలో ఉద్యోగం నుండి తీసేస్తాం, గౌరవ వేతనం ఇవ్వం అని అగౌరవంగా బెదిరిస్తూ ఆర్డర్లు జారీ చేసింది. ధర్నా చేయటం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలన్నీ మూతపడ్డాయి, పిల్లలకు

పౌష్టికాహార సమస్య, అమ్మలాగ తమ ఆలనా పాలనా చూసుకునే దిక్కు లేని పరిస్థితి వారికి ఎదురైంది. కానీ దీనికి బాధ్యులు ఎవరు? ముమ్మాటికి ప్రభుత్వమే బాధ్యత పడాలి. ఇది కేవలం ఒక్క ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అంగన్‌వాడీల సమస్య కాదు. దేశ వ్యాప్తంగా వున్న అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మిథానిన్‌లు తదితర లక్షలాది కాంట్రాక్టు ఉద్యోగుల జీవిత సమస్య.

ప్రభుత్వం ఛత్తీస్‌ఘఢ్‌ను పౌష్టికాహార లోప విముక్తి చేయాలనుకొని లక్ష్యం పెట్టుకొంది, గాబట్టి మీరు వెంటనే విధుల్లోకి వెళ్ళి పోవాలని బఘేల్ సర్కార్ హుకుం జారీ చేసింది. జగదల్‌పూర్‌లో పోరాటం చేస్తున్న అంగన్‌బాడీ కార్యకర్తలు, సహాయికలనుద్దేశించి "బస్తర్‌లో వున్న 1981 అంగన్ వాడీ కేంద్రాల్లో నమోదైన జాబితా ప్రకారం 94 వేల మంది పిల్లలున్నారు. వీరి పాలన, పోషణ ఎలా? కాంకేర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,500 కేంద్రాల్లోని పిల్లల పరిస్థితి ఏంటి? కొండగావ్ జిల్లాలో ఉన్న 1,830 కేంద్రాల పరిస్థితి, బీజాపుర్‌లోని 1,146 కేంద్రాల పరిస్థితి, కోయిలబేడలోని 4 సెక్టార్ల లోని 82 కేంద్రాల పరిస్థితి ఏంటి" అని సర్కార్ వారు ఉల్టా వారినే బెదిరించారు. పోరాటం మీద ప్రభావం పడే విధంగా కార్యకర్తలపై దాడులు కూడా చెయించింది.

మార్చి 5న తెందుబాటా గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తలు గంగా జయస్వాల్, ద్రౌపది జయస్వాల్‌లు ఆ రోజు మధ్యాహ్నం కేస్కల్‌లో జరుగుతున్న ధర్నా స్థలానికి మోటారుసైకిల్‌పై వెళుతున్న క్రమంలో నేషనల్ హైవే-30 మీద గారక గ్రామ సమీపంలో జగదల్‌పూర్ నుంచి వస్తున్న 'అజ్ఞాత' కారు ఢీ కొట్టింది. వెంటనే ఆ పరిసరాలలో కానరాకుండా దూసుకువెళ్లింది. ఆ కారు ఆరా తీసీ పట్టుకున్న పోలీసులే కరువయ్యారు. సీసీటీవీ ఫుటేజ్‌లు కూడ దొరుకవన్నారు. నిజానికి ఇదంతా మహిళా కార్యకర్తలను భయపెట్టి పోరాటం నుండి వివరమింప చేయడానికి అంతా కలిసి పన్నిన కుట్ర తప్ప మరేం కాదనీ వారికి సులువుగానే అర్థమైంది. తుదకు కనీసం తీవ్రమైన గాయాలతో ఉన్న కార్యకర్తలను జనం హాస్పిటల్లో జాయిన్ చేయించి వారి సేవా భావాన్ని చాటుకున్నారు. కానీ ఖాకీలు మాత్రం కానరాలేదు. ఇది వారు చాటుకునే సోషల్ పోలీసింగ్!

ప్రభుత్వం ఈ రకంగా వారి పోరాటాన్ని నీరు కార్చాలని చేసిన ప్రయత్నాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయికలు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ అదిరింపు-బెదిరింపులకు వారు లొంగలేదు, భయపడలేదు. 'సంవత్సరాల తరబడి మా సమస్యల గురించి ప్రభుత్వానికి విన్నవించుకున్నా మా మొర ఆలకించడమే లేదు. కార్యకర్తలకు గౌరవ వేతనం అంటూ రూ. 6,500 సహాయికలకు రూ. 3,240 సంవత్సరాల తరబడిగా ఇస్తున్న ప్రభుత్వం కనీసం పెరుగుతన్న ధరలను, మండిపోతున్న జీవితాలను చూడడమే లేదు. ఆ వేతనాలు పెంచింది లేదు. మా బాధ్యతలతో పాటు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నాం. ఆకాశాన్నంటిన అధిక ధరలతో 6,500 రూపాయల తో కుటుంబ పోషణ దినదిన గండంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి ఎన్ని సార్లు విన్న వించుకున్నా ఫలితం లేకుండా పోయింది. అందుకే మేం మా డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆపేది లేదని తెగేసి చెప్పారు. అలానే రిటైర్‌మెంట్ అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ. 5 లక్షలు, సహాయికలకు రూ. 3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారానే కార్యకలాపాలు సాగిస్తుండటంతో ఇంటర్నెట్, మొబైల్‌కు అయ్యే అదనపు ఖర్చులన్నీ తమే భరించాల్సి రావటం తలకు మించిన భారమవుతుంది. అందుకే ఈ ఆరు డిమాండ్లతో పాటు నెట్‌ప్యాక్, రీఛార్జ్ సౌకర్యం కల్పించాల'ని డిమాండ్ చేశారు.

వీరి న్యాయపూరితమైన ధర్నా, డిమాండ్లకు అనేక రకాల కాంట్రాక్టు ఉద్యోగుల నుండి, నాల్గవ తరగతి ఉద్యోగుల నుండి, ప్రత్నామ్నాయ మీడియా మిత్రుల నుండి విస్తృతమైన స్పందన వచ్చింది. అన్ని సెక్షన్ల మహిళలు, సహ ఉద్యోగులు, ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి. మార్చి 1 నుంచి 3 వరకు జరిపిన సంతకాల క్యాంపెయిన్‌లో వేల మంది సంతకాలు చేసి తమ మద్దతును తెలిపారు.

మార్చి 4వ తారీఖు నుంచి మూడు రోజుల కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు. విధానసభ దగ్గర మార్చ్, విధానసభ, మహిళా బాల వికాస్ విభాగ్‌లను ముట్టడి చేపట్టాలనుకున్న తరుణంలోనే ప్రభుత్వం తన బడ్జెట్‌లో అంగన్‌వాడీల వేతనాలు పెంచుతు నిధులు కేటాయించింది. వారి డిమాండ్స్‌ను ఒప్పుకుంటున్నానని ప్రకటించింది. అంగన్‌వాడీ కార్యకర్తలకు గతంలో ఉన్న గౌరవ వేతనం రూ.6.500ను రూ.10.000కు, సహాయికలకు గతంలో ఉన్న 3.250 రూ. 5వేలకు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు గతంలో ఉన్న రూ. 4.500 కు రూ.3.000 కలిపి రూ. 7.500 చేస్తూ మొబైల్ రీఛార్జ్ కోసం రూ.500 ప్రకటించింది. కానీ మిగిలిన డిమాండ్స్ గురించి ఏ ప్రకటనా లేదు. వాస్తవానికి ఆ డిమాండ్లు చాలా ముఖ్యమైనవి. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ, వేతనం రూ. 26 వేలకు పెంచాలనీ, మిగితా అన్ని సౌకర్యాలు కల్పించాలనీ వారు చేస్తున్న డిమాండ్లపై ప్రభుత్వం కొద్ది మాసాలలో రానున్న ఎన్నికల ముందు మౌనంగా వుండడం అంగన్‌వాడీ కార్యకర్తల, సహాయికల ఆగ్రహానికి ఆజ్యం పోయడం తప్ప మరేం కాదు. వారు ఎన్నికలను బహిష్కరించి ప్రభుత్వానికి బుద్ధి చెపుతారా, మెడలు వంచి డిమాండ్స్ సాధించుకుంటారా వారే తేల్చుకోవలసిన అనివార్య స్థితి వారి ముందుంది.

చివరికి 43 రోజుల రిలే ధర్నాతో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయికలు చిరు విజయం సాధించారు. వారి భవిష్యత్ విజయాలకు ఇది ఒక ప్రాతిపదికగా వుంటుంది. ప్రభుత్వం విదిల్చిన ముష్టి పెంపుదల దయతల్చి ఇచ్చిన వరమేమీ కాదు. ఈ మేరకైనా ప్రభుత్వం వారి డిమాండ్స్‌ను ఒప్పుకోవటానికి అసలు కారణం తొందరలోనే ఉన్న అసెంబ్లీ ఎన్నికలు అనే విషయం అంగన్‌వాడీలకు అర్థం కానీ బ్రహ్మ రహస్యం ఏమీ కాదు. అందుకే వర్తమాన రాష్ట్ర బడ్జెట్‌లో ఈ మేరకు పెంపుదలను ప్రకటించింది.

మిగతాది 22వ పేజీ లో

# బంగారపు గనులపై ఆధిపత్యం కోసం సూడాన్‌లో సైనిక ఘర్షణలు

సుడాన్ సుదీర్ఘకాలం బ్రిటిష్ ఈజిప్ట్ వలస దేశంగా ఉంది. వలస పాలనకు వ్యతిరేకంగా సూడాన్ ప్రజలు అనేక పోరాటాలు చేశారు. 1953లో బ్రిటిష్ ప్రభుత్వం సుడాన్‌కు స్వయం నిర్ణయాధికారం కల్పించి, 1955 చివరిలో సూడాన్ పార్లమెంటు 'స్వాతంత్ర్యాన్ని' ప్రకటించింది. ఆ విధంగా 1956 జనవరి 1న సూడాన్ తొలి ప్రధాని ఇజ్రాయిల్ అల్ అజారీ జాతీయ జెండాను ఎగురవేసి స్వతంత్ర ప్రభుత్వాన్ని ప్రారంభించాడు. అజారీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యింది, పార్లమెంటును, రాజకీయ పార్టీలను రద్దు చేసింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. అజారీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి కర్నల్ గాఫర్ నామీర్రై ప్రధానమంత్రి అయ్యాడు.

సూడాన్ దేశం తూర్పు దక్షిణ ప్రాంతాలుగా ఉంటుంది. ఈ రెండింటి మధ్య వైరుధ్యం, అపనమ్మకం 1950లో సాయుధ పోరాటానికి, 1955లో దక్షిణ సైనికాధికారుల తిరుగుబాటుకు దారి తీసింది. దక్షిణ సూడాన్‌లో క్రిష్టియన్‌లు అధికం. కర్నల్ గాఫర్ ప్రభుత్వం 1955లో క్రిష్టియన్‌లపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి అక్కడి సహజ వనరులను తరలించడంతో మొదటి అంతర్యుద్ధానికి నాంది పలికింది. ఆ తిరుగుబాటు విజయవంతమై 1972లో దక్షిణ సూడాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడి 1983 వరకు కొనసాగింది.

సూడాన్ దేశంలో అనేక రకాల తెగల వారున్నారు. దక్షిణాదిన క్రైస్తవులు, ఉత్తరాదిన ముస్లింల ప్రాబల్యం ఎక్కువ. 1983లో మొదలైన అంతర్యుద్ధం 2005లో ముగిసింది. శాంతి ఒప్పందంపై చర్చలు జరిగినపుడు దక్షిణాది వారికి స్వయం నిర్ణయాధికార హక్కు లభించింది. ఒడంబడిక ప్రకారం ఆరేళ్ళకి అది అమల్లోకి వచ్చి, 2011 జనవరి ప్రజాభిప్రాయ సేకరణలో దక్షిణాది వారు ప్రత్యేక దేశాన్ని కోరుకోవడంతో దక్షిణ సూడాన్ దేశం ఏర్పడింది. ఉత్తర ప్రాంత వివక్ష కారణంగానే దక్షిణ సూడాన్ 2011లో విడిపోయింది.

సూడాన్ వ్యవసాయ ప్రధాన దేశం, సూడాన్‌లో 84 మిలియన్ హెక్టార్ల భూమిలో 20 శాతం మాత్రమే సాగులో ఉంది. పెట్రోలియం, బంగారం, ఇతర ఖనిజాలు పుష్కలంగా ఉన్న దేశంలో ప్రజలు తీవ్రమైన పేదరికం, నిరుద్యోగంతో బాధపడుతున్నారు. కరువు పరిస్థితుల కారణంగా లక్షలాది ప్రజలు ఇతర దేశాలకు వలస వెళ్ళారు. 1989లో జరిగిన ప్రజా పోరాటాలను అవకాశంగా తీసుకుని మాజీ సైనికాధికారి బషీర్ తిరుగుబాటు చేసి అధికారాన్ని చేజిక్కించుకున్నాడు.

సూడాన్ చరిత్రలో బషీర్ నియంతృత్వ పాలన అత్యంత దారుణమైనది. మతం, జాతుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడంతో అన్ని రాజకీయ, సాంఘిక వ్యవస్థలు విఫలమయ్యాయి. ధరలు అదుపు తప్పాయి. రాజకీయ అశాంతి అంతర్యుద్ధ పరిస్థితులకు దారి తీసింది. దేశ వ్యాపితంగా ఆందోళనలు చెలరేగాయి. నిరసన ప్రదర్శనలు చేస్తున్న ప్రజలపై సైన్యాలు కాల్పులు జరిపాయి. ఈ ఘర్షణల్లో 4 లక్షల మంది ప్రజలు ప్రాణాలు కొల్పోయారు. సైన్యం తిరుగుబాటు చేసి బషీర్‌ను బంధించడంతో ఏప్రిల్ 11, 2019లో బషీర్ 30 సంవత్సరాల నియంతృత్వ పాలన ముగిసింది.

2019లో మిలటరీ, ప్రజల సంయుక్త భాగస్వామ్యంతో ప్రభుత్వం ఏర్పడింది. రెండేళ్ళ తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు కావల్సిన సమయంలో 2021 అక్టోబర్‌లో జనరల్ అబ్దుల్ ఫతా అల్ బుర్హాన్ నేతృత్వంలో తిరుగుబాటు జరిగి తాత్కాలిక ప్రభుత్వాన్ని రద్దు చేశారు. పౌర వ్యవస్థలను రద్దు చేసి నాయకులను నిర్బంధించారు.

సూడాన్ దేశాన్ని 3 దశాబ్దాల పాటు పరిపాలించిన సూడాన్ అధ్యక్షుడు ఒమర్ అల్‌బషీర్‌ను గద్దె దించడంలోను, తాత్కాలిక ప్రభుత్వం రద్దయిన 2021 సైనిక తిరుగుబాటు లోను కీలకపాత్ర పోషించిన వారిద్దరి మధ్య అధికారం కోసం మొదలైన వివాదమే ప్రస్తుత ఘర్షణలకు కారణం.

2022 డిసెంబర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కోసం చర్చలు జరిగి విఫలం కావడంతో తాజాగా రెండు సైనిక విభాగాల మధ్య ఆధిపత్యం కోసం పోరాటం జరుగుతున్నది.

సైనిక పాలకుడు అబ్దుల్ ఫతా అల్ బుర్హాన్ అదుపాజ్ఞలలో ప్రస్తుతం సైనిక దళాలు పనిచేస్తున్నాయి. పారా మిలటరీ దళమైన 'ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్' (ఆర్ఎస్ఎఫ్) కి జనరల్ మహమ్మద్ హమ్దాన్ డగాలో అధిపతిగా ఉన్నాడు. ఈ సాయుధ దళాల మధ్య తాజా ఘర్షణల్లో వందలాది మంది చనిపోయారు. వేలాదిమంది గాయపడ్డారు. మానవ హక్కుల ఉల్లంఘనకు, అత్యాచారాలు, దౌర్జన్యాలకు పేరువోసిన జంజావీడు బలగాలకు డగాలో నాయకుడు. ప్రదర్శన కారులపై కాల్పులు జరిపి పెద్ద సంఖ్యలో హత్యలు చేసిన దార్ఫర్ ఘర్షణల చీకటి చరిత్రలో ఈ దళాలదే ప్రముఖ పాత్ర. అంతర్జాతీయంగా దానిపై వ్యతిరేకత ప్రబలడంతో అప్పటి అధ్యక్షుడు బషీర్ 2007లో ఆ దళాలకు బోర్డర్ ఇంటెలిజెన్స్ యూనిట్లు అని పేరు మర్చాడు. తర్వాత కొద్దిపాటి మార్పు చేర్పులతో వాటినే ఆర్ఎస్ఎఫ్‌గా మార్చాడు. దార్ఫర్ మారణకాండ సందర్భంగా బుర్హాన్, డగాలో ఇద్దరూ చేతులు కలిపారు. బుర్హాన్, డగాలో ఇద్దరూ గల్ఫ్ దేశాల మద్దతుతో అధికారంపై తమ పట్టును

పటిష్ట పరుచుకుంటు వచ్చారు.

దగాలో పట్టుబడితే ఆయనను సైనిక న్యాయస్థానంలో విచారిస్తామని బుర్హాన్ చెబుతున్నాడు. బుర్హాన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆర్ఎస్ఎఫ్ చెబుతుంది. సూడాన్ సైనిక దళాల సంఖ్య 2 లక్షల 20 వేల మంది, ఆర్ఎస్ఎఫ్ సంఖ్య 70 వేల మంది ఉన్నారు. ఆర్ఎస్ఎఫ్ సంఖ్య తక్కువగా ఉన్నా వారంతా మెరుగైన పోరాట పటిమ కలవారు.

సూడాన్‌లో ప్రస్తుత ఘర్షణలకు కారణం అక్కడి సహజ వనరులను కొల్లగొట్టడంలో, ముఖ్యంగా బంగారపు గనులపై ఆధిపత్యం కోసం తలెత్తిన పోటీనే ప్రధానం.

ఆఫ్రికా నైలు నదీ పరీవాహక ప్రాంతంలో 3 పెద్ద దేశాలలో సూడాన్ ఒకటి. ఇథియో పియాలో నదీ జలాల వివాదం, వైరుధ్యాల కారణంగా ఈజిప్టు సూడాన్‌లోని అంతర్గత వైరుధ్యాలను వినియోగించుకుని ఒక మిత్రపక్షాన్ని తన పక్షాన ఉంచుకుంటుంది. ఈజిప్టుకు ఆ విధంగా సూడాన్‌లో సైన్యంతో (ఇరుపక్షాలతో) మంచి సంబంధాలున్నాయి.

మధ్య తూర్పు ప్రాంతం, తూర్పు ఆఫ్రికాలో యూ.ఏ.ఈ. విస్తరణకు ఆర్.ఎస్.ఎఫ్ మద్దతు ఉంది. యెమెన్‌లో ఇరాన్ అండతో పోరాడిన హైతీ తిరుగుబాటుదారులతో యుద్ధం చేసిన యూ.ఏ.ఈ., సౌదీ అరేబియాలకు మద్దతుగా ఆర్.ఎస్.ఎఫ్. వేలాదిగా ఫైటర్లను పంపించింది. ఆ విధంగా ఆర్.ఎస్.ఎఫ్.కు వారితో సంబంధాలు ఉన్నాయి.

1990 దశకంలో సూడాన్ ప్రభుత్వానికి ఆల్ బషీర్ నేతృత్వం వహిస్తున్నప్పుడు ఒసామా బిన్ లాంటి 'మిలిటెంట్ల'కు ఆశ్రయం ఇచ్చినందుకు, 2000 దశకంలో పశ్చిమ డార్ఫూర్ మారణ కాండ జరిపిన కారణంగా అమెరికా సూడాన్‌పై ఆంక్షలు విధించింది. ఇజ్రాయిల్‌తో సంబంధాలు ఏర్పరచుకోవడానికి సూడాన్ అంగీకరించడంతో 2020లో ఆ ఆంక్షలను తొల గించింది. అయితే 2021 సైనిక తిరుగుబాటు తర్వాత రుణాలు, ఆర్థిక సాహాయం సూడాన్‌కు రాకుండా నిలిచిపోయాయి. ఇంకా సూడాన్‌లో స్మగ్లింగ్ అభియోగంతో వాగ్నెర్ గ్రూపుకు చెందిన 2 కంపెనీలపై అమెరికా, యూరోపియన్ యూనియన్ ఆంక్షలు విధించాయి.

బంగారాన్ని వెలికి తీసే సూడాన్‌లో నున్న వాగ్నెర్న్ గ్రూపు (స్మగ్లర్ గ్రూపు)తో సంబంధాలు పెట్టుకుని రష్యా 2017 నుండి సూడాన్‌లో తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నది. సూడాన్ సైనిక నాయకత్వాన్ని, ఆర్ఎస్ఎఫ్‌ను లోబరుచుకుని, కిరాయి హంతక ముఠాలను వాడుకుని అక్కడి సహజ వనరులను కొల్లగొట్టాలని రష్యా చూస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఆర్ఎస్ఎఫ్‌కు రష్యా క్షిపణులు అందిస్తున్నదని వార్తలు కూడా వచ్చాయి.

ఒకవైపు పోర్ట్ సూడాన్‌లో నావికా స్థావరం ఏర్పాటుకు రష్యా (ఐరోపాకు ఇంధన సరఫరా కోసం అవసరం) ప్రయత్నాలు చేస్తున్నది. మరోవైపు సూడాన్‌లోని బంగారపు గనుల కోసం అమెరికా ఆరాటపడుతున్నది. రెండూ ఎవరి పక్షానికి వారు అధికారాన్ని కైవశం చేసుకోవడానికి అక్కడ సైనిక ఘర్షణలలో తమ వంతు పాత్ర అవి పోషిస్తున్నాయి.

పారా మిలటరీని మిలటరీలో విలీనం చేసే దగ్గర మొదలైన ఆధిపత్య పోరులో ప్రజలు నలిగిపోతున్నారు. అమెరికా, సౌదీ అరేబియా ప్రతిపాదన మేరకు సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో ప్రతినిధుల మధ్య పరస్పరం నిర్ణయించుకున్న చర్చలు జరిగాయి.

సూడాన్‌లో మే మధ్యలో వారం రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా వారు ఉల్లంఘించారు. ఘర్షణల్లో ఇప్పటికే వేలాది మంది చనిపోయారు. లక్షకు పైగా ప్రజలు ప్రాణాలు కాపాడుకోవడానికి వలసపోతున్నారు. ఐక్యరాజ్య సమితి చెబుతున్నదాని ప్రకారం 7 లక్షల మంది పౌరులు నిర్వాసితులయ్యారు. రాజధాని ఖార్టూమ్ పరిసర ప్రాంతాలు ఆర్.ఎస్.ఎఫ్. ఆధీనంలో ఉండడంతో సైన్యం వైమానిక దాడులు కొనసాగిస్తున్నది. ఆర్.ఎస్.ఎఫ్. క్షిపణులు ఉపయోగిస్తున్నది. బ్యాంకులు, ఏ.టి.యం.లు పనిచేయడం లేదు. చమురు కొరత, ధరల పెరుగుదలతో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు.

సాయుధ ఘర్షణలు కొనసాగించడంలో ఇరు వైపుల పరస్పర ప్రయోజనాలు ఉన్నాయి. సూడాన్‌కున్న భౌగోళిక ప్రాధాన్యత రీత్యాను, అక్కడున్న అపారమైన ఖనిజ సంపద కోసం ప్రాంతీయ ఆధిపత్య శక్తులు, ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులు ఘర్షణల అనంతర ఫలితాల కోసం కనిపెట్టుకుని చూస్తున్నాయి.

ఈ సంక్షోభం నుండి సూడాన్ దేశం బయట పడాలంటే విప్లవ ప్రజలు కార్మిక వర్గ పార్టీ నాయకత్వంలో సమైక్యంగా పోరాడి దోపిడీ వర్గాలను, వారి సాయుధ బలగాలను ఓడించాలి. సామ్రాజ్యవాదుల ఆటలు సాగకుండా దృఢంగా పోరాడాలి. ★

**"పార్టీ రహస్యంగా వుంటూ చట్టబద్ధ కార్యకలాపాలన్నీ విప్లవ పార్టీ పని విధానంలో అత్యంత ముఖ్యమైన అంశాలలో ఒకటి. అన్ని స్థాయిల పార్టీ సభ్యులూ ఈ కళపై పట్టు సంపాదించాలి. చట్టబద్ధ, రహస్య నిర్మాణాల, కార్యకలాపాల సమన్వయంలోనే విప్లవకారులకు అత్యంత గందరగోళం వుండి అనేక పొరపాట్లు చేస్తారు"–లెనిన్**

# కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపు

## కర్ణాటకలో అక్రమ పద్ధతుల్లో అధికారంలోకి వచ్చి, అవినీతిమయంగా పాలించిన మతోన్మాద బీజేపీ కలలు నెరవేరలేదు

2023 మే 10న ఎన్నికలు జరిగి, మే13న ఎన్నికల ఫలితాలను ప్రకటించిన కర్నాటక రాష్ట్ర 16వ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలలో గెలుపొందింది. అధికారంలో ఉన్న బీజేపీ 116 స్థానాల నుండి 66 స్థానాలకు (30 శాతంకు) తగ్గి అధికారం కోల్పోగా, 69 స్థానాలున్న కాంగ్రెస్ పార్టీ 135 స్థానాలు (60 శాతం) గెలుపొంది అధికారాన్ని చేజిక్కించుకుంది.

దక్షిణ భారతదేశంలో బీజేపీకి అధికారం ఉన్న కర్నాటక రాష్ట్రంలో అది ఘోరంగా ఓటమి చెందడంతో మతోన్మాద హిందుత్వ శక్తులలో నిరాశ, నిస్పృహలతో కూడిన ద్వేషం ఆవరించి వుంది. బీజేపీ గతం నుండి అనుసరిస్తున్న మత ప్రాతిపదికన ప్రజలను విభజించడం, కుల వివక్ష రాజకీయాలు, హింసా దౌర్జన్యాల పాచికలు పని చేయలేదు. మోదీ వికాస్ కరిష్మా, డబుల్ ఇంజన్ పాలన నినాదాలు పని చేయకుండా పోయాయి. బీజేపీ అగ్రశేణి నాయకులు కట్టకట్టుకు వచ్చినా, ఆరెస్సెస్ కార్యకర్తలు రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించినా, బెంగళూరు, మైసూరులలో మోదీ సభలకు కాసులతో జనాలను తరలించి బల ప్రదర్శనలు చేసినా అనుకున్న ఫలితాల నివ్వలేదు. 3 గ్యాస్ సిలిండర్లు, రోజూ అరలీటరు పాలు. 5 కేజీల బియ్యంతో పాటు 103 హామీలు ఇచ్చినా మెజారిటీ కర్నాటక ప్రజలకు బీజేపీ ఉచితాలపై నమ్మకం కలగలేదు. కర్నాటకలో ఎన్నికలకు ముందు జరిపిన సర్వేలోనే బీజేపీ అద్వాన్న పాలన గురించి ప్రజలు సూటిగా చెప్పారు.

సంయుక్త కిసాన్ పంచాయత్ ఆధ్వర్యంలో రైతులు బెంగళూరులో సమావేశమై కర్నాటకలో బీజేపీని ఓడించాలని శపథం చేశారు. ఈ సమావేశంలో 20 రైతు సంఘాల నుండి 250 మంది రైతు నాయకులు పాల్గొన్నారు. బీజేపీ కేంద్ర నాయకత్వానికి కర్నాటక రాష్ట్రం వలస ప్రాంతంగా మారిందని సమావేశం విమర్శించింది. 'నందిని' సంస్థ పరిధిలో 15 వేలకు పైగా పాల ఉత్పత్తి సహకార సంఘాలు, 60 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయని, మోదీ, అమిత్‌షా ఇద్దరూ వాణిజ్య ప్రయోజనాల కోసం నందిని సంస్థను అముల్ కార్పొరేట్ సంస్థలో విలీనం చేయాలని చూస్తున్నారని, ఇది రైతు వ్యతిరేక నిర్ణయమని రైతు నాయకులు విమర్శించారు.

2021లో దేశవ్యాప్తంగా 10,881 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో కర్నాటక రైతులు 2,082 మంది ఉన్నారు. ముఖ్యంగా బెంగాలీ ప్రాంతం నుండి 200, మైసూరు ప్రాంతం నుండి 191 మంది ఉన్నారు. మృత రైతుల కుటుంబాల గురించి కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం సానుభూతి, శ్రద్ధ చూపడం లేదు.

కర్నాటక రాష్ట్రంలో బీజేపీ అన్ని రంగాలలోను విఫలమయ్యింది. 40శాతం కమీషన్ ప్రభుత్వంగా బహిరంగా గుర్తింపు పొంది అవినీతి రాజ్యమేలింది. ఈ ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు (ఆంటీ ఇంకుంబెన్సీ) కాంగ్రెస్‌కు బాగా ఉపకరించింది.

ముస్లింలకు ఉన్న 4శాతం రిజర్వేషన్‌ను రద్దు చేయడం, హిజాబ్, లవ్ జిహాద్ వివాదాలను రెచ్చగొట్టడం, ఆలయాల దగ్గర ముస్లింలు వ్యాపారాలు చేయకూడదనడం, హలాల్ చేసిన మాంసం అమ్మకాలపై ఆంక్షలు విధించడం, కర్ణాటక ప్రజాభిమానాన్ని చూరగొన్న మైసూర్ రాజు టిప్పు సుల్తాన్ పట్ల వ్యతిరేకత అన్నీ ప్రజలలో చీలికలు తెచ్చి, బీజేపీ ఓట్లు రాబట్టుకునే హిందుత్వ రాజకీయాలు ఈసారి అడ్డం తిరిగాయి. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల నుండి ముందుకు తెస్తున్న ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్) బెడిసి కొడుతోంది.

మోదీ – అదానీల హంతక విధానాలు, కుంబకోణాలు బయటపడిన తర్వాత వేగంగా మోదీ గ్రాఫ్ పడిపోవడంతో పాటు, ఆరెస్సెస్ హిందుత్వ ఎజండాకు పట్టం కట్టడం, మోదీ పరమ నియంతృత్వ పాలన చూస్తున్న ప్రజలు డబుల్ ఇంజన్ పాలనను డబుల్ డిజాస్టర్ పాలన అంటున్నారు. బీజేపీలో అసమ్మతి, అసంతృప్తి పెరిగి అంతర్గత కుమ్ములాటలు కర్నాటక ఎన్నికలలో అనేక రూపాలలో పనిచేసి దాని ఓటమికి ఒక కారణమయ్యాయి.

2018 ఎన్నికల్లో మొత్తం 224 స్థానాల్లో బీజేపీ 104, కాంగ్రెస్ 80, జేడీయస్ 37 స్థానాలను గెలుచుకున్నాయి. ఆనాడు రాష్ట్రంలో బీజేపీకి మెజారిటీ రానప్పటికీ కేంద్రంలో అధికారంలో ఉండడంతో దాని కనుసన్నలలో గవర్నర్ రాచకీయాలతో బీ.యస్ యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు. కానీ బలపరీక్షలో మాత్రం నెగ్గలేకపోయాడు. దానితో హెచ్.డీ. కుమారస్వామి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్, జెడీయస్‌లతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. అయితే సంకీర్ణ ప్రభుత్వం బీజేపీ కుట్రలకు (ఆపరేషన్ కమల్‌కు) బలి కావడంతో అధికారం కోల్పోయింది. బీజేపీ కొనుగోలు చేసిన ఎమ్మెల్యేల బలంతో తిరిగి యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా పగ్గాలు అందుకున్నాడు. రెండేళ్ళకే యడ్యూరప్ప ప్రభుత్వం అవినీతి ప్రభుత్వంగా ప్రజా వ్యతిరేకతను

మూటగట్టుకోవడంతో బీజేపీ అధిష్ఠానం 2021లో యడ్యూరప్పను తొలగించి కొత్త సిఎమ్‌గా బస్వరాజు బొమ్మైను ప్రతిష్టించారు.

బొమ్మై అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి హిందూ మతోన్మాదాన్ని, ముస్లిం వ్యతిరేకతను విస్తృతం చేసి హిందూ ఓటర్లను గెలుచుకోవడానికి వ్యూహాత్మకంగా చాలా ప్రయత్నించాడు. కానీ ఆ పథకాలేవీ పని చేయక పోవడంతో గతంలో వచ్చిన సీట్లు కూడా నిలబెట్టుకోలేక పోయాడు. యడ్యూరప్ప, బొమ్మై ప్రభుత్వాలు అనుసరించిన ప్రజా వ్యతిరేక, హిందుత్వ ఫాసిస్టు విధానాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి పరోక్షంగా దోహదం చేశాయి.

కర్నాటకలో మొదటి నుండి బీ.జే.పీ.కి ఓటమి భయం వెంటాడుతోంది, కేంద్రం నుండి నిధులు గుమ్మరించారు. రాష్ట్రంలో అన్ని రకాల కాంట్రాక్టు పనులలో నుండి 40 శాతం కమీషన్ బీజేపీ నాయకులు దబ్బులు దండుకున్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన 'విరాళాలు' కూడా పుష్కలంగా ఉండడంతో దబ్బులు, సారా, ఉచితాలు ఓటర్లను మభ్య పెట్టడానికి ఫుల్‌గా పంచారు, ఎన్నో ఆశలు చూపించారు. 103 హామీలతో ఎన్నికల ప్రణాళిక విడుదల చేశారు. కులాలను చీల్చి, ద్వేషాన్ని రగిలించి, మతం మంటలు రేపి, మెజారిటీ మతం పేరుతో లాభపడాలని, ఎన్నికలలో గెలవాలనీ చేయని నేరాలు లేవు.

ప్రధాని మోదీ, గృహమంత్రి అమిత్‌షా, పార్టీ అధ్యక్షుడు జగత్ సింగ్ నడ్డా, ఇంకా ఎందరో కేంద్ర మంత్రులు, ఛోటా బఢా నాయకులు మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ఆశీర్వాదాలతో కేంద్రీకరించి పని చేశారు. ముమ్మరంగా ప్రచారం చేశారు. మోదీ ప్రధాని అనేది మరిచిపోయి రాజ్యాంగానికి విరుద్ధంగా 'జై భజరంగ్ బలి' అంటూ బహిరంగ సభలలో కేకలేస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి నిస్సిగ్గుగా ప్రయత్నించాడు. ఇంకా ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టడానికి అర్ధ సత్యాలు, అసత్యాలతో నిండిన 'కేరళ స్టోరీ' సినిమాను కావాలనే ఓట్ల కోసం ఆకాశానికి ఎత్తాడు. ఉగ్రవాదులతో సంబంధాలున్నాయని, కర్నాటక రాష్ట్రాన్ని విడగొడతారని ప్రతిపక్షాల మీద ఎప్పటిలాగే అబద్దాల పంచాంగాన్ని విప్పాడు. ఇదే సమయంలో మణిపూర్‌లో జాతి విద్వేషాల్లో 70 మంది జనం హత్యగాడం, వేలాది మంది నిరాశ్రయులు కావడం జరిగినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించిన ప్రధాని ఇక్కడ మత విద్వేష రాజకీయాలతో ఎన్నికల ప్రచారం నడపడంలో శల్య సారధ్యం వహించాడు.

2018 కర్నాటక ఎన్నికలలో 10 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడితే ప్రస్తుత ఎన్నికలలో దానికి 4 రెట్లు అంటే 40 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టారని, ఇందులో ప్రధానంగా బీ.జే.పీ. ఖర్చు చేసింది అత్యధికమని ఎన్నికల విశ్లేషకులు చెబుతున్నారు. ఎన్నికలు ఎంత ఖరీదవుతు న్నాయో, ప్రజాధనం ఎంత ఉత్పత్తి రంగం నుండి అనుత్పాదక (రాజకీయ) రంగానికి ఏ విధంగా బదిలీ అవుతున్నదో చూస్తే నేటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎన్నికల జూదం మినహా మరకటి కాదన్నది స్పష్టం.

గతంలో కాంగ్రెస్ పార్టీ తలకెత్తుకున్న సామ్రాజ్యవాద దోపిడీ విధానాలను కర్నాటకలో బీ.జే.పీ. అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత దూకుడుగా అమలు చేసినా, ఒక దశలో సమాజం ఎదుర్కొన్న శాంతి భద్రతల సమస్య, మతపర ద్వేషం ఒక సెక్షన్ కార్పొరేట్ శక్తులకు కూడా సమస్యాత్మకం అయ్యిందన్నది నిజం, ఆ సమయంలో పారిశ్రామిక సంస్థలు, ఐటి రంగం బెంగళూరు నుండి హైదరాబాద్ లేదా చెన్నైకు తమ సంస్థలను తరలిస్తామని కూడా హెచ్చరించాయి. మత విద్వేష రాజకీయ వాతావరణంలో తమ వ్యాపారాలను కొనసాగించలేమని కార్పొరేటు శక్తులు భయపడ్డాయి కూడా.

మరో పక్కన పౌర సమాజంలో పని చేస్తున్న 102 ప్రజా సంఘాలు కలిసి కట్టుగా 'మేలుకో కర్నాటక' నినాదంతో 103 నియోజక వర్గాలలో 5 వేల మంది కార్యకర్తలు 192 బృందాలుగా ఏర్పడి "విద్వేష రాజకీయాలకు మద్దతు ఇవ్వ వద్దు" అని విస్తృతంగా ప్రజలలో ప్రచారం చేశారు. అందులో భాగంగా 250 వర్క్‌షాపులు నిర్వహించి వివిధ రూపాలలో బీజేపీ వ్యతిరేక ప్రచారం చేశారు. దీని ప్రభావం ప్రత్యక్షంగా ఓటర్ల మీద బలంగా పడింది. దీనికి తోడుగా దేవనూరు మహదేవ్ రాసిన "ఆర్.ఎస్.ఎస్. లోతు పాతులు" అనే పుస్తకం లక్షల కాపీలు అమ్ముడయ్యింది. పరోక్షంగా దాని ప్రభావం కూడా పౌర సమాజం మీద ఉన్నది.

కాంగ్రెస్ పార్టీ స్థానిక సమస్యల మీద దృష్టి పెట్టి ప్రచారం చేయడంతో పాటు, బీ.జే.పీ. అవినీతి పాలన గురించి వివరంగాను, వారు అనుసరించిన మత విద్వేష రాజకీయాల గురించి ముమ్మరంగాను అన్ని చోట్ల సభల్లో బహిరంగ పరచడంతో పాటు నిరుద్యోగ భృతి, పేదలకు ఆహారం, ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం లాంటి హామీలను ఇచ్చింది. భజరంగ్‌దళ్‌ను నిషేధించడం కూడ తన ఎన్నికల ప్రణాళికలో ప్రస్తావించింది.

గతంలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్, జే.డీ.(ఎస్) మధ్య చీలి పోవడంతో కాంగ్రెస్‌కు సీట్ల సంఖ్య తగ్గింది. ఇప్పుడు మెజారిటీ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్‌కు రావడంతో కాంగ్రెస్‌కు 55 సీట్లు పెరిగాయి. ఆ మేరకు బీ.జే.పీ.కి అధికంగాను, జే.డీ.(ఎస్) కు స్వల్పంగాను సీట్లు తగ్గాయి.

బీ.జే.పీ.కి చెందిన 22 మంది కేబినేట్ మంత్రుల్లో సగానికిపైగా ఓటమి పాలయ్యారు. హిజాబ్ వివాద సూత్రదారి, విద్యామంత్రి బీ.సీ నగేశ్ ఓటమి పాలయ్యాడు. లింగాయత్‌లు మెజారిటీ ఉన్న 67 నియోజకవర్గాల్లో 42 కాంగ్రెస్ గెలుచుకుంది. ఎస్.టి రిజర్వ్‌డ్ నియోజక వర్గాలలో బీ.జే.పీ.కి ఒక్క సీటు కూడా రాలేదు. ఎస్.సీ. కోటాలో గెలిచిన వారు మెజారిటీ కాంగ్రెస్ అభ్యర్థులే ఉన్నారు. గెలిచిన ముస్లిం అభ్యర్థులలో కాంగ్రెస్‌కు చెందిన వారే అధికం. మొత్తంగా ఈసారి కర్నాటక ఎన్నికలలో ముస్లిం మైనారిటీతో పాటు ఎస్.సీ., ఎస్.టీ., బీ.సీ. సెక్షన్ల ఓట్లు మెజారిటీ కాంగ్రెస్‌కు వేసినట్లు

# మణిపూర్‌లో తెగల మధ్య చిచ్చు రేపుతున్న హిందుత్వ రాజకీయాలు

ఈశాన్య రాష్ట్రాలలో మణిపూర్ ఒకటి. మణిపూర్‌లో 53శాతం మొయితీలకు, కుకీలు, ఇతర గిరిజన జాతులకు మధ్యన భారత పాలక వర్గాలు రిజర్వేషన్ చిచ్చు పెట్టి, ఘర్షణలు సృష్టించాయి. పరిస్థితి విషమించిందనే పేరుతో ఇప్పుడు కన్పిస్తే కాల్చివేతకు గవర్నర్ ఉత్తర్వు లను జారీచేశారు.

ఇప్పుడు మొయితీ తెగవారు తమను షెడ్యూల్డ్ జాతుల్లో చేర్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వారిని షెడ్యూల్డ్ జాతుల్లో చేర్చితే తమకు ప్రస్తుతం లభిస్తున్న సదుపాయాలు తగ్గిపోతాయని కుకీలు, ఇతర ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత తమ ఉద్యోగావకాశాలు దెబ్బతింటాయని నిరసన వ్యక్తం చేస్తున్నారు. వారికి మద్దతుగా ఐదు విద్యార్థి సంఘాలు రంగంలోకి దిగడంతో ఉద్యమం సమరశీల స్వభావాన్ని సంతరించుకుంది. ప్రభుత్వ చర్యలకు నిరసనగా ప్రభుత్వ ఆస్తులను ఆందోళనకారులు దగ్ధం చేశారు. పోలీసు చర్యలతో భయోత్పాతానికి గురైన వేల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. హిందుత్వ శక్తులతో పాటు లంపెన్ శక్తులు సృష్టిస్తున్న వదంతులు, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఘర్షణలు దావానలంలాగా వ్యాపిస్తున్నాయి. మణిపూర్‌లో గతంలో జరిగిన ఘర్షణలకు వీటికి చాలా తేడా ఉన్నది. ఈశాన్య భారతదేశంలో హిందుత్వ ఫాసిస్టు శక్తులు తమ పట్టును పెంచుకోవడానికే పథకం ప్రకారం ఘర్షణలకు ఆజ్యం పోసి వ్యాపింప జేస్తున్నారు.

అసోం రైఫిల్స్, ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ప్రత్యేక విమానాలలో రాజధాని ఇంఫాల్‌కు చేరాయి. ముఖ్యమైన ప్రాంతాలన్నిటిని భద్రతా బలగాలు తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి. పలు ప్రాంతాలలో కర్ఫ్యూ విధించడం వల్ల నిత్యావసర సరుకులు దొరకక ముఖ్యంగా పేద, మధ్యతరగత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

మణిపూర్‌లో 90 శాతం అడవులతో కూడిన కొండ ప్రాంతాలే ఉన్నాయి. లోయలు, సెలయేళ్ళు, కొండల మధ్య వివిధ ఆదివాసీ ప్రజా సమూహాలు రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్డ్ ప్రకారం అటానమస్ హక్కులతో జీవించాలి. కానీ ఆ ప్రజల మధ్యన పాలకవర్గాల స్వార్థ రాజకీయ ప్రయోజనాల రీత్యా నిత్యం అనుమానాలు, భయాలు, విద్వేషాలు చోటుచేసుకుంటూ తరచుగా ఘర్షణలకు, నష్టాలకు కారణం అవుతున్నాయి. తాజాగా చెలరేగిన మంటలకు కారణం బీ.జే.పీ. ప్రభుత్వమే. మొయితీ తెగను ఎస్.టీ.ల్లో చేర్చేందుకు వీలుగా కేంద్రానికి సిఫార్సు చేయమని మణిపూర్ హైకోర్టు ఏప్రిల్ 20న రాష్ట్ర ప్రభుత్వానికి సలహా (ఆదేశం) ఇచ్చింది. దానిపై కుకీ, నగ, ఇతర తెగల ప్రజలకున్న అభ్యంతరాలే స్పష్టమవుతున్నది.

---

కేంద్రంలో అధికారం ఉన్నా (డబుల్ ఇంజన్), అంగబలం (సంఘ్ ముఠా)దండిగా ఉన్నా, అర్థ బలాన్ని ఎంత ప్రయోగించినా, మత, కుల, ప్రాంతీయ విద్వేషాలతో విచ్ఛిన్నకర రాజకీయాలు నడిపినా బీ.జే.పీ.కి కర్నాటకలో ఓటమి తప్పలేదు. మోదీ ముఖం చూసి కూడా ఓటర్ మహాశయులు ఓట్లు వేయలేదు. రాష్ట్రంలో బీ.జే.పీ.కి మాత్రమే కాకుండా కేంద్రంలోని బీ.జే.పీ.కి కూడా ఇక్కడ వ్యతిరేకతనే కనబడింది. కాబట్టి బీ.జే.పీ.కి వ్యతిరేకంగా కర్నాటక ఎన్నికల ఫలితాల ప్రభావం రాబోయే 5 రాష్ట్రాలు – మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గడ్, తెలంగాణ, మిజోరం ఎన్నికలపై ఉంటుందని, 2024 సార్వత్రిక ఎన్నికలపై కూడ ఉంటుందని విశ్లేషకులు అంచనాలు అందిస్తున్నారు. రాబోయె లోక్‌సభ ఎన్నికలలో బీ.జే.పీ. పార్లమెంటు సీట్లు కూడా కర్నాటకలో గణనీయంగా తగ్గవచ్చని కూడా ఊహాగానాలు చేస్తున్నారు. కనీసం ఎన్నికల సందర్భంగానైనా కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటలు వదలి సాధించిన 'ఐక్యత' ఒక అనుకూలాంశం కాగా, బీ.జే.పీ. కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు కర్నాటకలో 4 సంవత్సరాల కాలం పాటు ప్రజా వ్యతిరేక పాలనను అందించిన దుష్ఫలిత పరిణామమే కాంగ్రెస్ పార్టీ గెలుపు వెనుక దాగిన అసలు 'మంత్రం' అనేది మరో వాస్తవం.

కాంగ్రెస్ పార్టీ కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి దిల్లీ ఆశిస్సులతో గొడవలు సర్దుకొని సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక చరిత్ర ప్రజలకు కొత్త కాదు. అది కూడా ఒక నియంతృత్వ పార్టీ. సామ్రాజ్యవాద అనుకూల భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గ పార్టీనే. కర్నాటక రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీపైన కూడా అవినీతి ఆరోపణలు, అనైక్యత, ఆధిపత్య పోరు, ప్రజా వ్యతిరేక విధానాలు, ఆశ్రిత పక్షపాతం లాంటి దుర్లక్షణాలు పుష్కలంగానే ఉన్నాయి. అయినా కాంగ్రెస్‌ను ప్రజలు ఎందుకు ఎన్నుకున్నారంటే అంతకు మించిన సరైన పార్లమెంటరీ ప్రత్యామ్నాయం లేకనే!

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వార ఒక దోపిడీ ముఠాను ఓడించి మరో దోపిడీ ముఠా అధికారంలోకి రావడం మాత్రమే జరుగుతుంది. అది అమెరికా అయినా, భారతదేశం అయినా అంతే. ఈ పార్లమెంటరీ వ్యవస్థలోనే (విష వలయంలోనే) చిక్కుకుని పరిష్కారం వెదికితే దారి దొరకదు. పార్లమెంటరీ పార్టీలన్ని దోపిడి వర్గ పార్టీలే. ఎన్నికల ప్రజాస్వామ్యమే బూటకపు ప్రజాస్వామ్యం. కార్మికవర్గపార్టీ నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా ఈ దోపిడీ వర్గాలను కూల్చి ప్రజారాజ్యం ఏర్పాటు చేయడం ద్వారానే ప్రజల ప్రజాస్వామ్యం సాధ్యమవుతుంది. ★

తాజ ఘర్షణలకు ప్రధాన కారణం. మణిపూర్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ మెజారిటీ ప్రజల ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆడుతున్న నాటకంలో భాగంగానే ఈ కుట్ర జరిగి వివిధ తెగల మధ్య విద్వేషం రగుల్కోంది.

కుకీ, నగ, ఇతరులకు ఎస్.టీ. హోదా ఉంది. కొండ ప్రాంతాలలోని భూములపై అక్కడి ఆదివాసులకు మాత్రమే హక్కు ఉన్నది. మైదాన ప్రాంతాల వారు వాటిని కొనడానికి వీలు లేదు. మణిపూర్‌లోని 10 శాతం మైదాన ప్రాంతంలో ఉన్న 53 శాతం మొయితీలలోని సంపన్న వర్గాలు రాజకీయాలతో పాటు అన్ని రంగాలలో ఆధిపత్యం కలిగి, కొండ ప్రాంతాలకు కూడా తమ ఆధిపత్యాన్ని విస్తరించాలని చూస్తున్నారు.

మణిపూర్‌లో అల్లర్లు చెలరేగుతున్న సమయంలో మే 9న కుకీ తెగకు చెందిన బీ.జే.పీ. ఎమ్.ఎల్.ఏ. పావోమిన్‌లాన్ హావోకిప్ చేసిన ప్రకటన, ఇంటర్వ్యూలో చేసిన ఆరోపణకు సమాధానంగా మొయితీల అభ్యర్థన మేరకు 'ది వైర్' వార్తా సంస్థ ఏర్పాటు చేసిన ఇంటర్వ్యూలో కరణ్ థాపర్‌తో మొయితీ తెగకు చెందిన స్వతంత్ర ఎమ్.ఎల్.ఏ., అసెంబ్లీలో ప్రత్యేక హక్కులు, అధికారాల కమిటీ చైర్మన్ నిశికాంత్ సహామ్ మాట్లాడాడు. ఆయన కూడా ఇంఫాల్‌లో సీ.ఎమ్. బైరన్‌సింగ్ ప్రభుత్వాన్ని సమర్ధించినవాడే!

మణిపూర్‌ను విభజించడాన్ని మొయితీలు అంగీకరించరన్నాడు. ఈ విభజన డిమాండ్ కుకీ తెగకు చెందిన 10 మంది ఎమ్.ఎల్.ఏ.లదేననీ, అందులో 7గురు బీ.జే.పీ.కి చెందిన వారు ఉన్నారనీ, ఇద్దరు మంత్రులున్నారనీ చెబుతూ, ఆ విభజన అసెంబ్లీలో మణిపూర్ సమగ్రతను కాపాడుతామని చేసిన ప్రమాణానికి విఘాతం కల్పించడమని అన్నాడు. కుకీలకు ప్రత్యేక రాష్ట్రం లేదా యూనియన్ టెర్రిటరీ (కేంద్ర పాలిత ప్రాంతం) అనే డిమాండ్‌కు తాము వ్యతిరేకమని బలంగా చెప్పాడు.

మొయితీ ప్రజలకు రెండు విషయాలలో అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఒకటి జనాభాలో మొయితీలు 53 శాతం ఉన్నప్పటికి మొత్తం భూభాగంలో 10 శాతంగా ఉన్న మణిపూర్ లోయ ప్రాంతానికే వాళ్లను పరిమితం చేస్తున్నారు. 90 శాతం భూభాగంలో మాకు భూములు కొనుగోలు చేయడానికి అవకాశం లేకుండా ఆంక్షలు విధి స్తున్నారు. కానీ కుకీలకు అదనంగా లోయలో కూడా భూములున్నాయి. మొయితీలకు బలంగా ఉన్న అభిప్రాయం కూడా ఏమిటంటే కుకీల జనాభా శాతం పెరుగుతున్నది. మయన్మార్ నుండి అక్రమ వలసలు జరుగుతున్నాయి. కనుక "నేషనల్ రిజిష్టర్ ఫర్ సిటిజన్‌షిప్" (ఎన్.ఆర్.సీ.) మణిపూర్‌కు అవసరమని, అలా చేస్తే అక్రమ చొరబాట్లను గుర్తించి వారిని తిరిగి మయన్మార్‌కు పంపవచ్చని మాట్లాడాడు. 1950లలో మణిపూర్ భారత దేశంలో బలవంతంగా విలినం చేసుకున్న నాటి నుండి కొనసాగుతున్న శత్రుత్వం వారిలో సుదీర్ఘంగా ఉన్న అపనమ్మకాలకు కారణం.

మణిపూర్‌లో భూమి సమస్య కీలక సమస్య, దానితో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు మొయితీలకు దక్కడం లేదనీ భూమి సమస్యతో పాటు ఉద్యోగాల నేపథ్యంలో మొయితీలకు ఎస్.టీ. రిజర్వేషన్ అవకాశం కూడా కల్పించాలనే డిమాండ్ ముందుకు వచ్చిందన్నాడు.

మణిపూర్ రాజకీయాలలోను, ప్రభుత్వ యంత్రాంగంలోను మొయితీలకు ప్రధాన భూమిక ఉందని ఆరోపిస్తు, వారికి ఎస్.టీ. రిజర్వేషన్ కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ కుకీ, నగా, ఇతర తెగల ప్రజలు మొయితీలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. ఇరుపక్షాల మధ్య ఇది శతృత్వంగా మారి మారణకాండకు, విధ్వంసానికి దారి తీస్తోంది.

గత 7 దశాబ్దాలుగా మణిపూర్ జాతి వైషమ్యాలతో అట్టుడికి పోతుంది. ఈశాన్య రాష్ట్రాలలోని అత్యధిక ప్రాంతాలు 'ఆఫ్‌స్పా' (సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం) కిందనే మగ్గిపోతున్నాయి. దీనిని పరిష్కరించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా ఉంది. సామాజిక శాంతిని భగ్నం చేస్తున్నది. ఈశాన్య భారతంలో అనేక వినాశకర పరిణామాలకు ఆఫ్‌స్పా ఒక ముఖ్య కారణంగా వుంది. మణిపూర్ ప్రజలు, ఈశాన్య జాతుల ప్రజలు ఐక్యమై పోరాడి హిందుత్వ ఫాసిస్టు శక్తుల దుష్ట పథకాలను ఓడించాలి. తాజా ఘర్షణల్లో ఇప్పటికే 70 మంది చనిపోయారు. 35వేలకు పైగా నిరాశ్రయులైనారు. మణిపూర్ భగ్గు మంటు, కలకలం రేపుతోంది. ఇది జాతివైరంగా కనబడుతున్నప్పటికి, వాస్తవంగా ఇది కొండ ప్రాంతాలకు మైదాన ప్రాంతాలకు మధ్య నున్న అసమానతల (అఘాధాల) ఫలితం. పాలకవర్గాలు అసమానతలను తొలగించే ప్రయత్నాలు చేయకుండా వాటిని వాడుకుంటూ ఆ వైరుధ్యాలను వైషమ్యాలుగా మారుస్తున్న ఫాసిస్టు హిందుత్వ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను ప్రజలు ఐక్యంగా ఎండగట్టాలి, ఓడించాలి.

కశ్మీర్‌లో ఆర్టికల్ 370 ని రద్దు చేసిన తర్వాత అక్కడ కశ్మీరీ ప్రజల భూములకున్న రక్షణ హక్కులను తొలగించిన కేంద్రంలోని బీ.జే.పీ. ప్రభుత్వం అభివృద్ధి, పర్యాటకం పేరుతో కశ్మీర్ ప్రజల భూములను కార్పొరేట్ సంస్థలకు, సినీ రంగ పెట్టుబడులకు కట్టబెడుతున్న విషయం తెలిసిందే. మణిపూర్‌లో బీ.జే.పీ. అల్లర్లను సృష్టించి తద్వార ప్రజల మధ్య ఏర్పడే విభేదాలను వినియోగించుకుని అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి, ఈ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి ప్రయత్నిస్తున్నది.

మణిపూర్ అల్లర్ల వెనుక ఉన్న బీ.జే.పీ. కుట్రలకు వ్యతిరేకంగా మణిపూర్ ప్రజలు, ఈశాన్య జాతుల ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది. కార్మికవర్గం నాయకత్వంలో జాతులు స్వయం నిర్ణయాధికార హక్కు సాధించే వరకు ప్రజలకు నిజమైన ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం లభించదు.

★

"క్రాంతి పత్రిక రెగులర్‌గా చదవండి. చదివించండి. చందాదారులను చేర్పించండి. కార్మికవర్గ అగ్రగామి దళ పత్రికను కాపాడుకోండి. పత్రికపై పాఠకుల అభిప్రాయాలను, విమర్శలను తప్పక పంపండి"

# సుదీర్ఘ విప్లవ జీవితానికి చరమగీతం పాడి సైద్ధాంతికంగా-రాజకీయంగా పతనమైన గజ్జెల సత్యం రెడ్డి అలియాస్ గోపన్న పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నాం

నల్లగొండ జిల్లా, సుబ్బారెడ్డి గూడెం గ్రామానికి చెందిన గజ్జెల సత్యం రెడ్డి గోపన్న పేరుతో 25 సంవత్సరాల పాటు దండకారణ్య విప్లవోద్యమంలో పనిచేసి, ఆ ఉద్యమ ఉన్నత కమిటీ 'దండకారణ్యయ స్పెషల్ జోనల్ కమిటీ' సభ్యుడిగా ఎదిగాడు. 2006లో అరెస్టయి 17 సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు జైలు జీవితాన్ని అనుభవివించి ఇటీవల మార్చి 24 న విడుదలయ్యాడు. అయితే ఎన్ని కఠిన పరీక్షలు ఎదురైనా జీవితాంతం విప్లవోద్యమంలో దృఢంగా నిలబడడం అనే విప్లవ నిబద్ధతకు నీళ్లొదిలి పార్టీకి, ప్రజలకు ద్రోహం చేశాడు. కటకటాల నుండి విడుదలైన తర్వాత అర్.టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూ ద్వారా ఆయన తన లొంగుబాటునూ, రాజకీయ పతనాన్నీ నిస్సిగ్గుగా బయటపెట్టుకున్నాడు.

విప్లవ కమ్యూనిస్టు సిద్ధాంత-రాజకీయాలకు తిలోదకాలు ఇచ్చి, విలువలూ, ఆదర్శాలనూ తుంగలోతొక్కి తన సుదీర్ఘ విప్లవ జీవితానికి సైతం పరమ స్వార్థంతో తలవంపులు తెస్తూ జీవచ్ఛవంలాంటి శేష జీవితాన్ని గడుపడం కోసం దోపిడీ పాలకవర్గాల ముందు ప్రాణతీపితో ఎంగిలి మెతుకులకు దేబరించాడు. ఆత్మ వంచనతో నిరంకుశ పాలకవర్గాలను కీర్తించాడు. సత్యం రెడ్డి దిగజారుడును దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ తీవ్రంగా అసహ్యించుకుంటూ ఆయన పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తోంది.

తెలిసీ తెలియని వయసులో, ఆ వయసులో వుండే జోష్ (ఉత్సాహం)లో పరిస్థితులను సరిగా అర్థం చేసుకోకుండా విప్లవోద్యమంలోకి వెళ్లానని ఆయన చెప్పడం తనను తాను మోసగించుకోవడమే! ఇలా చెప్పడం ద్వారా అమాయకులను విప్లవోద్యమంలో చేర్చుకుంటున్నారని పాలకవర్గాలు చేస్తున్న దుష్ప్రచారానికి ఆయన వంత పాడుతున్నాడు. అర్థం చేసుకోకుండానే ఉద్యమంలో చేరి 25 ఏళ్ల పాటు పనిచేశానని చెప్పుకోవడం ద్వారా ఆయన తన సుదీర్ఘ విప్లవ చరిత్రను రద్దుచేసుకోవడమే కాదు ఆత్మ వంచనతో తనను తానే అపహాస్యం చేసుకున్నాడు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సొమ్ము చేసుకొని అధికారంలోకి వచ్చిన టీ.ఆర్.ఎస్. (కేసీఆర్) ప్రభుత్వం, తన వాగ్దానాలను బుట్టదాఖలా చేస్తూ ప్రజలకు ఏ విధంగా దగా చేసిందో, ప్రశ్నిస్తున్న, పోరాడుతున్న ప్రజలపై ఏ విధంగా ఉక్కుపాదం మోపుతున్నదో, ప్రజా ఉద్యమాలపై, విప్లవోద్యమంపై ఎంతగా నిప్పులు కురిపిస్తున్నదో జగమెరిగిన సత్యాన్ని సత్యం రెడ్డి మాత్రం చూడడం లేదు. ఇటువంటి నిరంకుశ పాలనను సిగ్గు లేకుండా పొగుడుతూ రాష్ట్రంలో రాపిడ్ డెవలప్ మెంట్ జరుగుతున్నదనీ, ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని చెప్పడమంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, వర్తమాన పోరాటాలను అవహేళన చేయడమే. అంతే కాదు తనను సుదీర్ఘకాలం జైల్లో బంధించి, జైలు గేటు వద్దే పలుమార్లు అరెస్టు చేసిన రాజ్య నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఆయన ఆ ఇంటర్వ్యూలో పెదవి విప్పలేదు. అట్లా ఆయన తనను తాను వంచించుకున్నాడు.

25 సంవత్సరాల పాటు దండకారణ్య ప్రజలు ఆయనను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అటువంటి ప్రజలపై నేడు ఫాసిస్టు పాలక వర్గాలు తీవ్రమైన అణచివేతను కొనసాగిస్తున్నాయి. అయిన్పటికీ ప్రజలు పాలకవర్గాలకు లొంగకుండా తెగించి పోరాడుతున్నారు. అటువంటి ఎందరో ప్రజానీకాన్ని జైలు పాలు చేస్తున్న విషయం కూడా సత్యం రెడ్డికి ప్రత్యక్షంగా తెలుసు. కొంతమంది జైళ్ళల్లోనే ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. జైలు కడగండ్ల జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కొని విడుదలైన తర్వాత అత్యధిక ప్రజలు తిరిగి విప్లవోద్యమ పక్షాన నిలబడుతున్నారు. కానీ సత్యం రెడ్డి మాత్రం పాలక వర్గాల ముందు అంతిమంగా తన విడుదలకోసం లొంగిపోయి దిక్కుమాలిన బతుకుతెరువు కోసం సర్కారుని చేయిచాచి డబ్బూ, భూమి, ఇల్లు అడుక్కునే కడు హీనస్థితికి దిగజారాడు. ఆయన దివాళాకోరుతనాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

విప్లవోద్యమంలో అమరత్వం చెందిన తన మొదటి సహచరి గురించి ఆయన చెప్పుకున్నాడు. కానీ తను పునర్వివాహం చేసుకున్నట్టుగానీ, తన సహచరి కామ్రేడ్ శాంతక్క విప్లవోద్యమంలో దృఢంగా ముందుకు సాగుతున్న విషయం కానీ ఆయన ప్రస్తావించడానికైనా సాహసించలేదు.

నిజానికి ఆయన పతనం ఆకస్మికంగా జరిగిన పరిణామం కాదు. పోలీసుల చేతికి చిక్కిన తర్వాత ఆయన పార్టీ రహస్యాలను ప్రాణానికి మిన్నగా భావించి కాపాడలేదు. పదిహేడేళ్ల పాటు జైలులో గడిపిన సత్యం రెడ్డి జైలును ఒక పాఠశాలగా, ఒక పోరాట కేంద్రంగా భావించలేదు. జైలు అధికారుల అవినీతికీ, అక్రమాలకూ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎన్నడూ గొంతు విప్పలేదు. ఎంతసేపూ తన అవసరాలు తీర్చుకోవడానికే వెంపర్లాడాడు. జైలులో పోరాటం కాదు కదా, కనీసం జైలు సమస్యలపై సోదర ఖైదీలతో కలిసి నినదించలేదు. జైలును రణ క్షేత్రంగా మలిచిన ఎందరో కామ్రేడ్స్ నెలకొల్పిన ఉజ్వల వారసత్వాన్ని ఆయన త్రుణీకరించాడు. అలా ఆయన క్రమంగా దోపిడీ పాలక వర్గాల పట్లా, అధికార యంత్రాంగం పట్ల తన స్వార్థం కోసం రాజీ వైఖరిని అవలంబిస్తూ వచ్చాడు. ఈ కారణంగా తోటి ఖైదీల, విప్లవ ప్రజల, విప్లవోద్యమం నుండి తీవ్ర విమర్శలనూ ఎదుర్కొన్నాడు. ఆ విమర్శల నుండి ఆయన గుణపాఠం నేర్చుకోకపోగా తన విప్లవ చేవను పూర్తిగా కోల్పోయి తుదకు శత్రువుకు లొంగిపోయి జైలు నుండి

# కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు
# కామ్రేడ్ చండీదా అమర్ రహే

5 ఏప్రిల్ 2023 ఉదయం 11 గంటలకు పశ్చిం బంగాల్‌లోని నదియా జిల్లా కృష్ణా నగర్‌లోని తన ఇంటి వద్ద **కామ్రేడ్ చండీ సర్కార్** తన 76 ఏట కన్నుమూశాడు. కామ్రేడ్ చండీ సర్కార్‌ను యావత్తు విప్లవ క్యాంపు గౌరవంగా చండీదా అని పిలుచుకుంటారు. ఆయన అలుపెరుగని కార్మికవర్గ విప్లవకారుడు. ఆయన తుది వరకు మావోయిజానికి అంకితబద్ధుడై భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై కృషి చేసిన నక్సల్బరీ తరం నాయకుడు. పశ్చిం బంగాల్ **రాష్ట్ర కమిటీ సభ్యుడైన** ఆ గొప్ప కమ్యూనిస్టు విప్లవకారునికి కార్మికవర్గ ఉత్తమ పుత్రుడికి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, **మధ్య రీజినల్ బ్యూరో** వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిస్తున్నది.

కామ్రేడ్ చండీ సర్కార్ 15 ఆగస్టు 1947 నాడు నదియా జిల్లా చంద్ర పోలీసు స్టేషన్ పరిధిలో గల మహారాజ్‌పుర్ గ్రామంలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. ఆయన తండ్రి అశోక్ సర్కార్ భూస్వామిగా ప్రసిద్ధి. ఆయనకు చిన్నతనం నుండే ఆటలంటే మంచి ఆసక్తి వుండి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకొని కొంతకాలం హాకీ ఆటగాళ్లకు శిక్షణ ఇచ్చే ఉద్యోగం చేశాడు.

ఆయన యుక్త వయసులోనే 1960లలో బెంగాల్‌లో ముందుకొచ్చిన కరువు వ్యతిరేక ప్రజా వుద్యమంలో పాలుపంచుకున్నాడు. ఆ తరువాత నక్సల్బరీ విప్లవ రైతాంగా పోరాట జ్వాలలలో నుండి పుట్టుకు వచ్చిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)లో చేరి అత్యంత అంకితభావంతో పని చేశాడు. ఆయన తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించి తొలుత పార్టీలో వార్తాహరుడిగా (కోరియర్) పని చేశాడు. నక్సల్బరీ ప్రభంజన సమయంలో కృష్ణానగర్ ఒక ఉద్యమ కేంద్రంగా వుండింది. ఆ వుద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం సైన్యాన్ని దింపినప్పటికీ కామ్రేడ్ చండీదా పార్టీ నాయకత్వానికి ఎంతో చాకచక్యంగా కోరియర్ బాధ్యతలు నిర్వహించాడు. మరోవైపు ఆయన సైన్యానికి వ్యతిరేకంగా ఎంతో మెళుకువతో ప్రతిఘటన చర్యలలో సైతం పాలు పంచుకున్నాడు. ఆ సందర్భంగా ఆయన ఒక ఘటనలో గాయపడ్డాడు. ఆ సమయంలో బెంగాల్‌లో కొనసాగిన తీవ్ర నిర్బంధ పరిస్థితులలో కామ్రేడ్ చండీదా 1971లో అరెస్టయ్యాడు. దాదాపు 7 సంవత్సరాలు జైలు జీవితం అనుభవించాడు.

దేశంలో ఫాసిస్టు ప్రధాని ఇందిరా గాంధీ విధించిన అత్యవసర కాలంలో ఆయన జైలులోనే వున్నాడు. 1977లో అత్యవసర పరిస్థితిని ఎత్తివేసి దేశంలో హక్కుల వుద్యమాలు ఊపందుకుంటూ ఇందిరా నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పాలన కోసం ప్రజలు, పార్లమెంటరీ పార్టీలు వీధులలోకి వస్తున్న సమయంలో కామ్రేడ్ చండీదా జైలు నుండి విడుదలయ్యాడు. అప్పటికే కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వంతో ముక్కచెక్కలైన పార్టీ తిరిగి ఎక్కడికక్కడే విప్లవ శక్తులు సమైక్యం కావడానికి పూనుకుంటున్న పరిస్థితులలో కామ్రేడ్ చండీదా సీపీఐ (యం.ఎల్)(పార్టీ యూనిటీ)లో చేరి నదియా-ముర్షిదాబాద్‌లో రైతాంగ ఉద్యమ నిర్మాణానికి నడుం బిగించాడు.

పార్టీ గతంలో అనుసరించిన అతివాద ఎత్తుగడలను

---

విడుదలయ్యాడు.

విప్లవోద్యమ క్రమంలో విప్లవకారులు ఎన్నో రకాల కఠిన పరీక్షలను ఎదుర్కోవాల్సి వస్తుంది. నిర్బంధం, అరెస్టులు, చిత్రహింసలూ, దుర్భర జైలు జీవితం... ఇవన్నీ ఈ పరీక్షల్లో భాగమే. వీటన్నింటినీ రాజకీయ, సిద్ధాంత వెలుగులో తట్టుకొని ధైర్యం, సాహసం, గుండె నిబ్బరం, దృఢ సంకల్పంతో ఎదుర్కొన్న వాళ్లే విప్లవోద్యమంలో కొన ఊపిరి వరకూ కొనసాగుతారు. చరిత్ర పురోగమనంలో భాగమవుతారు. ఆ పురోగమనానికి దిశా నిర్దేశనం చేస్తారు. ఆ క్రమంలో ప్రాణాలు కోల్పోతే చరిత్రలో అమరులై ప్రకాశిస్తారు. ఆ పరీక్షలకు తట్టుకోలేని వాళ్లు తిరోగమనం చెందితే, వారిని చరిత్ర పెంటకుప్పపైకి విసిరివేస్తుంది. సత్యం రెడ్డి నిర్ద్వంద్వంగా ఈ కోవలోకి చేరుకున్నాడు. వర్తమాన ఫాసిస్టు దాడుల మధ్య విప్లవోద్యమ అంతిమ విజయం పట్ల విశ్వాసాన్ని కోల్పోవడమే ఆయన పతనానికి ప్రధాన కారణం.

ఎన్నో ఆటుపోట్లనూ, ఒడిదుడుకులనూ, వెన్నుపోట్లనూ, ద్రోహాలనూ నిబ్బరంగా ఎదుర్కొని, ప్రభుత్వాలు ప్రకటించే తుది గడువులను సహితం ఎన్నింటినో ఓడించి పురోగమించిన అనుభవం భారత విప్లవోద్యమానికి ఉన్నది. పొల్లునూ, నెల్లునూ వేరు చేస్తూ, చెత్తనూ, తెట్టునూ వక్కకు తోసేస్తూ చరిత్ర ముందుకే పురోగమిస్తుంది. ఎందుకంటే చరిత్రకు చోదకశక్తులు కొంత మంది నాయకులు కాదు, అసంఖ్యాకమైన సామాన్య ప్రజలే. విప్లవోద్యమానికి నష్టాన్నీ, ద్రోహాన్నీ తలపెట్టే ఇటువంటి శక్తులను ప్రజలూ, ప్రజాస్వామికవాదులూ ఎండగట్టాలనీ, పాలక వర్గాల చెంతన చేరి వల్లించే వాళ్ళ చెక్క భజనను ఖండించాలని మేం కోరుతున్నాం.

**విప్లవాభినందనలతో,**

**వికల్ప్,**

**అధికార ప్రతినిధి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

నిజాయితీగా ఆత్మవిమర్శ చేసుకొని దేశంలో విప్లవ ప్రజా పునాదిని పెంపొందించు కోవడానికి వ్యవసాయ విప్లవ కార్యక్రమంతో ప్రజా వుద్యమాల నిర్మాణానికి పూనుకున్న విప్లవకారులలో కామ్రేడ్ చండీదా ఒకరు. పార్టీ యూనిటీ నాయకత్వంలో భాగంగా కామ్రేడ్ చండీ దా బిహార్‌లోని జహనాబాదు రైతాంగ వుద్యమ నిర్మాణంలో భాగమయ్యాడు. మజ్దూర్ కిసాన్ సంగ్రాం సమితి నిర్మాణంలో భాగమై పాలమూ సమరశీల రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించాడు. దున్నే వారికే భూమి నినాదంతో భూ పోరాటాలలో పాల్గొన్న పేద, భూమిలేని రైతాంగానికి వివిధ రకాల భూములను (ప్రభుత్వ భూములు, అన్యాక్రాంత భూములు, ప్రజా వ్యతిరేక భూస్వాముల భూముల స్వాధీనం మున్నగునవి) పంచడంలో ముందు వీరిన నిలిచాడు. మరోవైపు వ్యవసాయ కూలీల కూలీ రేట్ల పెంపుదల పోరాటంలో వారిని సంఘటితం చేశాడు. సంగ్రామి రైతాంగ వేదికను ఏర్పర్చడంలో కీలక పాత్ర పోషించాడు.



కామ్రేడ్ చండీదా బెంగాల్‌లో కూడ జోతేదార్లకు వ్యతిరేకంగా రైతాంగాన్ని కదలించి సమరశీల పోరాటాలు నడిపాడు. క్రూరమైన భూస్వాములను శిక్షించడంలో ఆయన నదియా నుండి మాల్దా వరకు అనేక చర్యలలో పాలు పంచుకున్నాడు. కళింగ నదిలో స్థానికులకు చేపలు పట్టుకునే హక్కు కోసం పోరాడి డిమాండ్‌ను సాధించుకున్నారు. ఆ వుద్యమాన్ని ఆ ప్రాంతమంతటా విస్తరించింది.

కామ్రేడ్ చండీదా రైతాంగ ఉద్యమంతో పాటు కార్మికుల, ఉద్యోగస్తుల సమస్యలపై వారిని సమీకరించి సంఘటితం చేశాడు. విద్యుత్ కార్మికులు, జనుపనార పరిశ్రమ కార్మికులు, ఇంజనీరింగ్ విభాగ కార్మికులు, మోటార్ మెకానిక్కులు, ఆస్పత్రి ఉద్యోగులతో పాటు ఇతర రంగాలలోని కార్మికులను సంఘటితం చేశాడు. హాకర్ల సమస్యలపై పోరాటాలు నడిపాడు. కార్మికుల సమస్యలపై చేపట్టిన పోరాటాలకు రైతాంగ సంఘీభావాన్ని కూడగట్టడంలో ఎంతో శ్రద్ధ పెట్టి కార్మిక కర్షక సమైక్యత పెంపొందడానికి పట్టుదలగా కృషి చేశాడు.

సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్), సీపీఐ (ఎంఎల్) (పార్టీ యూనిటీ) రెండు 1998లో విలీనమై 2001లో జరుపుకున్న పార్టీ 9వ కాంగ్రెస్‌లో కామ్రేడ్ చండీదా పశ్చిం బెంగాల్ రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొన్నాడు. ఆ తరువాత 2004లో యంసీసీఐ, సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్)లు విలీనమై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడిన సందర్భంగా కామ్రేడ్ చండీదా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ పార్టీ బలోపేతానికి, విస్తరణకు ఎంతో కృషి చేశాడు. కానీ, అనతికాలంలో 2005లో కామ్రేడ్ చండీదా అరెస్టు అయి 8 యేళ్ల సుదీర్ఘకాలం జైలు జీవితం గడిపాడు. ఆయన మొదటిసారి గడిపిన 7 ఏళ్ల జైలు జీవితం, రెండవసారి గడిపిన 8 ఏళ్ల జైలు జీవితంలో ఆయన జైలును ఒక పాఠశాలగా, ఒక పోరాట కేంద్రంగా మలచడంలో ఎంతో కృషి చేశాడు. జైలు అధికారుల అక్రమాలకు వ్యతిరేకంగా ఖైదీల హక్కుల కోసం అనేక పోరాటాలు నడిపాడు.

జైలు నుండి విడుదలయ్యేసరికి పశ్చిం బెంగాల్ సహా భారత విప్లవోద్యమం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. దేశవ్యాప్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడులు తీవ్రంగా కొనసాగుతున్నాయి. లాల్‌గఢ్ ప్రజా వుద్యమ నేత కామ్రేడ్ కిషన్‌జీ అమరత్వం, వుద్యమం వెనుకపట్టు మున్నగు పరిణామాలు కామ్రేడ్ చండీదా ముందు కొత్త సవాళ్లను వుంచాయి. మరోవైపు హిందుత్వ శక్తులు 2014లో కేంద్రంలో అధికారాన్ని చేపట్టి తమ ఉగ్రవాద ఎజండాను ముందుకు తెస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. సుదీర్ఘకాల జైలు జీవితం అనుభవించి అనేక అనారోగ్యాల పాలై, వయసు పై బడుతున్న పరిస్థితులలో కూడ కామ్రేడ్ చండీదా ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా ప్రజాస్వామిక శక్తులను, మేధావులను కూడగట్టడంలో ప్రశంసనీయమైన పాత్ర పోషించాడు. దండకారణ్యం ముఖ్యంగా బస్తర్ విప్లవ ప్రజలపై కొనసాగుతున్న విప్లవ ప్రతిఘాతుక దాడులను ఖండించడంలో ఆయన ఆయన అనేక శక్తులను కూడగట్టాడు. కామ్రేడ్ చండీదా ముందు నుండి రివిజనిజానికి, నయా రివిజనిజానికి వ్యతిరేకంగా ఆయన నిశితమైన సిద్ధాంత, రాజకీయ పోరాటాన్ని కొనసాగించాడు.

బెంగాల్‌లో కాషాయ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వామపక్షాలను, దేశభక్తులను, ప్రజాస్వామిక, లౌకిక శక్తులను సమైక్యపర్చడంలో తీవ్రంగా కృషి చేస్తున్న కామ్రేడ్ చండీదా మరణం ప్రస్తుత భారత విప్లవోద్యమానికి తీవ్రలోటు. కానీ, సుసంపన్నమైన పోరాట అనుభవాన్ని గడించిన ఆయన విప్లవ జీవితం నూతన తరాలకు ఒక గొప్ప ప్రేరణగా వుంటుంది. ఆయన జీవితంలోని ప్రతి ఘట్టం తెరిచిన పుస్తకం. ఆ అనుభవాల గని నుండి పాఠాలను నేర్చుకుంటూ ఈనాటి విప్లవ తరం అమరుడు కామ్రేడ్ చండీ అసంపూర్ణ విప్లవ ఆశయాలను పరిపూర్తి చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయడమే ఆ గొప్ప నాయకుడికి అందించే నిజమైన నివాళి అవుతుంది. ★

# ఇంద్రవెల్లి డివిజన్ కమిటీ సభ్యురాలు

## కామ్రేడ్ అనిత (కంతి లింగవ్వ) కు జోహార్లు

డిసెంబర్ 23న బీజాపుర్ జిల్లా, నేషనల్ పార్క్ ఏరియా, టేకమెట్ట గ్రామం దగ్గర జరిగిన పోలీసులతో జరిగిన ఎదురుకాల్పులలో కామ్రేడ్ అనిత (డీవీసీయం), పార్టీ సభ్యుడు కామ్రేడ్ కిశోర్ అమరులయ్యారు. మహారాష్ట్రకు చెందిన సీ-60 బలగాలు, తెలంగాణకు చెందిన గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రత్యేక బలగాలు కచ్చితమైన సమాచారంతో జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో కామ్రేడ్ అనిత వీరోచితంగా ప్రతిఘటిస్తూ అమరత్వం చెందగా కామ్రేడ్ అశోక్ గాయాలతో పోలీసులకు పట్టుబడగా చిత్రహింసలు పెట్టి, హత్యచేసి ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు పోలీసులు బూటకపు ప్రచారం చేశారు.



తెలంగాణ రాష్ట్రం, నిర్మల్ జిల్లా, కడెం మండలం, లక్ష్మీసాగర్ (లాసారం) గ్రామంలో ఆదివాసీ నాయకపు తెగలో పేద కుటుంబంలో 37 సంవత్సరాల క్రిందట అనిత పుట్టింది. గ్రామ తగాదాల్లో భాగంగా అనిత చిన్నతనంలోనే పెత్తందార్లు ఆమె తండ్రిని హత్య చేశారు. అప్పటి నుండి అనితను, ఇద్దరు తమ్ముళ్ళను తల్లి అపురూపంగా పెంచుకుంది.

కామ్రేడ్ అనిత పుట్టి పెరిగిన అదిలాబాద్ జిల్లా అంతటా విప్లవోద్యమ రాజకీయాలు విస్తరించి ఉండడంతో చలాకీగా ఉండే అనిత చిన్నతనంలోనే విప్లవ సాంస్కృతిక కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నది. విప్లవకారులతో పెరుగుతున్న పరిచయాలతో ఆమె ఎంతగానో రాజకీయంగా తాదాత్మ్యం చెంది పూర్తికాలం విప్లవకారిణిగా ఉద్యమంలో చేరి పనిచేయాలనీ నిర్ణయించుకుంది. 1990ల చివర దళసభ్యురాలిగా ఉద్యమంలో చేరిన కామ్రేడ్ అనిత 2 దశాబ్దాలుకు పైగా అవిశ్రాంతంగా పనిచేసి ఆశయాల సాధనలో అమరత్వం పొందింది.

చిన్నగా, బక్కపలుచగా, సాదా సీదాగా ఉండే అనిత గట్టి పట్టుదలతో, దృఢమైన విశ్వాసంతో పని చేసింది. ఎంతటి నిర్బంధంలోనూ ఆమె దీక్ష సడలలేదు. 2002లో అనారోగ్యంతో షెల్టర్‌లో ఉన్నపుడు పోలీసులు అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టినా, అక్రమ కేసులు బనాయించి 3 సంత్సరాలు జైలులో నిర్బంధించినా ఆమె ధైర్యంగానే వాటిని ఎదుర్కొన్నది. జైలు నుండి విడుదలైన అనిత ఉద్యమంలో మరింత పట్టుదలతో ఆఖరి శ్వాస వదిలేవరకు పనిచేసింది. ఆమె నిత్య జీవితంలో ఎదురయ్యే గెరిల్లా జీవిత కష్టాలను నిబ్బరంగా ఎదుర్కొంది. ఆదిలాబాద్ అడవులలో, దండకారణ్యంలో అనేకసార్లు పోలీసుల దాడులను తిప్పికొడుతూ సురక్షితంగా రిట్రీట్ అవుతూ వచ్చింది. అడవిలో తరచుగా వచ్చే మలేరియా జ్వరంతో పాటు ఎదురయ్యే ఇతర అనారోగ్యాన్ని లెక్కచేయకుండా మానసిక బలంతో, చైతన్యవంతంగా దృఢంగా పని చేసింది.

గత 2 దశాబ్దాలకు పైగా తెలంగాణ ఉద్యమం తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నది. ఎంతో మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. దళాలు తిరగలేని, విప్లవ ప్రజా సంఘాలను పనిచేయనివ్వని ఫాసిస్టు పరిస్థితులలో కామ్రేడ్ అనిత దళాలతో పాటు వెళ్ళి ప్రజలను కలిసి వారి ప్రేమాభిమానాలను పొంది, వారిలో పార్టీ పట్ల, భవిష్యత్ ఉద్యమ విజయాల పట్ల విశ్వాసం కల్పించేది. ప్రజల, కేడర్ల ప్రేమాభిమానాలను పొందిన అనిత పార్టీ సభ్యురాలుగా, ఏరియా కమిటి సభ్యురాలుగా, కార్యదర్శిగా ఆ తర్వాత డివిజన్ కమిటి సభ్యురాలుగా అంచెలంచెలుగా ఎదిగింది. ఆమె అమరత్వం విప్లవోద్యమానికి పెద్ద నష్టం. అదిలాబాద్ విప్లవోద్యమంలో చెరిగిపోని ముద్ర వేసిన కామ్రేడ్ అనిత చెదరని చిరునవ్వు, ఆప్యాయత, ఆమె త్యాగం సదా నిలిచి భవిష్యత్తరాలకు ప్రేరణగా ఉంటుంది.

విప్లవోద్యమంలో కలిసి పని చేస్తున్న క్రమంలో పరస్పరం ఇష్టపడి, పార్టీ అనుమతితో కామ్రేడ్స్ అనిత, భాస్కర్ పెండ్లి చేసుకున్నారు. 2 దశాబ్దాల వారి వైవాహిక జీవితంలో ప్రజల మధ్య ఆదర్శవంతమైన జీవితాన్ని కొనసాగించింది.

కామ్రేడ్ అనిత అంతిమ యాత్రలో ప్రజా సంఘాల ప్రతినిధులు, వేలాదిగా ప్రజలు పాల్గొని ఆమె త్యాగాలను కొనియాడుతూ జోహార్లు చెప్పారు. కామ్రేడ్ అనిత సంస్మరణలో సీపీఐ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ ప్రజలు బంద్‌ను పాటించారు.

☆

సంక్షిప్త వార్తలు

# మీడియా ముందు లొంగుబాటు దార్లు

ప్రతి యేటా 400కు పైగా నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోతున్నట్టు సుందరరాజు పత్తిలింగం వెల్లడిస్తున్నాడు. మరోవైపు 2001లో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నక్సలైట్ల పునరావాస పథకాన్ని ప్రకటించింది కానీ దానిని అమలుపర్చడం లేదనీ లొంగుబాటు దార్లు వాపోతున్నారు. వారు లొంగిపోతున్న నక్సలైట్ల సమస్యలు పట్టించుకోండి, మాకు ఉద్యోగాలు ఇవ్వండి అంటూ లొంగుబాటు దార్లు ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నారు. లొంగుబాటు పథకాలు ప్రకటిస్తున్నారు, కానీ నిజానికి అవి పోలీసుల ప్రయోజనాల పథకాలేనని లొంగుబాటు దార్లు వెల్లడిస్తున్నారు. అలాగే వారు వేలాది ఆదివాసీ కుటుంబాల యువకులు రహస్య పోలీసులుగా, ప్రత్యేక పోలీసులుగా పని చేయడానికి సిద్ధపడి శిక్షణ పొందినప్పటికీ వారిని కొద్ది మాసాలు లేద కొన్ని సంవత్సరాలు పని చేయించుకొని పంపిస్తున్నారనీ చెప్పారు. సల్వాజుడుం కాలంలో ప్రభుత్వం ఎస్.పీ.ఓ (స్పెషల్ పోలీసు ఆఫీసర్)లను నియమించింది. కానీ, ఆ నియామకాలు చెల్లవనీ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో వారిలో చాలా మందిని సహాయక పోలీసులుగా కొత్త ఉద్యోగాన్ని సృష్టించి అందులోకి తీసుకుంది. కానీ వారిని కూడ చాలా మందిని దిక్కూ దివాణం లేకుండా రోడ్ల మీదికి విసిరేసింది. దానితో వారు తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని జీవిస్తున్నారనీ, వారి చావుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలనీ చెప్పకనే చెపుతున్నారు. ఆ తర్వాతి అవతారం 2013లో డీ.ఆర్.జీలుగా ముందుకు వచ్చింది. ప్రపంచంలో చాలా చోట్ల తిరుగుబాట్లను, విప్లవోద్యమాలను అణచడానికి ప్రభుత్వాలు స్థానిక శక్తులకే తుపాకులు ఇచ్చి సాయుధ శిక్షణనిచ్చి తన కంట్లో తన వేలు గుచ్చిన చందంగా స్థానిక ప్రజలపైకి ఎగదోలడం దోపిడీ పాలకవర్గాల ఎత్తుగడలలో భాగంగా కొనసాగుతోంది. మరోవైపు పేరు వెల్లడించడానికి సిద్ధపడని ఓ పోలీసు ఉన్నతాధికారి మావోయిస్టు పార్టీ వాళ్లే కొంతమందిని ఉద్దేశ్యపూర్వకంగా లొంగబరుస్తున్నారనీ, ప్రభుత్వ సమాచార సేకరణకు వాడుకుంటున్నారనీ, నేను నా అనుభవంలో ఇలాంటి ఘటనలు చూశాననీ బస్తర్ టాకీస్‌తో తన అపరాధ పరిశోధనను వెల్లడించాడు. ✯

# కామ్రేడ్ సాయిబాబాను నిర్ధోషిగా హైకోర్టు ప్రకటిస్తే శిక్షను ఖరారు చేసిన సుప్రీం కోర్టు


నిర్ధోషి కామ్రేడ్ సాయిబాబా దాదాపు గత దశాబ్ద కాలంగా దోషిగా జైలు జీవితాన్ని అనుభవిస్తున్నాడు. ఆయనను మహారాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ఆరోపణలపై కక్ష కట్టి 2014లో అరెస్టు చేసింది. ఆయనపై ఊపా మోపారు. అప్పటినుండి ఆయనకు బెయిల్ దొరుకడం లేదు. ఆయన అనేక వ్యాధులతో బాధపడుతున్నాడు. ఆ తరువాత ఆయనను గడ్‌చిరోలీ జిల్లా న్యాయస్థానం విచారించి 2017లో జీవితఖైదు శిక్ష విధించింది. ఆ కేసును మహారాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విచారించి 2022 అక్టోబర్‌లో సాయిబాబా నిర్ధోషి అని ప్రకటించింది. కానీ, ఆ తీర్పుతో దిమ్మ తిరిగిన హిందుత్వ పాలకులకు కునుకు పట్టలేదు. వారు తక్షణమే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ వారు అనుకున్నట్టు హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ శిక్షను ఖరారు చేస్తున్న తీర్పును ఏప్రిల్ 19నాడు అన్యాయంగా విన్పించారు. 'కలంధారీలు' కోర్టును ప్రభావితం చేస్తున్నారనీ మోదీ చేసే ఆరోపణలను లోతుగా పరిశీలించుకుంటే "దొంగే దొంగ దొంగ" అన్న చందంగా వుంది అని ఈ కేసు తీర్పు వివరించనవసరం లేకుండా విన్పించింది. మా పార్టీ మధ్య రీజినల్ బ్యూరో ఈ అన్యాయమైన తీర్పును ఖండిస్తున్నది. దేశ, విశ్వ ప్రజాస్వామిక వాదులు, మేధావులు, వకీళ్లు, న్యాయకోవిదులు, హిందుత్వ వ్యతిరేక సమస్త శక్తులు ఈ తీర్పుకు వ్యతిరేకంగా వుద్యమించాలనీ మా పార్టీ పిలుపునిస్తున్నది. ✯

**"యుద్ధం యుద్ధం ద్వారానే సమసిపోతుంది. తుపాకుల నుండి విముక్తి పొందాలంటే తుపాకులను ఎత్తిపట్టాలి. పోరాటానికి సాహసించండి. అధికారాన్ని గెలుచుకోవడానికి ధైర్యం చేయండి" – మావో**

**"కార్మికోద్యమం తప్పకుండా వివిధ దశలలో అభివృద్ధి చెందుతుంది. ఒక్కొక్క దశలో ఉద్యమంలో ఒక భాగం ముందుకు పోవడానికి ప్రయత్నించుతుంది. మిగిలిన భాగం దానితో కలువడానికి నిరాకరించుతుంది. అందువల్లే వివిధ భాగాల మధ్య జీవస్మరణ పోరాటాలు జరిగి ఉన్నతమైన కార్మికవర్గ ఐక్యత అభివృద్ధి సాధించబడుతుంది." – ఎంగెల్స్**

# 'మోడీ ఫ్రీ ఇండియా'

హిందూ మతోన్మాది మోడీ భల్లూకపు పట్టు నుండి తమ భారతదేశాన్ని విముక్తం చేయాలనీ, ఉత్తర అమెరికాలోని మెట్రో వాంకువర్‌లోని మోడీ వ్యతిరేకులు (నాం-నార్త్ అమెరికన్స్ ఎగెనెస్ట్ మోడీ) విదేశాలలోని సమస్త భారతీయులకు పిలుపునిస్తూ రానున్న 2024 భారత్ లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 2023 మే-డే నుండి "మోడీ ఫ్రీ ఇండియా" కేంపెయిన్‌ను ప్రారంభించారు. మే డే రోజు వారు ఒక పుస్తికను విడుదల చేస్తూ విశ్వ వ్యాప్తంగా వున్న భారతీయులను మోదీ సమన్యను ఎదర్కోవడానికి సమైక్యం కావాలనీ భారతదేశంలో కూకటివేళ్ల నుండి మోదీని పెకలించి భారతీయ జనతా పార్టీని గద్దె దింపడానికి పోరాడుతున్న శక్తులను బలోపేతం చేయాలనీ పిలుపునిచ్చారు.




నామ్ సహ సంస్థాపకుడు గురుప్రీత్ సింగ్ మాట్లాడుతూ మోదీ ప్రతిఘాతుక ప్రభుత్వం హిందుత్వ సంస్థ ఆర్ఎస్ఎస్ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటుందనీ, అది 2025 నాటికి (అది ఏర్పడి వందేళ్లు పూర్తికానున్నవి) భారతదేశాన్ని హిందూ మతైక రాష్ట్రం (దేశం) గా మార్చాలనుకుంటున్నదనీ పుస్తికను హెచ్చరిస్తున్న విధంగా రానున్న ఎన్నికలలో మోదీని ఓడించడం చాలా ముఖ్యం అని అన్నాడు. హిట్లర్ ఉపదేశాలతో ప్రేరణ పొందే ఘోరమైన వాస్తవాలు చాలావరకు ప్రపంచానికి తెలియవన్నాడు. "ప్రపంచ నాయకులు ప్రత్యేకించి మన ధృవానికి చెందిన వారు చైనా, రష్యా రాజకీయాలతో ఆవహించివుండడంతో మోదీ దురాగతాలను సంకుచిత వ్యాపార ప్రయోజనాల రీత్యా లెక్క చేయలేదు" అన్నాడు. భారతదేశంలో మానవ హక్కుల విషయంలో జరుగుతున్న ఉల్లంఘనలకు ఉత్తర అమెరికా జవాబుదారీ వహించాలి అన్నాడు.

భారత విపరిణామాలను గమనిస్తున్న వారికి మన స్వాతంత్ర్య సమర యోధులు భవిష్యత్తులో మానవీయ విలువలతో కూడిన సమసమాజాన్ని కలలను సాకారం చేయడానికి మనకు ఇంకా యేడాది కాలం వుందనీ పుస్తిక తెలిపింది.

బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా గదర్ పార్టీ సాయుధ పోరాటాన్ని చేపట్టి లౌకిక రిపబ్లిక్‌ను స్థాపించాలనుకుంది. ఉత్తర అమెరికా ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలి. మత మౌఢ్య శక్తుల బందనాల నుండి భారతాన్ని విముక్తి చేయడానికి మరో విముక్త పోరాటానికి బీజేపీ భావజాలానికి వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతున్నవారికి ప్రజాస్వామిక పద్ధతులలో అంటే "భారతదేశంలో వున్న వారికి ప్రత్యక్షంగా లేద ఆన్‌లైన్ కేంపెయిన్‌ల ద్వార, ర్యాలీల ద్వారా సహాయమందించడానికి సిద్ధం కావాలనీ" గురుప్రీత్ కోరాడు. ✯

---

39 వ పేజీ తరువాయి

సరిగ్గా దానికి వ్యతిరేకంగా సావర్కర్ తన **కాషాయ బ్రిగేడ్** కార్యకర్తలను త్రివిధ బలగాలలో చేరడానికి ప్రోత్సహిస్తూ సైనికంగా బ్రిటిష్ వారికి అన్ని స్థాయిలలో సహకరించడానికి సిద్ధపడినాడు. అందుకు ఆయన 1941లో భగల్పూర్‌లో జరిగిన హిందూ మహాసభ 23వ సెషన్‌లో ఇచ్చిన ఉపన్యాసమే పరమ సాక్షంగా వుంది. కానీ, ఆయన ప్రియ శిష్యుడు నేటి ప్రధాని మోదీ ఆ విద్రోహకర చరిత్రను రూపుమాపడానికి బోస్‌ను ఆకాశానికెత్తుతూ కాంగ్రెస్‌ను నిందించడాన్ని వారి కాంగ్రెస్ రహిత భారత్‌లో భాగంగానే చూడాలి.

సావర్కర్ త్రికరణశుద్ధిగా మనుస్మృతిని దైవమిచ్చిన చట్టంగా భావించాడు. అందుకే ఈ రోజు కరుడుగట్టిన హిందుత్వ శక్తులన్నీ బహిరంగంగా దానినే భారత రాజ్యాంగంగా మార్చడానికి ఉవ్విళ్లూరుతున్నాయి. మనుస్మృతిని నమ్మిన ఆయనను అతడి వారసులంతా ఈనాడు దేశంలో అస్పృశ్యతకు వ్యతిరేకంగా సావర్కర్ పోరాడాడనడం చరిత్రను వక్రీకరించే క్రూర పరిహాసమే అవుతుంది. ఏ రకంగా చూసినా అత్యంత విద్వేషపూరిత, విషభరిత చరిత్రను కలిగిన సావర్కర్ జన్మదినాన్ని నిజమైన దేశభక్తుల, స్వాతంత్ర్యవీరుల గౌరవదినంగా పాటించాలంటూ కాషాయ భక్తులు తమ సత్తా మహిమతో నిజాలకు గోరీ కడుతున్నారు. దీనికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా సమైక్యంగా పోరాడాల్సిన సమయమిది.

ప్రస్తుతం మన దేశంలో నిజమైన దేశభక్తులు, లౌకికవాదులు, ప్రజాస్వామికవాదులు వర్తమాన హిందుత్వ శక్తుల కుట్రలకు కుహకాలకు వ్యతిరేకంగా "సేవ్ కాన్‌స్టిట్యూషన్-సేవ్ డెమాక్రసీ"; "భారత్ బచావో", "భారత్ జోడో" తదితర అనేక పేర్లతో అనేక ఉద్యమాలు నడుపుతున్నారు. వారి నోళ్లకు తాళం వేయడానికి, వారి ఉద్యమాలకు సంకెళ్లు వేయడానికి మోదీ ప్రభుత్వం సిద్ధపడింది. అందులో భాగంగా స్వాతంత్ర్యోద్యమాన్ని నాటకీయంగా కీర్తించడం, అక్కర నిమిత్తం బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవతారపురుషునిగా మార్చడం, ఉల్‌గులాన్ అని నినదించిన బిర్సా ముండాను రూపుమాపడానికి భగవంతుడిని చేయడం, భగత్ సింగ్‌ను కాషాయికరించడం సత్తా కోసం చేస్తున్న చిట్కాలే కాకుండా వారి హిందుత్వ ఎజండాను అమలుచేయడానికి అనివార్యంగా ఈరోజు తలకెత్తుకుంటూ అంతిమంగా వాటన్నింటిని అతఃపాతాళానికి తొక్కేయడమే వారి తార్కిక ముగింపు అనేది గుర్తించి మహారాష్ట్ర ప్రభుత్వ పిలుపును బహిష్కరిస్తూ నల్లజెండాలతో నిరసనదినాన్ని పాటించాలనీ మా పార్టీ పిలుపునిస్తున్నది. ✯

# సావర్కర్ జయంతిని స్వాతంత్ర్యవీరుల గౌరవదినంగా పాటించడం దేశద్రోహం, 'జాతి'కి అవమానం

భారత ప్రజల స్వాతంత్ర్యోద్యమ చరిత్రను రూపుమాపడమే లక్ష్యంగా పెట్టుకున్న హిందుత్వ శక్తులు తమ ఆది గురువైన సావర్కర్‌ను సమాధి నుండి తవ్వి తీస్తూ స్వాతంత్ర్య సమరయోధుల సరసన చేర్చి దేశం కోసం నిజంగా, నిస్వార్ధంగా, అంకిత భావంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన వేలాది వీరుల త్యాగాలను నిలువునా సమాధి చేస్తూ వలసవాదులకు ఐదు సార్లు ఆత్మ సమర్పన చేసిన సావర్కర్‌ను వీరుడిగా చేసి హిందుత్వ శక్తులు తప్ప జగమెరుగని ఆయన జయంతి మే 28 "స్వాతంత్ర్య సమరయోధుల గౌరవదినం" గా పాటించాలనీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌రావ్ షిండే ప్రభుత్వం నిర్ణయించడాన్ని మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పశ్చిం సబ్ జోనల్ బూరో, గడ్‌చిరోలీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఆ రోజును మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన దినం (ప్రొటెస్ట్ డే)గా పాటించాలనీ ప్రజలకు పిలుపునిస్తున్నది. రాష్ట్ర, దేశ బుద్ధిజీవులంతా సావర్కర్ జీవిత లొంగుబాట్లను, భారత ప్రజల స్వాతంత్ర్యోద్యమానికి చేసిన విద్రోహాన్ని ఎండగట్టాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నది.

సావర్కర్ తన రాజకీయ జీవిత ప్రారంభంలో అతి కొద్ది రోజులు మాత్రం స్వాతంత్ర్యోద్యమం లో పాల్గొని 1857 నాటి తొలి భారత స్వతంత్ర్య సంగ్రామాన్ని తాను రాసిన '1857 భారత స్వాతంత్ర్యోద్యమ సంగ్రామం'లో గొప్పగా కొనియాడాడు. ఆ సంగ్రామంలో పాల్గొన్న హిందూ ముస్లింలను హిందుస్తాన్ అనే ఒకే తల్లి నెత్తురు పంచుకు పుట్టిన బిడ్డలంటూ అభివర్ణించాడు. మరీ ముఖ్యంగా ఆ ఉద్యమ నాయకులలో ఒకరైన మౌల్వీ అహ్మద్ షాను "గొప్ప ఆదర్శ పురుషుడు అహ్మద్ షా లఖ్‌నౌ, ఆగ్రాల మూల మూలలనుండి జిహాద్- స్వాతంత్ర్య సంగ్రామం - కోసం చక్కని ప్రజ్ఞా పాటవాలతో సమైక్యం చేశాడు" అంటూ కీర్తించాడు. కానీ, ఆ ఉద్యమంలో భాగంగా ఆయన అరెస్టై కాలాపానీ (అండమాన్ దీవులలోని సెల్యూలర్ కారావాసం) శిక్షకు గురై, అక్కడి నుండి బ్రిటిష్ అధికారులకు క్షమాభిక్ష వేడుకొని బయటకు వచ్చిన ఆయనలో భారతదేశం పట్ల గత వైఖరికి పూర్తి భిన్నమైన వైఖరిని (యూ-టర్న్) తీసుకొన్నాడు.

జైలు నుండి బయటపడిన సావర్కర్ "ఒకే దేవుడు, ఒకే దేశం, ఒకే లక్ష్యం, ఒకే జాతి (రేస్), ఒకే జీవితం, ఒకే భాష" మంత్రాన్ని ఉచ్ఛరించడం ప్రారంభించాడు. ఒకవైపు భారత స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున సాగుతుండగా మరోవైపు 1911 మొదలు ఆయన 1913, 1914, 1918, 1920లలో వివిధ సందర్భాలలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులను క్షమాభిక్ష వేడుకున్నాడు. ఫలితంగా ఆయన తన 50 ఏళ్ల జైలు శిక్షలో దాదాపు 38 సంవత్సరాల మినహాయింపు పొందాడు. హిందూ ముస్లింల మధ్య విద్వేషాలను సృష్టిస్తూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో గొంతు కలుపుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామానికి తీరని ద్రోహం చేశాడు. అలాంటి విద్రోహకర, విద్వేషభరిత, దేశద్రోహ చరిత్ర కలిగిన వ్యక్తి జన్మదినాన్ని నిజమైన దేశభక్తుల, పరాయి పాలకుల లాఠీలను-తూటాలను, జైళ్లను లెక్క చేయకుండా, ఉరి తాళ్లను ముద్దాడిన వీరయోధుల గౌరవ దినంగా పాటించడం వారి త్యాగాలను నిలువునా పాతరేయడమే తప్ప మరేమీ కాదు.

పై క్రమం మోదీ ప్రధాని అయిన మరుక్షణం నుండే ప్రారంభమైంది. పార్లమెంట్ సమావేశ హాల్‌లో సావర్కర్ తైలవర్ణ చిత్రాన్ని పూజించడం మొదలు 2022 ఆగస్టు 15 నాడు ఎర్రకోట బురుజులపై నుండి అమృత మహోత్సవాలంటూ స్వతంత్ర్య సమరయోధులను స్మరించిన సందర్భంగా జాతీయ విప్లవకారులతో పాటు ఇంకా అనేక మందితో సమానం చేస్తూ అసలైన యోధుల త్యాగాలను ఖూనీ చేస్తూ సావర్కర్ విద్రోహానికి పట్టం కట్టాడు. ఇలా చేయడాన్ని, వారి హిందుత్వ ఎజండాలో విడదీయరాని భాగంగా మనం అర్థం చేసుకోవాలి. 1923లో సావర్కర్ రాసిన 'హిందుత్వ' పుస్తకంలో రెండు జాతుల విద్వేషభరిత, విషపూరిత సిద్ధాంతానికి ప్రాణం పోశాడు. భారతదేశంలో ముస్లింలకు స్థానం లేదని ఘోషించాడు. ఆ వెంటనే 1925లో పరమ ప్రతిఘాతుక హిందుత్వ సంస్థ **"రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్"** (ఆర్.ఎస్.ఎస్) స్థాపకులలో ముఖ్యుడిగా ముందుకువచ్చాడు. 1937లో **హిందూ మహాసభ**ను ఏర్పర్చాడు.

దేశంలో కోట్లాది ప్రజలు పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలసవాద సంకెళ్లు తెంచు కోవడానికి **'చావో రేవో'** (డూ ఆర్ డై) అంటూ **'క్విట్ ఇండియా'** ఉద్యమానికి పూనుకుంటే ఈయన నాయకత్వంలోని హిందూ మహాసభ దానికి వ్యతిరేకంగా వలసవాదులకు వంత పాడిన విద్రోహ చరిత్ర విరాటపురుషుడు సావర్కర్. అలాంటివాడి జన్మదినాన్ని స్వతంత్ర్య సమరయోధుల గౌరవదినంగా పాటించాలంటూ రాజు మించిన రాజభక్తితో షిండే అండ్ కంపెనీ అతడి విద్రోహాన్ని కప్పిపుచ్చుతున్నారు. దీనిని నిర్ద్వంద్వంగా ఖండించాలి.

కాంగ్రెస్ నాయకులలో ఒకరైన సుభాష్ చంద్రబోస్‌ను వెన్నుపోటు పొడిచిన ఘనమైన చరిత్ర కలిగినవాడు సావర్కర్. బోస్ భారత యువతీ-యువకులతో 'ఇండియన్ నేషనల్ ఆర్మీ'ని ఏర్పర్చి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రకటించగా,

**మిగతాది 38 వ పేజీలో**

# ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో కార్మికుల పోరాట ప్రదర్శనలు

